సంపుటము–I
సమావేశము–XXX
నంబరు. 2

వెల : రూ. 9–00
07 మార్చి, 2018
బుధవారము
హేవళంబి నామ సం.
ఫాల్గుణ బ. 6

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| (1) | సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం | 01–01 |
| (2) | ప్రశ్నోత్తరాలు | 01–26 |
| (3) | సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు | 26–26 |
| | 1. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు, 2017, ఆంధ్రప్రదేశ్ పోలీసు(సంస్కరణల) (సవరణ)ఆర్డినెన్స్ (2017 సంవత్సరపు ఆం.ప్ర. ఆర్డినెన్స్ నం.4) ప్రతి, భారత రాజ్యాంగంలోని 213వ అధికరణం 2 (ఎ) ఖండం క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ. | |
| | 2. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు, 2018, ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయముల (స్థాపన మరియు క్రమబద్ధీకరణ) (సవరణ) ఆర్డినెన్స్ (2018 సంవత్సరపు ఆం.ప్ర. ఆర్డినెన్స్ నం.1) ప్రతి, భారత రాజ్యాంగంలోని 213వ అధికరణం 2 (ఎ) ఖండం క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ. | |
| | 3. వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, 2016–17 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ లిమిటెడ్, 40వ వార్షిక నివేదిక ప్రతి, 2013, కంపెనీల చట్టంలోని సెక్షన్ 394 క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ. | |
| | 4. ఇంధన శాఖ మంత్రి శ్రీ కిమిడి కళా వెంకట రావు, 2015–2016 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, 16వ వార్షిక నివేదిక ప్రతి, 1956, కంపెనీల చట్టంలోని 617,619,619–ఎ, 619–బి సెక్షన్లకు అనుగుణంగా ప్రతి సమర్పణ. | |
| | 5. ఇంధన శాఖ మంత్రి శ్రీ కిమిడి కళా వెంకట రావు, 2016–17 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, వార్షిక నివేదిక ప్రతి, 2013, కంపెనీల చట్టంలోని 394 సెక్షన్‌కు అనుగుణంగా ప్రతి సమర్పణ. | |
| (4) | సభా సమక్షంలో పెట్టబడిన పత్రం<br>సభా నాయకులు శ్రీ యనమల రామకృష్ణుడు, 2018 మార్చి 5వ తేదీన జరిగిన కార్యక్రమ సలహా సమితి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై నివేదిక ప్రతి సమర్పణ | 26–26 |
| (5) | సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు | 26–27 |
| (6) | సభా కార్యక్రమం – అర్జీల సమర్పణ | 28–29 |
| (7) | గవర్నరు ప్రసంగంపై తీర్మానం – చర్చ | 29–72 |


J. No. 135/18

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ ఎన్. ఎం.డి. ఫరూక్ |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీమతి పామిడి శమంతకమణి |
| | | శ్రీ వాకాటి నారాయణ రెడ్డి |
| | | శ్రీ బొడ్డు నాగేశ్వర రావు |
| కార్యదర్శి (ఇన్‌ఛార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ కె. రాజకుమార్ |
| | | శ్రీమతి ఆర్. వనితారాణి |
| | | డా. వై. కామేశ్వరి |
| | | శ్రీ ఇ. సంజీవరావు |
| | | శ్రీ కె. వెంకటేశ్వరరావు |
| | | శ్రీ డి. జగన్‌మోహన్‌రావు |
| | | శ్రీ బి. ప్రభాకరరావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్

## బుధవారం, 07వ తేది, మార్చి, 2018

----

(సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది)

(మిస్టర్ చైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

<u>1.సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం</u>

**మిస్టర్ చైర్మన్:** ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు గురించి శ్రీ కత్తి నరసింహా రెడ్డి గారు ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి (ఉపాధ్యాయ నియోజక వర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** (మైక్ లేదు) అధ్యక్షా, ఇది ప్రజలకు సంబంధించిన అంశం. మీడియాలో కూడా ఆ వార్త వచ్చింది. పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక హోదా ఇవ్వాలని చెప్పారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలకే దిక్కు లేకపోతే ఎలా? పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలపై చర్చ జరగాలి. మాకు అవకాశం ఇవ్వండి.

మిస్టర్ చైర్మన్: వేరే form లో రండి. తప్పకుండా అవకాశమిస్తాను.

<u>2.ప్రశ్నోత్తరాలు</u>

<u>అన్ని గ్రామాలకు త్రాగునీరు</u>

ప్రశ్న నెం. 10069 (1)

**శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వర రావు, డా. ఎంవివిఎస్ మూర్తి, వట్టికూటి వీర వెంకన్న చౌదరి, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

**అ)** రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు త్రాగునీరు సరఫరా చేయడం కోసం నూతన సాంకేతిక పరిజ్ఞానాలు అమలు చేయాలనే ఆలోచనలో ఉన్న విషయం వాస్తవమేనా;

**ఆ)** అయితే, ఆ వివరాలేమిటి?

**గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ మరియు కమ్యూనికేషన్ల శాఖా మంత్రి (శ్రీ నారా లోకేశ్):**

**అ)** అవునండీ.

**ఆ)** గ్రామీణ నీటి సరఫరా శాఖలో ప్రయత్నించిన సాంకేతిక పరిజ్ఞానాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1.యస్‌సిఎడిఎ (పర్యవేక్షణ నియంత్రణ మరియు డేటా సేకరణ)

2.త్రాగునీటిలో ఫ్లోరైడ్ తొలగించడానికి నానో టెక్నాలజీ

3.ఆన్‌లైన్ మానిటరింగ్‌తో ఐనైజేషన్ మరియు యువి ద్వారా అంటువ్యాధుల నివారణ

4. ఓజోన్ ఆధారిత అంటువ్యాధుల నివారణ వ్యవస్థ.

**శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు (స్థానిక సంస్థలు – విజయనగరం):** అధ్యక్షా, ఈ రోజు త్రాగునీటి విషయంలో టెక్నాలజీని తీసుకువచ్చి, రక్షిత మంచినీటిని ప్రతి ఇంటికి ఇవ్వడం చాలా అదృష్టం. మంత్రివర్యులను అభినందిస్తూ, డ్రింకింగ్ వాటర్ ప్రొటెక్టెడ్ స్కీములను విజయనగరం జిల్లాకు కూడా ఇస్తే బాగుంటుందని మనవిచేస్తున్నాను. ఆ స్కీము విజయనగరంకు లేదని తెలుస్తోంది. ఆ విషయాన్ని మీ ద్వారా గౌరవ మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను.

**డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి (స్థానిక సంస్థలు – విశాఖపట్టణం):** అధ్యక్షా, మనమందరం పంచాయతీ రాజ్ శాఖామంత్రివర్యులను అభినందించాలి. ఎందుకంటే భారతదేశంలోనే ఫ్లోరైడ్ పెద్ద సమస్య. ఆంధ్రప్రదేశ్‌లో మరీ ఎక్కువ. ఇదివరకు శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లోనే ఫ్లోరైడ్ ఉంది అనుకునేవాళ్లం. ఇప్పుడు కొత్తగా ఫ్లోరైడ్ నీటి సమస్య పెరిగిపోయింది. Water levels are depleting. గ్రౌండ్ వాటర్‌ను ఎక్కువ వాడడం వల్ల భూమిలో ఉన్న మినరల్స్, మెటల్స్ పైకి వస్తున్నాయి. దీనితో drinking water has became a big problem in the rural areas. చాలా గ్రామాలలో ఈనాడు ఆ నీటిని త్రాగడంవల్ల రోగాల బారిన పడుతున్నారు. వారికి మంచినీటిని సప్లై చేయడమన్నది పెద్ద సమస్య. ఎందుకంటే నదులలోనుండి ప్రవహించే నీటిని ఇవ్వాలి తప్ప గ్రౌండ్ వాటర్‌ను ప్యూరిఫై చేసి ఇవ్వడమనేది చాలా కష్టమైన పని. టెక్నాలజీ మంచిదే. కానీ, దీనిని ఉపయోగించడానికి ఎన్ని సంవత్సరాలు పడతుంది? ఇప్పటివరకూ ఎక్కడైనా ఉపయోగించామా? ఒకవేళ అటువంటి టెక్నాలజీని ఉపయోగిస్తే అవి బాగా పనిచేస్తున్నాయా? ఏయే గ్రామాలలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఉపయోగించారు? ఆ వివరాలను మనముందుంచితే తెలుసుకోవడానికి అవకాశముంటుందని మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ వట్టికూటి వీర వెంకన్న చౌదరి (శాసనసభ నియోజక వర్గం):** అధ్యక్షా, ప్రాణాధారమైన మంచినీటికి సంబంధించిన శాఖపై పూర్తి పరిజ్ఞానాన్ని, పట్టుని సాధించిన మంత్రివర్యులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను. మంచినీటి విషయంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాలలో చేపలు, రొయ్యల సాగు అధికంగా ఉన్నచోట కాలుష్యం వల్ల మంచినీటికి ఇబ్బంది కలుగుతున్నది. అందుకు ఏదైనా పటిష్టమైన ప్రణాళికను రూపొందించుకోవలసిన అవసరం ఉన్నది. ఎక్కడైతే ఆక్వాకల్చర్ ఎక్కువగా ఉన్నదో అక్కడ మనం తీసుకుంటున్న చర్యలేమిటి? దానికేదైనా దీర్ఘకాలిక ప్రణాళిక ఉన్నదా అని చర్చించుకోవలసిన అవసరమున్నది. అంతేకాకుండా, మూర్తిగారు చెప్పిన విధంగా ఫ్లోరైడ్ సమస్య వల్ల అనేక వ్యాధులను మనం చూస్తున్నాము. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలో ఉద్దానం ప్రాంతంలో కొన్ని రకాల వ్యాధులను మనం చూస్తున్నాము. అలాగే, మిగిలిన చాలా ప్రాంతాలలో కూడా మనం ఈ సమస్యను ఎదుర్కొంటున్నాము. వాటిపై తీసుకున్న దీర్ఘకాలిక ప్రణాళికలు ఏమిటనేవి మంత్రివర్యులు సభాముఖంగా తెలియచేయాలని కోరుతున్నాను.

**శ్రీ బొడ్డు నాగేశ్వర రావు(పట్టభద్రుల నియోజక వర్గం – కృష్ణా, గుంటూరు):** మంత్రిగారు ఇంటికొక కుళాయి అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంతోషం. ముఖ్యంగా త్రాగునీటి వల్ల అనేక వ్యాధులకు గురయ్యే పరిస్థితి ఉన్నది. కృష్ణాజిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల నీటిలో అధికశాతం ఫ్లోరైడ్ కంటెంట్ ఉండడం వల్ల కీళ్లకు సంబంధించిన వ్యాధులు రావడం, వాటికోసం పవర్‌ఫుల్ మెడిసిన్స్ వాడడంతో కిడ్నీ వ్యాధులు రావడం జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానంలోనే కాదు, ఇప్పుడు కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలంలో 200 మందికి పైగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. నేను స్వయంగా వెళ్లి 6 గ్రామాలు సందర్శించి వచ్చాను. మంత్రిగారికి నేను సభాముఖంగా విన్నవించేదేమంటే, ఇటువంటి ప్రాంతాలలో యుద్ధప్రాతిపదికన త్రాగునీటి సౌకర్యం కల్పించాలి. కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలంలో రామచంద్రాపురం వరకూ కృష్ణానదీ జలాల పైప్‌లైన్ వచ్చింది. దానిని ఈ గ్రామాలకు కూడా ఎక్స్‌టెండ్ చేస్తే సరిపోతుంది. దానికి ప్రాధాన్యతనిచ్చి రక్షిత త్రాగునీటిని అందించి ఆ గ్రామాల ప్రజలను వ్యాధుల బారి నుండి రక్షించాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ (స్థానిక సంస్థలు – కృష్ణా):** అధ్యక్షా, మంత్రిగారు ఈ శాఖకు వచ్చిన తరువాత పంచాయతీరాజ్ శాఖలో గత 70 సంవత్సరాలలో లేనటువంటి నూతన విప్లవాత్మకమైన మార్పులు, అభివృద్ధి కార్యక్రమాలు జరగడం సంతోషం. వారికి అభినందనలు తెలియచేస్తున్నాను. అన్ని గ్రామాలకు త్రాగునీటిని అందిస్తామని చెప్పడం చాలా సంతోషం. కానీ, చాలా గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయడానికి కనీస మౌలిక సౌకర్యాలు, సిబ్బంది లేని పరిస్థితి ఉన్నది. అన్ని గ్రామాలలో, ప్రతినెలా కచ్చితంగా అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులను క్లీన్ చేయించడానికి ఏదైనా ప్రణాళిక కోసం ఆలోచిస్తున్నారా అని మంత్రిగారిని తమ ద్వారా అడుగుతున్నాను. ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు వంద రూపాయలకే నీటి కనెక్షన్ ఇవ్వడం జరుగుతోంది. అలాగే, గ్రామ పంచాయతీలలో కూడా ఎస్సీ, ఎస్టీలకు మినిమమ్ ఫీజుతో ఇంటింటికి కుళాయి ఇచ్చే పథకం కూడా ప్రవేశపెట్టవలసిందిగా మీ ద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ సోము వీర్రాజు (శాసనసభ నియోజక వర్గం):** ఇంకా కుళాయి కనెక్షన్‌కు రూ. 2,000లు, 3,000 వసూలు చేసే గ్రామాలు కొన్ని ఉన్నాయి. కేంద్రప్రభుత్వ పథకమైన 'అమృత్' క్రింద అన్ని మున్సిపాలిటీలకు రూ.200లకే కనెక్షన్ ఇచ్చే పరిస్థితిలో గ్రామాలలో కూడా దానిని కొద్దిగా సడలించి ఎన్ఆర్ఇజిఎస్ పథకం క్రింద తక్కువ ఖర్చుతో కుళాయి కనెక్షన్లను మంజూరు చేసే ప్రతిపాదన ఏదైనా ఉందా? పంచాయతీలలో నీటి కొలమానం పి.హెచ్.ని పరిశీలించాలని కోరుతున్నాను. నీటిలో పి.హెచ్ ఎంత ఉన్నది అనేది పరిశీలించాలి. గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు తరచుగా పి.హెచ్.లను పరిశీలించవలసిన బాధ్యత ఉన్నది. ఔట్‌సోర్సింగ్‌లో ఆ శాఖకు సంబంధించి ఎంతమంది పనిచేస్తున్నారు? వారికి వేతనాలు ఇస్తున్నారా? ఈ సిస్టమ్ కంటిన్యూ అవుతోందా? దీనిని బలోపేతం చేసే ఆలోచన ఏమైనా ఉందా? పి.హెచ్. లను గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ వారు రెగ్యులర్‌గా మానిటర్ చేయగలిగితే నీటికి సంబంధించిన చాలా సమస్యలు పరిష్కారమయ్యేందుకు అవకాశముంటుందని నా అభిప్రాయం. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఎన్.టి.ఆర్.గారి పేరుమీద అనేకమైన చోట్ల కొంత పబ్లిక్ కంట్రిబ్యూషన్ తీసుకున్నాము. కానీ, దానికి డే బై డే కరెంట్ బిల్లులు కూడా కట్టలేని పరిస్థితి గమనించాము. దానికి కూడా కేంద్రప్రభుత్వం రూ. 50 కోట్లు రిలీజ్ చేసింది. దానిని కంటిన్యూ చేసి, ఇంకా స్ట్రెంగ్తెన్ చేస్తే నీటి సమస్య తొలగడానికి అవకాశమేర్పడుతుంది. ఎన్‌టిఆర్ గారి పేరుతో పెట్టిన నీటి ట్యాంకుల ద్వారా ప్రజలకు రూ.2లకే టిన్ ఇచ్చే కార్యక్రమానికి ఇంకా ఎక్కువ నిధులు సేకరించి ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖ ద్వారా దానిని స్ట్రెంగ్తెన్ చేసే ఆలోచనలు ఏమైనా ఉన్నాయా అని మంత్రిగారిని తమ ద్వారా కోరుతున్నాను.

ఉ. 10.10

**శ్రీ నారా లోకేశ్:** అధ్యక్షా, నేను మంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన వెంటనే, ఒక పర్‌ఫెక్ట్ వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి త్రాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం చేయాలనీ, ఇంటింటికీ కుళాయి ఇవ్వాలని ముఖ్యమంత్రిగారు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే ఇప్పటికే వాటర్ కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసి, వాటర్‌గ్రిడ్‌కు కావాల్సిన నిధులు కూడా కేటాయించడం జరిగింది. వీటికి సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియకు కూడా వెళ్తున్నాము. గౌరవ శాసనపరిషత్తు సభ్యులందరూ కూడా మాట్లాడడం జరిగింది. ఆరు నెలల్లో పశ్చిమగోదావరి, కృష్ణా రెండు జిల్లాల్లో నూటికి నూరు శాతం ఇంటింటికి కుళాయి ఇచ్చే బాధ్యతను నేను వ్యక్తిగతంగా తీసుకుంటానని సభా ముఖంగా మీ ద్వారా తెలియజేస్తున్నాను.

(సభ్యుల హర్షధ్వానాలు)

అంతేగాకుండా, ఆ రెండు జిల్లాలు కాకుండా మిగిలిన జిల్లాల్లోనూ, నియోజకవర్గాల్లోనూ, ప్రత్యేకించి రాయలసీమలో కొంచెం ఎక్కువ సమయం పడుతుంది. అయినా రెండు సంవత్సరాలలో పూర్తి చెయ్యాలని టెండరు నిబంధనలలో పెట్టడం జరుగుతుంది. ఎందుకంటే మనం గ్రిడ్‌లు ఏర్పాటుచేస్తున్నా, ఓహెచ్ఎస్ఆర్‌లు కడుతున్నా

క్వాలిటీ రియల్‌టైమ్ మానిటరింగ్ అనేది జరగడంలేదు. మనం నమూనా తీసుకెళ్ళి ల్యాబ్‌లకు పంపితే, ఆ నివేదిక రావడానికి కనీసం ఒక నెల సమయం పడుతుంది. వీటన్నింటినీ అధిగమించాలనే ఉద్దేశంతో మేము కొత్త టెక్నాలజీని కనుక్కొని, ఆస్ట్రేలియన్ కంపెనీతో అయిదు పైలెట్లు కూడా చేయడం జరిగింది. దానికి సంబంధించిన వ్యాలిడేషన్ ఇప్పుడు జరుగుతోంది. 60 పారామీటర్లు. **Silica Fluoride PHA** అనే కాదు, **Fecon matter**, అల్యూమినియం, ఐరెన్ వంటివి రియల్‌టైమ్ తెలియడానికి అవకాశముంటుంది. దీనికొరకు ముఖ్యమంత్రిగారు ఒక వాటర్ రూం ఏర్పాటు చేయమన్నారు. అలాగే, 17,000 ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు ఉన్నాయి. ప్రతి ఓహెచ్‌ఎస్‌ఆర్‌లకు సెన్సర్ పెట్టి **Ionization** చెయ్యమన్నారు. **Chlorination** అనేది పాత టెక్నాలజీ కాబట్టి, అది అంత సరైన విధానం కాదనే ఉద్దేశంతో **Direct Ionization** చేస్తేనే పర్‌ఫెక్ట్ త్రాగునీరు వస్తుందనే అభిప్రాయంతో ఆ కార్యక్రమం కూడా చేస్తున్నామని మీ ద్వారా గౌరవ శాసనపరిషత్తు సభ్యులందరికీ తెలియజేస్తున్నాము.

అధ్యక్షా, ఎన్.టి.ఆర్ సుజల వాటర్ ప్లాంట్ గురించి కూడా గౌరవ సభ్యులు మాట్లాడడం జరిగింది. వాస్తవానికి మనం ఇండిపెండెంట్‌గా పెట్టుకున్న వాటర్‌ప్లాంట్‌లు సరిగా పనిచెయ్యడం లేదు. నేను మంత్రికాక ముందు ఎన్.టి.ఆర్ ట్రస్టులో ఉన్నప్పుడు దాదాపు అలాంటి వాటర్‌ప్లాంట్లను వందలకొద్దీ పెట్టాము. ఆ మోడల్ ఫెయిలైంది. ఆ తరువాత ముఖ్యమంత్రిగారి నియోజకవర్గంలోనే హబ్ అండ్ స్పోక్ మోడల్ క్రింద ఎన్.టి.ఆర్ సుజల వాటర్ ప్లాంట్ కార్యక్రమం చేపట్టగా, అది పెద్ద ఎత్తున విజయవంతమైంది. ఆ మోడల్ విధానమేంటంటే సెంటర్ ప్లాంట్ ఒకటి ఉంటుంది. అక్కడ నీటిని శుద్ధి చేస్తారు. ట్యాంకర్ల ద్వారా డిస్పెన్సింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. రెండు, మూడు వీధులకు ఒక ప్లాంట్‌ను అక్కడే పెట్టి, ఏ.టి.ఎం కార్డు వంటి కార్డుద్వారా ఆ ప్లాంట్‌నుంచి నీళ్ళు వచ్చేవిధంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే మన సి.ఆర్.డి.ఏలో చేయడం జరిగింది. ఉద్ధానంలో కూడా చేశాము. గౌరవ సభ్యులు సోము వీర్రాజుగారు కూడా వీటి గురించి అగారు. ఈ కార్యక్రమాలకు రూ.400కోట్లు కేటాయించడం జరిగింది. మొత్తం 106 క్లస్టర్లు ఉన్నాయి. వీటికి సంబంధించి టెండర్ల ప్రక్రియకు వెళ్తున్నాము. త్వరలోనే వాటిని పూర్తి చేస్తాము. దీనికి ఆరు నెలల సమయం కూడా ఇవ్వడం జరిగింది. అలాగే, స్కీముల మెయింటెనెన్స్ మరిచిపోతున్నాము. మార్చి నెల 15 కల్లా అన్ని స్కీములపై రివ్యూ పెట్టాము. అప్పటిలోగా మెయింటెనెన్స్‌కు ఎంత ఖర్చవుతుందో కాలిక్యులేట్ చేస్తాము. మార్చి నెలాఖరులోపు తప్పనిసరిగా స్కీముల మెయింటెనెన్స్‌ను 100 శాతం పూర్తిచేయడమే గాకుండా రెగ్యులర్ మెయింటెనెన్స్ షెడ్యూల్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది.

అధ్యక్షా, కొంతమంది గౌరవ సభ్యులు ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంకుల క్లీనింగ్ గురించి మాట్లాడారు. దీనికి సంబంధించి సెవెన్ స్టెప్స్ ప్రాసెస్‌ను అవలంబిస్తూ, సెంట్రలైజ్డ్ మోడల్ ఏర్పాటుచేస్తున్నాము. అప్పుడు ఇక్కడినుంచే మేము మానిటర్ చేయగలుగుతాము. ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంకుల క్లీనింగ్ ఈరోజు జరిగిందా, లేదా? నాణ్యత మెరుగైందా లేదా? అని తనిఖీ చేస్తూ వీటిని కూడా రియల్ టైమ్ మానిటరింగ్‌లోకి తీసుకురావడం జరుగుతుంది. కొన్ని ఓ.హెచ్.ఎస్.ఆర్‌లను కట్టి 20 సంవత్సరాలవడంవల్ల పాతబడి అవన్నీ ఇప్పుడు మరమ్మతులకు రాగా, వాటికి

రూ.75కోట్లు కేటాయించడం జరిగింది. కొన్ని పాత ఓ.హెచ్.ఎస్.ఆర్‌లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయడం జరిగింది.

అదేవిధంగా, ఇంటింటికీ కుళాయిల గురించి కొన్ని పంచాయతీలలో రూ.3000 నుంచి రూ.4000 వరకూ వసూలు చేస్తున్నారని కొంతమంది గౌరవ సభ్యులు చెప్పారు. ఆ పంచాయితీల వివరాలను గౌరవ సభ్యుల నుండి తీసుకుంటాను. వాస్తవంగా పంచాయతీలలో అధికారాలను సర్పంచులకు ఇచ్చాము కాబట్టి, ఆ బాధ్యత వాళ్ళపైన ఉంది. అయినా, దీనిని ఒక **standardised format** కింద తీసుకొస్తాము. అలాగే, ఎస్.సి, ఎస్.టిలకు ఉచితంగా నీటి కనెక్షన్ ఇస్తే బాగుంటుందని కోరడం జరిగింది. రాష్ట్రంలోని గ్రామాలలో 80లక్షల కుటుంబాలు ఉన్నాయి. వాళ్ళందరికీ మొదటి రౌండ్‌లోనే ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇచ్చే బాధ్యత ఈ తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుంటుందని సభా ముఖంగా మీ అందరికీ తెలియజేస్తున్నాను.

(సభ్యుల హర్షధ్వానాలు)

అధ్యక్షా, త్రాగునీటి సమస్య ఈరోజుది కాదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 70 సంవత్సరాలైనా త్రాగునీటి సమస్య మనల్ని వెంటాడుతోంది. అందుకే ఈ వాటర్ గ్రిడ్ మోడల్ క్రింద ప్రతి వ్యక్తికీ రోజుకు 70 లీటర్లు ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచన. అందుకే వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేశాము. ఈ మోడల్ క్రింద రెండు జిల్లాలు పూర్తిచేస్తాము. రాబోయే ఆరు నెలల్లో తప్పనిసరిగా 17,000 ఓ.హెచ్.ఎస్.ఆర్‌లకు రియల్ టైమ్ మానిటరింగ్ ఏర్పాటు చేస్తామని సభా ముఖంగా మనవి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

## <u>బి.సి. సంక్షేమశాఖకు నిధుల కేటాయింపు</u>

ప్రశ్న నెం. 10245 (2)

**శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** 2017-18 లో బి.సి సంక్షేమానికి కేటాయించిన నిధులు మొత్తం మరియు విడుదల చేసిన నిధుల మొత్తం ఎంత;

**ఆ)** 2014-15, 2015-16 మరియు 2016-17 ఆర్థిక సంవత్సరంలో బి.సి సంక్షేమానికి కేటాయించిన నిధులు మరియు విడుదల చేసిన నిధుల మొత్తం ఎంత;

**ఇ)** ఆ నిధులలో ఖర్చు చేసిన నిధుల మొత్తం ఎంత?

**గౌరవనీయులైన రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమం, జౌళి మరియు చేనేత శాఖ మంత్రి (శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు):**

అ) అవునండీ,

| | | |
|---|---|---|
| 2017-2018 – కేటాయించిన నిధులు | : | రూ. 5015.70 కోట్లు |
| విడుదల చేసిన నిధులు | : | రూ. 4844.25 కోట్లు (96%) |

ఆ ) అవునండీ.

| | | |
|---|---|---|
| 2014-2015 – కేటాయించిన నిధులు | : | రూ. 2665.09 కోట్లు |
| విడుదల చేసిన నిధులు | : | రూ. 2578.69 కోట్లు (96%) |
| 2015-2016 – కేటాయించిన నిధులు | : | రూ. 3210.12 కోట్లు |
| విడుదల చేసిన నిధులు | : | రూ. 3150.12 కోట్లు (98%) |
| 2016-2017 – కేటాయించిన నిధులు | : | రూ. 5113.94 కోట్లు |
| విడుదల చేసిన నిధులు | : | రూ. 4987.49 కోట్లు (97%) |

ఇ) అవునండీ.

| | | |
|---|---|---|
| 2014-2015 – ఖర్చు చేసిన మొత్తం | : | రూ. 2242.16 కోట్లు (86%) |
| 2015-2016 – ఖర్చు చేసిన మొత్తం | : | రూ. 2573.50 కోట్లు (81%) |
| 2016-2017 – ఖర్చు చేసిన మొత్తం | : | రూ. 4699.80 కోట్లు (94%) |
| 2017-2018 – ఖర్చు చేసిన మొత్తం | : | రూ. 3537.21 కోట్లు (73%) |

ఈ మూడు, నాలుగు సంవత్సరాలలో బి.సి డిపార్టుమెంట్‌కు ఈ విధంగా నిధులు ఖర్చు చేయడం జరిగిందని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**మిస్టర్‌చైర్మన్:** ప్రశ్న అడిగిన సభ్యులు సభలో లేరు. తదుపరి ప్రశ్నకు వెళదాం.

## విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైల్ ప్రాజెక్టు

ప్రశ్న నెం. 9981(3)

**శ్రీమతి టి. రత్నాబాయి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైలు ప్రాజెక్టుల ప్రతిపాదన ప్రస్తుతం ఏ దశలో ఉన్నది;

**ఆ)** ఆ రెండు ప్రాజెక్టులను సమర్ధవంతంగా అమలు చేయడానికి తీసుకుంటున్న చర్యలేమిటి ?

**గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి మరియు పట్టణ గృహనిర్మాణ శాఖ మంత్రి (డా. పి.నారాయణ):**

అ) విజయవాడ మరియు విశాఖపట్నం మెట్రోరైలు ప్రాజెక్టులకు సంబంధించిన డిపిఆర్‌లను ఆమోదం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరుసగా 29-06-2015, 29-11-2015 తేదీలలో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కొత్త మెట్రో పాలసీ ప్రకారంగా డిపిఆర్‌లను తిరిగి సమర్పించాలని కోరుతూ కేంద్రప్రభుత్వం 01-09-2017 తేదీన డిపిఆర్‌లను తిప్పి పంపింది.

ఆ) (i) మెసర్స్ సిస్ట్రా (ఫ్రాన్స్) అనే ఒక అంతర్జాతీయ కన్సల్టింగు ఏజెన్సీ విజయవాడకు సంబంధించిన లైట్ మెట్రో డిపిఆర్‌ను రూపొందిస్తున్నది.

(ii) కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టు కోసం అమరావతి మెట్రోరైల్ కార్పొరేషన్ పిపిపి విధానంలో టెండర్ ప్రక్రియను ప్రవేశపెట్టింది. 5 గురు ముఖ్య బిడ్డర్లు 27-02-2018 తేదీన తమ ఇఓఐని సమర్పించారు. బిడ్డర్లను షార్ట్‌లిస్ట్ చేయడానికి సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

**శ్రీమతి టి.రత్నాబాయి (నామినేటెడ్):** అధ్యక్షా, ఈరోజున ట్రాఫిక్ కండిషన్స్ ఎంత భయంకరంగా ఉన్నాయో తెలియంది కాదు. వాటిని అధిగమించాలంటే మెట్రోరైలు అవసరం. టెండర్లను పిలిచి షార్ట్ లిస్టు చేయడానికి సంబంధించిన ప్రక్రియ గురించి చెప్పారు. ఈ ప్రక్రియ అంతా వేగంగా చేస్తే తప్ప కాదు. ఎందుకంటే ఇప్పుడు విజయవాడలో ట్రాఫిక్ చాలా భయంకరంగా ఉంది. కాబట్టి మెట్రోరైలు ప్రక్రియను వేగవంతం చేయడానికి మీరేమి చర్యలు తీసుకుంటారు? ఎప్పటిలోగా చేస్తారో దయచేసి మంత్రిగారిని చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

ఉ.10.20

**డా. పి. నారాయణ:** అధ్యక్షా, మెట్రోరైలుకు సంబంధించి రాష్ట్ర పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో మెన్షన్ చేశారు. ఒక సంవత్సరంలోపు ప్రాసెస్ చేసి టేకప్ చేయమన్నారు. అయితే 22 సెప్టెంబరు 2015న ఇన్ ప్రిన్సిపల్ కేంద్రప్రభుత్వం అంగీకరించింది, అయితే 29-9-2015న కేంద్రప్రభుత్వం పెట్టిన నిబంధనలతో రాష్ట్రప్రభుత్వం అంగీకరిస్తూ లేఖ పంపించింది. అయితే ఇది పూర్తి కావాలంటే Public Investment Board (PIB) లో ఆమోదం పొందాలి. 25-5-2016వ తేదీన Pre PIB meeting లో అంగీకరించారు. మరలా 23-2-2017న జరిగిన PIB మీటింగులో రిజెక్ట్ చేశారు. మెట్రోరైలుకు కొత్త పాలసీ వస్తుంది, ఆ కొత్త పాలసీలో పెట్టమని చెబుతూ మన డిపిఆర్‌ను తిరిగి వెనక్కి పంపించారు. 27-8-2017వ తేదీన కొత్త పాలసీ వచ్చింది. ఆ కొత్త పాలసీలో ఉన్న కండిషన్స్ ప్రకారం మరలా డిపిఆర్‌ను పెట్టాల్సి వస్తోంది. అయితే రాష్ట్ర పునర్విభజన చట్టం 2014లోని షెడ్యూల్13 ప్రకారం మనకు ఒకసంవత్సరంలో ఫీజిబిలిటీ స్టడీ చేసి దానిని ముందుకు తీసుకువెళ్లమన్నారు, అయితే మనం ప్రాసెస్ చేసి డిపిఆర్ అన్ని కూడా ఒక సంవత్సరంలోనే సబ్మిట్ చేయడం జరిగింది. అయితే కొత్త పాలసీ ప్రకారం రిజెక్ట్ చేశారు. అందుకు సంబంధించి ముఖ్యమంత్రి గారు కూడా 29-6-2015న కేంద్ర ఆర్థికశాఖా మంత్రిగారికి ఒక లెటర్ రాయడం జరిగింది. ఆ లెటర్‌ను తిరస్కరిస్తూ మరలా లెటర్ వచ్చింది. అందువలన కొత్తపాలసీ ప్రకారం డిపిఆర్ రెడీ చేసి ముందుకు వెళ్లడం జరుగుతోంది.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్ (పట్టభద్రుల నియోజకవర్గం- శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం):** అధ్యక్షా, మెట్రోరైలును ఎందుకు తిరస్కరించారో తెలియజేయాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. అలాగే ఫిబ్రవరి 28వ తేదీన 5 కంపెనీలు పిపిపి మోడ్‌లో విజయవాడ మెట్రోకు టెండర్లు వేయడం జరిగింది. వాటి వివరాలు కూడా తెలియజేస్తే బాగుంటుంది. ముఖ్యంగా Sastra Consultancy వారు విజయవాడ, విశాఖపట్నంలకు సంబంధించిన రిపోర్టు viable కాదని, దాని మోడల్ ఏవిధంగా మార్చాలనే అంశాన్ని కూడా చెప్పడం జరిగింది ఆ వివరాలు కూడా సభకు తెలియజేస్తే బాగుంటుందని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**డా. పి. నారాయణ:** అధ్యక్షా, విశాఖపట్టణం మెట్రోకు సంబంధించి పిపిపి మోడ్‌లో టెండర్లు పిలవడం జరిగింది, దానికి 5 మేజర్ డెవలపర్స్ వచ్చారు. ఆదాని గ్రూప్, షాపూర్జీ, టాటా ప్రాజెక్ట్సు, ఎస్ఎల్ గ్రూపు, ఐఎల్ఎఫ్ఎస్ గ్రూప్స్ వచ్చాయి. బిడ్డింగ్స్ ఓపెన్ ప్రాసెజరుగుతోంది. ప్రాసెస్ పూర్తయిన తరవాత ఎలిజిబిలిటీ ఉన్నవారికి ఫైనలైజ్ చేసి ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుంది. అదేవిధంగా విజయవాడకు సంబంధించి జనాభా తక్కువగా ఉంది కాబట్టి మేజర్ మెట్రో కంటే కూడా లైట్ మెట్రో అయితే బెటర్ అని సజెస్ట్ చేయడం జరిగింది. అదేవిధంగా, కేంద్రమంత్రి గారిని, కేంద్ర ప్రభుత్వ సెక్రటరీలను నేను కలిసినప్పుడు వారు చెప్పిందేమంటే – విజయవాడ జనాభాకు రాబోయే 50 సంవత్సరాల వరకు లైట్ మెట్రో చాలన్నారు. దానిమీద Sastra Consultancy వారికి ఇచ్చాము. వారు స్టడీ చేస్తున్నారు. నివేదిక రాగానే దానిమీద యాక్షన్ తీసుకోవడం జరుగుతుంది.

## <u>అంత్యక్రియల కోసం నిర్మాణాలు</u>

ప్రశ్న నెం.10047(4)

**శ్రీమతి పోతుల సునీత, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి పట్టణ గృహ నిర్మాణ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** అన్ని మునిసిపాలిటీలలో మరణించిన సాధారణ ప్రజానీకానికి అంత్యక్రియలు ఏర్పాటు చేయడానికి ఏవైన స్మశాన వాటికల నిర్మాణాలు పరిశీలనలో ఉన్నాయా;

**ఆ)** అయతే, ఆ వివరాలేమిటి?

**గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి మరియు పట్టణ గృహనిర్మాణ శాఖ మంత్రి (డా. పి.నారాయణ):**

**అ)** అవునండీ.

**ఆ)** అన్ని యుఎల్‌బిలలో వివిధ కమ్యూనిటీలు వినియోగించుకోవడానికి సుమారు 1350 స్మశాన వాటికలు ఉన్నాయి. అంతేకాకుండా, అంత్యక్రియలు నిర్వహించడం కోసం 23 యుఎల్‌బిలలో ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయడమయింది. మిగిలిన యుఎల్‌బిలలో కూడా ప్రత్యేకంగా అంత్యక్రియలు నిర్వహించడం కోసం అదనపు విస్తీర్ణంతో నిర్మాణాన్ని చేపట్టాలని ప్రతిపాదించడమయింది.

**శ్రీమతి పోతుల సునీత (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, సభకు నమస్కారం. పేద మధ్యతరగతి ప్రజలు, అద్దె ఇళ్లలో ఉంటున్న వారు ప్రమాదానికి గురై లేదా ఆరోగ్యం బాగాలేక చనిపోతే ఆ శవాలను ఇంటి యజమానులు ఇళ్లలో పెట్టనివ్వరు. దీనివలన మునిసిపల్, అర్బన్ ఏరియాలలో చాలా ఇబ్బందిగా ఉంటున్నది. కాబట్టి అలాంటి వారికి అంత్యక్రియలు జరుపుకోవడానికి ఆరామక్షేత్రాలు నిర్మించవలసిన అవసరమున్నది. అవి నిర్మిస్తే వారికి ఆ సమస్య తొలగిపోతుంది కాబట్టి ఆరామక్షేత్రాలను నిర్మించాలని గౌరవ మంత్రివర్యులకు మీద్వారా తెలియజేస్తున్నాను.

**శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, సహజంగా మనకు పట్టణాలలో, గ్రామాలలో సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలకు దహనవాటికలు ఉన్నాయి. కానీ పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందిన తరవాత క్రిస్టియన్స్‌కు దహనవాటికలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికోసం కేటాయించిన స్థలంలో ఖననం చేయడం వలన స్థలం పూర్తయిపోయి ఇక అదనంగా వచ్చేవాటికి ఖననం చేయడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ విధంగా ఇబ్బందులు పడుతున్న క్రిస్టియన్స్‌కు ప్రతేకంగా కొత్తగా స్థలం కొనుగోలు చేసి గానీ, లేదా ప్రభుత్వ స్థలాలు

ఎక్కడైనా ఉంటే అక్కడ బరియల్ గ్రౌండ్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద ఏమైనా ప్రతిపాదనలున్నాయా అని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ రాజేంద్రప్రసాద్ గారు చెప్పినట్లు క్రిస్టియన్ శ్మశానవాటికలే కాకుండా పట్టణాలలో అద్దె ఇళ్లలో ఉంటున్న పేద మరియు మధ్యతరగతి వారు ఎవరైనా చనిపోతే అదే ఇంటిలో కర్మకాండలు నిర్వహించడం లేదా శవాన్ని దహనం చేసేవరకు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆ ఇంటి యజమానులు అనుమతించడం లేదు. ప్రత్యేక వసతి లేకపోవడం వలన ప్రభుత్వ వైద్యశాలల్లోని శవాగారాలలోనే శవాలను రెండురోజులు ఉంచమని, బంధువులు వచ్చి చూసిన తరవాత దహన సంస్కారాలు చేస్తామని రెక్వెస్ట్ చేస్తున్నారు. మా దగ్గరకు రెకమండేషన్స్ కోసం వస్తే మేము డాక్టర్లకు ఫోన్ చేసి చెప్పాల్సివస్తోంది. అందువలన అర్బన్ ఏరియాలలో శవాలను పెట్టుకోవడానికి రూమ్స్ ఏర్పాటుచేస్తే ప్రజలు మెచ్చుకుంటారు. ప్రభుత్వం దాని గురించి ఆలోచించాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**డా. పి.నారాయణ:** అధ్యక్షా, సభ్యులు అడిగిన విధంగా అద్దె ఇళ్లలో ఎవరైనా చనిపోతే ఆ బాడీలను అక్కడ ఉంచేందుకు కొంతమంది యజమానులు అంగీకరించడం లేదనేది వాస్తవమే. అయితే దానికి సంబంధించి కొన్ని మునిసిపాలిటీలలో ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయి, గౌరవసభ్యులు అడిగిన విధంగా కచ్చితంగా 110 మునిసిపాలిటీలలో ఆ ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. అదేవిధంగా క్రిస్టియన్స్, హిందూస్ కొన్నిచోట్ల ఖననం చేసిన తరవాత కట్టుబడి కడుతున్నారు. అలా స్థలాలు పూర్తయిపోయాయి. కొన్నిచోట్ల చనిపోయిన వారి కోసం స్థలాలు కావాలని రెక్వెస్ట్ చేస్తున్నారు. వారికి కూడా వీలైనంత వరకూ ఏర్పాటు చేయడం జరుగుతుంది.

## అమరావతికి ఔటర్ రింగ్ రోడ్డు

ప్రశ్న నెం.10288(5)

**శ్రీ టి.డి. జనార్ధన్, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** రాజధాని అమరావతి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ఏదేని ప్రతిపాదన పరిశీలనలో ఉందా;

ఆ) అయితే, జాతీయ రహదారిని ఎన్ని కిలోమీటర్ల మేర నిర్మించడమవుతుంది;

**ఇ)** ఈ ప్రతిపాదన క్రింద ఎన్ని జిల్లాలు మరియు గ్రామాలను వర్తింపచేయడమవుతుంది?

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి మరియు పట్టణ గృహనిర్మాణ శాఖ మంత్రి (డా. పి.నారాయణ):

అ) అవునండీ.

**ఆ)** ప్రతిపాదిత పొడవు 189 కిలో మీటర్లు.

**ఇ)** రెండు(2) జిల్లాలు మరియు ఎనభై ఏడు(87) గ్రామాలు.

**మిస్టర్ చైర్మన్:** సిగ్నేటరీస్ ఎవరూ లేరు. తరువాత ప్రశ్న నెం. 10262

<u>**ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేయుట**</u>

ప్రశ్న నెం.10262(6)

**సర్వ శ్రీ ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్, వెన్నపూస గోపాల్ రెడ్డి, కోలగట్ల వీరభద్రస్వామి, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** 2018, ఫిబ్రవరి వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలన్నింటిలో ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్య ఎంత;

**ఆ)** ఆ ఖాళీలను ఎపిపిఎస్సి ద్వారా భర్తీ చేసేందకు ఏదైనా ప్రతిపాదన ఉందా;

**ఇ)** అయితే, ఎప్పటిలోగా సదరు ఖాళీలను భర్తీ చేయడమవుతుంది?

**గౌరవ ఉప ముఖ్యమంత్రిగారి తరఫున గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు):**

**అ)** 24,209 పోస్టులు.

ఆ) అవునండీ.

**ఇ)** నేరు నియామక ఖాళీలు అంటే ప్రభుత్వ శాఖలలోని 24,209 ఖాళీ పోస్టులను భర్తీ చేసేందకు అనుమతి ఇవ్వడానికి సంబంధించిన ఫైలు సర్క్యులేషన్‌లో ఉంది. నియామక సంస్థల షెడ్యూలు ప్రకారం పోస్టులను భర్తీ చేయడమవుతుంది.

**మిస్టర్ చైర్మన్:** సిగ్నేటరీస్ అయిన శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, కోలగట్ల వీరభద్రస్వామి గార్లు ఎవరూ లేరు.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజక వర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు) :** మీరు అవకాశం ఇస్తే మాట్లాడతాము అధ్యక్షా.

**మిస్టర్ ఛైర్మన్:** మాట్లాడండి.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** అధ్యక్షా, మంత్రిగారి సమాధానంలో రాష్ట్రంలో ఉన్న అన్ని డిపార్టుమెంట్‌లతో కలిపి ఖాళీగా ఉన్న పోస్టులు కేవలం 24,209 మాత్రమే అని అన్నారు. ఇది ఏం లెక్కో మాకు అర్థం కావడం లేదు సార్. దాదాపు అన్ని శాఖలలో రిక్రూట్‌మెంట్ లేదు.

ఉ.10.30

అధ్యక్షా, రాష్ట్రం విడిపోయిన తరువాత అసలు రిక్రూట్‌మెంట్‌కు అవకాశమే లేకుండా పోయింది. ఉపాధ్యాయ ఖాళీలే సుమారు 14,000కు పైగా ఉన్నాయి. ఉపాధ్యాయ ఖాళీలే అంత ఉంటే, అన్నీ కలిపి 24,209 ఖాళీలు మాత్రమే ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రిగారు అంటున్నారు. అంటే 24,209 ఖాళీలు భర్తీ చేస్తే, ఇక రాష్ట్రంలో భర్తీ చేయాల్సిన పోస్టు ఒక్కటి కూడా ఉండదా? దీనిపైన నాకు మరింత స్పష్టత కావాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, చాలా శాఖలలో అంటే ఇప్పుడు జూనియర్ కాలేజీలలో1600 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉంటే, 3672 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వాళ్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని చాలా కాలంగా డిమాండ్ ఉన్నది. దానిపైన కూడా ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు. ఏప్రిల్ 2016లోనే 20,000 పోస్టులు భర్తీ కోసం కేబినెట్ అప్రూవ్ చేసింది. అంతకు ముందు 12,346 పోస్టులకు ఫైనాన్స్ డిపార్టుమెంటు అప్రూవ్ చేసింది. అంటే దాదాపు ముప్పై రెండు వేల పోస్టులు ఇదివరకే భర్తీ చేసి ఉండాల్సింది. అది ఇంకా సర్క్యులేషన్‌లోనే ఉందంటున్నారు. ఎప్పటిలోగా ఈ 32 వేల పోస్టులను భర్తీ చేస్తారనే అంశంలో స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమగోదావరి):** అధ్యక్షా, ప్రస్తుతం నిరుద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం కూడా ఉంది. తొందరగా ఆ ఖాళీలను భర్తీ చేస్తే నిరుద్యోగులకు, ప్రభుత్వానికి కూడా మేలుగా ఉంటుందని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు:** అధ్యక్షా, ఈరోజు ప్రభుత్వం నుంచి వచ్చే వివరాలను చూస్తే, రాష్ట్రం విడిపోయేనాటికి దాదాపు లక్షా నలభై రెండు వేల ఖాళీలు ఉన్నట్లు మొత్తం డేటా ఉంది. ఈ మూడు నాలుగేళ్లలో లక్షా ఎనభై ఐదు వేలకు పెరిగాయి. మరి అలాంటిది 24,209 పోస్టులే ఉన్నాయని చెప్పడం కరెక్టు కాదు. ఖచ్చితంగా లక్షా ఎనభై ఐదు వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి, వాటికి సంబంధించి తక్షణం చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ యనమల రామకృష్ణుడు:** అధ్యక్షా, ఈ ప్రశ్న కేవలం ప్రభుత్వానికి సంబంధించిన ఉద్యోగుల భర్తీకి సంబంధించింది. కేవలం ప్రభుత్వం రిక్రూట్ చేయాల్సిన ఖాళీల గురించి చెప్పడం జరిగింది. అయితే దాదాపు 44,000 వరకు ఉండే వెకెన్సీలకు సంబంధించి గౌరవసభ్యులు చెప్పినట్లు 20,000 పోస్టులు భర్తీ చేయడానికి పర్మిషన్ ఇచ్చాము. దానిలో పదివేల పోస్టులు రిక్రూట్‌మెంట్ స్టేజ్‌లో ఉన్నాయి. మిగిలిన వాటిలో కేబినెట్ కొన్ని అప్రూవ్ చేసింది, ఇవికూడా చేయాలి. అందువల్ల ప్రభుత్వ పరిధిలో ఉన్న పోస్టుల గురించి మాత్రమే సభ్యులకు చెప్పడం జరిగింది. వీటిని కూడా తొందరగా భర్తీ చేయడానికి ఫైల్స్ మూవ్ అవుతున్నాయి. డిఫరెంట్ సోర్సెస్ నుంచి డిఫరెంట్ డిపార్టుమెంట్ల నుంచి సమాచారం రావాలి. గౌరవసభ్యులు స్థానిక సంస్థలు, ఉపాధ్యాయ పోస్టులు వీటన్నింటి గురించి అడుగుతున్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్సీ కూడా ఇచ్చాము. వివిధ స్థానిక సంస్థలు, వివిధ ఆర్గనైజేషన్స్‌ని ఎక్స్‌క్లూడ్ చేస్తే ప్రభుత్వానికి సంబంధించిన పోస్టులు ఇవి. నెంబర్‌లో తేడా లేదు గానీ, అవన్నీ కలిపితే గౌరవసభ్యులు చెప్పినట్లు, సుమారు లక్ష వరకు అవ్వడానికి అవకాశం ఉంది. కాకపోతే డిఫరెంట్ ఆర్గనైజేషన్స్‌లో డిఫరెంట్ వేకెన్సీలు ఉన్నాయి. But, this question is pertaining to the vacancies in government only. కాబట్టి, ప్రభుత్వ వేకెన్సీల వరకే వివరాలు ఇవ్వడం జరిగింది. గౌరవసభ్యుల అభిప్రాయాలు కూడా తప్పకుండా తెలుసుకుంటాము. ప్రభుత్వం వీలైనంత మేర రిక్రూట్ చేయడానికి ఎప్పటికప్పుడు క్లియరెన్స్ ఇస్తూనే ఉంది, అది కాకుండా ప్రైవేట్ సెక్టార్‌లో కూడా రిక్రూట్‌మెంట్ చేయడం జరుగుతుంది.

## <u>జలవనరుల శాఖలోని ఇయన్‌సి, సిఇలు</u>

ప్రశ్న నెం.10063(7)

**శ్రీ గుండుమల తిప్పేస్వామి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలో జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఇఎన్‌సిలు మరియు సిఇల సంఖ్య ఎంత;

ఆ) పోలవరం ప్రాజెక్టు కోసం ప్రత్యేక ఇఎన్‌సిని నియమించాలనే ప్రతిపాదన ఏదైనా ఉందా;

ఇ) అయితే, అందుకు సంబంధించిన వివరాలేమిటి?

**గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు):**

అ) ప్రస్తుతం ఒక ఇంజనీర్-ఇన్-। ఫ్ మరియు 20 మంది । ఫ్ ఇంజనీర్లు పనిచేస్తున్నారు.

ఆ) లేదండీ.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ గుండుమల తిప్పేస్వామి (శాసనసభ నియోజకవర్గం):** అధ్యక్షా, ఈ రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు. అందుకనుగుణంగానే ఈరోజు మన ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు ప్రతి సోమవారం పోలవారంగా నిర్ణయించుకుని రెవ్యూ చేయడంతో అక్కడ పని వేగంగా జరుగుతోంది. ఈ సమయంలో ఒకే ఇంజనీర్-ఇన్-। ఫ్ ఉండడంతో ఆ ఇంజనీర్-ఇన్-। ఫ్, । ఫ్ ఇంజనీర్లు అందరూ కూడా పోలవరం ప్రాజెక్టుపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నారు. దీని ద్వారా రాష్ట్రంలో ఉండే మిగతా ప్రాజెక్టులకు కూడా ఇబ్బంది కలుగుతోంది. కాబట్టి, మీ ద్వారా మంత్రిగారిని కోరేదేమంటే, పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టే కాబట్టి, దానికి ప్రత్యేకంగా ఒక ఇంజనీర్-ఇన్-। ఫ్‌ని పెట్టి, మిగతా ప్రాజెక్టులకు అంటే రాయలసీమలోని హంద్రీ-నీవా, గాలేరు-నగరికి కూడా వేరే ఇంజనీర్-ఇన్-। ఫ్‌లను నియమిస్తే అవి కూడా త్వరితగతిన పూర్తవ్వడానికి అవకాశం ఉంటుంది. దయచేసి మంత్రిగారు ఈ అంశంలో సహృదయంతో ఆలోచించి పోలవరానికి సెపరేట్ ఇంజనీర్-ఇన్-। ఫ్‌ని పెట్టాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, జలవనరుల శాఖ వారు మా ఏలూరు కాలువను జల రవాణాకు ఉపయోగిస్తున్నారు. కానీ అది బాగుచేయడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. అందువల్ల ఆ పనికి ఇవాళ, రేపు అని చెప్పకుండా దానికి ఏదైనా ప్రత్యేక ప్రతిపాదనలు చేస్తున్నారా? లేదా ఎప్పటిలోగా ప్రతిపాదన చేస్తారని మీ ద్వారా మంత్రిగారిని ప్రశ్నిస్తున్నాను.

**మిస్టర్ చైర్మన్:** ఈ ప్రశ్న వేరు, సభ్యులు అడిగేది వేరు.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, ప్రభుత్వం అగ్రెసివ్‌గా పోలవరానికి ఎంతైతే ప్రాధాన్యత ఇస్తుందో, ఏదైతే ప్రతి సోమవారం పోలవారం అంటున్నామో, అదే స్పిరిట్‌తో తెలుగుగంగకు, హంద్రీ-నీవాకు కూడా బుధవారమో, గురువారమో పెడితే బాగుంటుంది. వీటిని ఎన్టీరామారావు గారు ప్రారంభించారు. కాబట్టి, వీటికి కూడా ముఖ్యమంత్రి గారు కొంత ఇనీషియేషన్ తీసుకుంటే ప్రజలు కూడా సంతృప్తి చెందుతారని నేను కోరుకుంటున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:** అధ్యక్షా, రెగ్యులర్ ఇంజనీర్-ఇన్-। ఫ్‌గా శ్రీ వెంకటేశ్వరరావు పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ ప్రశ్నేంటంటే, ప్రత్యేకంగా ఇంకో ఇంజనీర్-ఇన్-। ఫ్‌ని ఇస్తున్నారా అని అడిగారు. దానికి లేదన్నాను. పోలవరం ప్రాజెక్టుకి ప్రత్యేకమైన శ్రద్ధతో ఒక ఇంజనీర్-ఇన్-। ఫ్‌గా శ్రీ వెంకటేశ్వరరావును ఆ పోస్టులో పెట్టడం జరిగింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత మూడు ఇంజనీర్-ఇన్-। ఫ్ పోస్టులు మనకు రావడం జరిగాయి. 1. ఇంజనీర్-ఇన్-। ఫ్, పోలవరం, 2. ఇంజనీర్-ఇన్-। ఫ్, ఇరిగేషన్, 3. ఇంజనీర్-ఇన్-। ఫ్, కమీషనర్ ఆఫ్ టెండర్స్. అలాగే అడ్మినిస్ట్రేషన్, వాలంతరీ డైరెక్టర్ జనరల్ వంటివి తెలంగాణాకు కేటాయించబడినవి. కాబట్టి ఈ మూడు ఇంజనీర్-ఇన్-। ఫ్ పోస్టులకు కూడా ప్రమోషన్ ఇష్యూ దగ్గర దగ్గర నాలుగు దశాబ్దాల నుండి ట్రైబ్యునల్స్‌కి, సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. దానిమీద నిర్ణయాలు తీసుకుని, ఆ పోస్టులన్నీ ఫిలప్ చేయడం జరుగుతుంది. దాదాపు

21 పోస్టులలో ౹ ఫ్ ఇంజనీర్లను నియమించడం జరిగింది. సూపరింటెండింగ్ ఇంజనీర్లు 52 పోస్టులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 240 పోస్టులు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 829 పోస్టులు ఫిలప్ చేయడం జరిగింది. అదేవిధంగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కూడా 2807 పోస్టులు భర్తీ చేయడం జరిగింది. ఆవిధంగా పదమూడు జిల్లాలలో ఈ ప్రాజెక్టులు చూడడానికి జలవనరుల శాఖ కింద మేజర్ ఇరిగేషన్, మీడియం ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ అని రకరకాలుగా ఐదుగురు మంత్రులు పనిచేసేవారు. ఇవాళ ముఖ్యమంత్రిగారు ఒక గొడుగు కింద, జలవనరుల శాఖ కింద ఇవన్నీ synchronize చేసి, ఆ పోస్టులన్నీ ఫిలప్ చేశారు. మొన్న కూడా ఏపీపీఎస్సీ ద్వారా 499 పోస్టులను భర్తీ చేయడానికి ఇంజనీరింగ్ పట్టభద్రులకు అవకాశం ఇవ్వడం జరిగింది. దానివల్ల దాదాపు 494 మంది రిక్రూట్ అయ్యారు. దానిలో ఐఐటి నుండి 38 మంది, ఎన్ఐటి, ఐఐఐటిల నుండి 15 మంది, ఎంటెక్ చదువుతున్న వారు 142 మంది వచ్చారు. వీళ్లలో 76 మందిని పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యేకంగా నియమించడం జరిగింది. తప్పకుండా ౹ ఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు అందర్నీ కూడా రెగ్యులర్ పోస్టుల్లో ఫిలప్ చేయడం జరిగింది. ఇప్పటివరకు పనిచేసిన వారంతా టెంపరరీ ఇన్‌ఛార్జులుగా 30 నుంచి 40 ఏళ్ళ పాటు పని చేసి రిటైర్ అయ్యారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రిగారు శ్రద్ధ పెట్టి సమస్యను పరిష్కారం చేశారు. దాని తరువాత సోమవారం పోలవారం అని 23 సార్లు పోలవరం ప్రాజెక్టుకు వెళ్లి 52 సార్లు రెవ్యూలో ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టు పై రెండు నుంచి మూడు గంటలు సమీక్ష చేసిన తరువాత, అదనంగా మరో రెండు నుండి మూడు గంటలు కూర్చొని రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడానికి 29 ప్రాజెక్టులను మేము ప్రయారిటైజ్ చేసుకున్నాము. వాటిలో ఆల్‌రెడీ 8 ప్రాజెక్టులు జాతికి అంకితం చేశాము. ఆ 21 ప్రాజెక్టులు కూడా ప్రాసెస్‌లో ఉన్నాయి. మే నెలకు కొన్ని, జులై నెలకు కొన్ని, అలాగే డిసెంబరు లోపు పూర్తి చేయడమే కాకుండా, మొన్న సోమవారం పోలవరం ప్రాజెక్టు రెవ్యూలో కూడా ముఖ్యమంత్రిగారు అదనంగా 21 ప్రాజెక్టులు తీసుకోవడం జరిగింది.

ఉ. 10.40

ఆ 21+29 మొత్తం 50 ప్రాజెక్టులలో 8 ప్రాజెక్టులను జాతికి అంకితం చేయగా మిగిలిన 42 ప్రాజెక్టులలో జూన్, జులై మాసాలకు ఎన్ని పూర్తి అవుతాయి, డిసెంబరు మాసానికల్లా ఎన్ని పూర్తవ్వాలి, ఫిబ్రవరి, 2019వ సంవత్సరానికల్లా ఏమేమి ప్రాజెక్టులు పూర్తవ్వాలని చెప్పి వాటన్నింటికీ ప్రణాళికలు వేసి పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నాము. సోంపేట, ఇచ్ఛాపురం ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్‌కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. వంశధార స్టేజ్-2 ఫేజ్-2కి కూడా వెయ్యి కోట్ల రూపాయలతో ఆ ప్రాజెక్టు పనులన్నీ కూడా జూన్, జులై మాసాల కల్లా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. అలాగే, శ్రీకాకుళం జిల్లాలో రెండవ పంటకు మళ్ళీ నీళ్ళు ఇవ్వబోతున్నాము. ఇది చరిత్ర అధ్యక్షా. జూన్, 2019వ సంవత్సరానికి ఖరీఫ్ పంటకు కాకుండా, రబీ పంటకు కూడా సోమవారం-పోలవారం రెవ్యూ చేయడం వల్ల మన ముఖ్యమంత్రిగారు శ్రద్ధ పెట్టి 5, 6 గంటలు ఒక సబ్జక్టు పైనే

కూర్చోవడం వల్ల ఈనాడు వంశధార నుంచి నీటిని అందిస్తున్నాము. ఇది దశాబ్దకాలం పాటు పెండింగులో ఉన్న పరిహారం డబ్బులు కూడా ఇవ్వడం జరిగింది. మన సభ్యులు శ్రీ కళా వెంకట్రావు గారు, మిగిలిన వారు అందరూ ఇక్కడే ఉన్నారు. దశాబ్దకాలం పాటు మిగిలిన వాళ్ళకు డబ్బులు ఇవ్వడం కూడా వారికి చేతకాలేదు. ఆ సమస్యలన్నింటిని పరిష్కారం చేసి, వెయ్యికోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఈనాడు బ్రహ్మాండంగా శ్రీకాకుళం జిల్లాలో రెండవ పంటకు సంబంధించి వంశధార స్టేజి-2 ఫేజ్-2 క్రింద నీళ్ళు ఇస్తున్నాము. వంశధార-నాగావళి అనుసంధానం ఈనాడు జరుగుతోంది. గతం నుంచి ఎంతోమంది మహానుభావులు దీనిగురించి చెపుతున్నారు. కానీ, ఈనాడు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు డిసెంబరు లోపు అన్ని పనులను పూర్తి చేయబోతున్నారు.

అధ్యక్షా, అదేవిధంగా 2003లోనే నాగావళి నదిపైన ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రిగారు శంకుస్థాపన చేశారు. 2004 నుంచి 2014 వరకు పెద్ద మనుషులు ఆ ప్రాజెక్టు పనులను పూర్తి చేయలేదు. మళ్ళీ 2015లో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆ ప్రాజెక్టును పూర్తి చేయడమే కాకుండా, జాతికి అంకితం కూడా చేసి దాదాపు 1,30,000 ఎకరాలకు నీళ్ళు ఇవ్వడమే కాకుండా, 777 చెరువులకు నీళ్ళు ఇచ్చారు. సోమవారం-పోలవారం రెవ్యూలో ఏ విధంగా పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తున్నారనేదానికి ఇది ఒక ఉదాహరణ. ఒక ముఖ్యమంత్రి శ్రద్ధ పెడితే ప్రాజెక్టులు ఏ విధంగా పరుగుపెడతాయి అనేదానికి ఇది ఒక ఉదాహరణ. అదేవిధంగా, నాగావళి, చంపావతి, వేగవతి, గోస్తని మొదలైన నదులను కూడా అనుసంధానం చేస్తాము. ఈరోజున పురుషోత్తపట్నం దండగ అన్నారు. అదే పురుషోత్తపట్నాన్ని సంవత్సరం తిరక్కుండానే పూర్తిచేయడం జరిగింది. ఏలేరు రిజర్వాయరు నుంచి ఆర్థిక శాఖా మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారి ప్రాంతమైన తునిలో బ్రహ్మాండంగా ఒక లక్ష ఎకరాలలో రెండవ పంటను పండిస్తున్నారు. మళ్ళా జూన్1వ తారీఖుకల్లా ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. 9 టిఎంసిల నీరు ఏలేరు రిజర్వాయరులో ఉన్నాయి. ఏలేరు రిజర్వాయరు నుంచి విశాఖపట్టణానికి గోదావరి నీళ్ళు వెళుతున్నాయి. మీరు మరికొంత సమయం ఇచ్చినట్లయితే పూర్తి వివరాలు సభకు తెలియజేస్తాను. పట్టిసీమ ప్రాజెక్టు కూడా విజయవంతంగా పూర్తి చేసి మూడు సంవత్సరాలుగా నీరిస్తున్నాం. ఈ సంవత్సరం దాదాపు 105 టిఎంసిల నీటిని ఇవ్వడం జరిగింది. పోలవరం ప్రాజెక్టుకు కూడా 2019వ సంవత్సరానికల్లా గ్రావిటీతో పూర్తి చేయాలని ఆ పనులన్నింటిని శరవేగంగా పట్టాలెక్కించే ప్రయత్నాలు కూడా చేస్తున్నాము. తప్పకుండా గౌరవ సభ్యులు చెప్పిన అంశాలు, పెండింగ్ ప్రాజెక్టులు ఎక్కడైతే ఉన్నాయో వాటిని కూడా పూర్తి చేస్తాము. అలాగే, మిగిలిన ఈఎన్‌సిలను ఏ విధంగా, ఎట్లా అప్‌డేట్ చేసుకుని, వారికి ఇన్‌ఛార్జెస్ ఇచ్చుకుని, అలాగే । ఫ్ ఇంజనీర్లను కూడా అప్‌డేట్ చేసుకుని, ఆయా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని తమ ద్వారా గౌరవ సభ్యులకు రాష్ట్రప్రజలకు తెలియజేస్తున్నాను.

**శ్రీ గుండుమల తిప్పేస్వామి (మైకు లేదు):** అధ్యక్షా, హంద్రీ-నీవా నుంచి మడకశిరకు ఎప్పటిలోగా నీళ్ళు ఇస్తారో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

## ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు ఇపియఫ్, ఇయస్ఐ సౌకర్యాలు

ప్రశ్న నెం.10316 (8)

**సర్వశ్రీ బొడ్డు నాగేశ్వరరావు, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, విటపు బాలసుబ్రహ్మణ్యం, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** రాష్ట్రంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య ఎంత;

**ఆ)** సదరు ఉద్యోగులకు ఇపిఎఫ్ మరియు ఇఎస్ఐ ప్రయోజనాలను కల్పిస్తున్నారా?

**గౌరవనీయులైన ఆర్థిక మరియు ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు):**

**అ)** అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం రాష్ట్రంలోని, వివిధ శాఖలలో 33,822 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 15,856 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.

**ఆ)** అవునండీ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఇపిఎఫ్ మరియు ఇఎస్ఐ ప్రయోజనాలను కల్పించడమయింది.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు:** అధ్యక్షా, అతి విలువైనటువంటి సభకు సమాచారం ఇవ్వడంలో మాత్రం చిత్తశుద్ధి పాటించడం లేదని నేను నా నిరసనను వ్యక్తం చేస్తున్నాను. ఎందుకంటే 24,000 మంది విద్యుత్ శాఖలోనే కాంట్రాక్టు ఉద్యోగులు నిన్నటి వరకు సమ్మెలోనే ఉన్నారు. అలాగే, విద్యాశాఖలో దాదాపుగా 25,000 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆరోగ్య శాఖలో కూడా 25,000 మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. మన రాష్ట్రంలో దాదాపుగా మూడు లక్షల మంది వరకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగులలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరూ కూడా ప్రభుత్వం దృష్టిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే వాళ్ళు అవునా, కాదా అనేది మాకయితే ఒక సమస్యగా ఇప్పుడు వేసుకోవలసిన పరిస్థితి వస్తున్నదని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇక రెండవ విషయం ఏమిటంటే – సదరు ఉద్యోగులందరికీ ఇపిఎఫ్ మరియు ఇఎస్ఐ సౌకర్యాలు కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కల్పిస్తున్నారా అని అడిగాము. అంటే, ఇందులో ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేసే వాళ్ళకు మాత్రమే ఆ యాజమాన్యాల ద్వారా ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు వారి ద్వారా చెల్లించమనేటటువంటి ఆదేశాలు ఉన్నాయి. దానిద్వారా వారు చెల్లించేవాటిలో కూడా చాలా అవకతవకలు కనపడుతున్నాయి. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాము. కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించి ఇటీవలి కాలంలోనే జీవో నెం.151 ద్వారా వేతనాలను పెంచిన సందర్భంలో విద్యాశాఖలోనే ఉన్నటువంటి సిఆర్‌పిలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, inclusive Education Resources Teachers మొదలైన 13 రకాల విధులు నిర్వర్తించే ఉద్యోగులు దాదాపుగా 25,000 మంది వరకు

ఉన్నారు. వారికి ఈపిఎఫ్, ఈఎస్ఐ క్రింద 8 నెలల పాటు మినహాయించి, సరైన ఉత్తుర్వులు లేవనేటటువంటి కారణంతో ఈపిఎఫ్, ఈఎస్ఐకి జమ చేయకుండా ఆ మొత్తం డబ్బులను తిరిగి చెల్లించేటటువంటి పని ఆ ఉద్యోగులకు చేసినటువంటి పరిస్థితి ఉన్నది. కాబట్టి, ఒక ఉద్యోగికి ఈపిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడమనేది ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యం. మరి ఈ విషయంలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ రాష్ట్రంలో ఈపిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వర్తింప చేయడం లేదు. ఇది తక్షణ ప్రాధాన్యత కలిగిన సమస్యగా తీసుకుని, ప్రభుత్వం దీనిపైన దృష్టిసారించి అందరికీ కూడా ఈపిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వర్తింపజేయవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** అధ్యక్షా, మన ప్రభుత్వంలో ఈ 33,822 మంది ఉద్యోగులు అనే లెక్క చెప్పి వీళ్ళు తప్ప మిగిలిన ఉద్యోగుల గురించి మమ్మల్ని అడగకండి, వీళ్ళు మాకు ఏమి సంబంధం లేదు? వీళ్ళు ఎక్కడికి పోతారో మాకు తెలియదు అని చెప్పి చెప్పదలచుకున్నారా అని తమ ద్వారా నేను గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను. ఇది చాలా బాధాకరమైన విషయం. ప్రభుత్వంలో పని చేయడమంటే అసలు ఏ ప్రకారంగా మీరు లెక్క వేస్తున్నారు? విద్యుత్ శాఖ ప్రభుత్వానిది కాదా? విద్యారంగం ప్రభుత్వానిది కాదా? వీటన్నింటిని మినహాయించుకుని వీళ్ళు ఎవరూ మా వాళ్ళు కాదంటే, మీరు చెప్పండి వాళ్ళు ఎవరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కాదు, అంటే ఇంకొకళ్ళ దగ్గరకు పోయి అడుక్కునే ప్రయత్నం చేస్తాము. చాలా బాధాకరమైన జవాబును గౌరవ మంత్రిగారు ఇచ్చారు.

మరొక విషయం అధ్యక్షా. కేంద్రప్రభుత్వము చాలా స్పష్టంగా వాళ్ళ స్కీములలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులకు ఇపిఎఫ్, ఇఎస్ఐని రెండింటిని కలిపి ఇస్తూ చాలా స్పష్టంగా ఉత్తర్వులు ఇచ్చింది. వారికి ఇది అమలవుతోంది. కేంద్రప్రభుత్వ పథకాలు 40:60 పేరుతో మనం ఇస్తున్నాము. ఇప్పుడు సర్వశిక్షా అభియాన్‌లో ఉదాహరణకు 25,000 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరందరికీ కేంద్రప్రభుత్వ నియమాల ప్రకారంగా వారు ఇచ్చిన దాని ప్రకారంగా ఇపిఎఫ్, ఇఎస్ఐ రెండూ ఇస్తూ ఉంటే, మన రాష్ట్రంలో ఉండేటటువంటి వారికి మాత్రం ఇవ్వకపోయినందు వల్ల, ఇప్పుడు వాళ్ళు కేంద్ర ప్రభుత్వంతో వస్తున్న కార్యక్రమాలకు పనిచేస్తున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వ నియమాలు అడ్డంగా ఉన్నాయి కాబట్టి, వారికి కూడా పంగనామాలు పెట్టే పరిస్థితి వచ్చింది.

అధ్యక్షా, ఒకసారి వీటి గురించి ఆలోచించండి. అసలు ఈ ప్రభుత్వ విధానాలలోనో ఎక్కడో లోపం ఉంది. ఔట్‌సోర్సింగ్ వాళ్ళకు ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు ఉండడమేమిటి? కాంట్రాక్టు వాళ్ళకి లేకపోవడం ఏమిటి? ఇద్దరికీ ఈ సౌకర్యాలు ఉండి ఉండాలి. ఇందులో ఎక్కడో పొరపాటు ఉందని మేము అభిప్రాయపడుతున్నాము. దయ ఉంచి సానుకూలంగా చూడండి. వాళ్ళందరూ చిన్నచిన్న ఉద్యోగులు, బతకలేని ఉద్యోగులను మనం పెటుకుని, మన రాష్ట్రాన్ని మాత్రం అత్యంత అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పి చెప్పకుంటూ వాళ్ళ మీద మాత్రం కనీస కనికరం చూపక పోవడం ప్రభుత్వ పాలసీ అయితే దానిని మేము అంగీకరించడానికి సిద్ధంగా లేము సార్. మీరు దయ ఉంచి ఇప్పుడు చెప్పండి. అందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏవిధంగా ఈపిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు ఇస్తున్నామో, కాంట్రాక్టు వారికి కూడా ఆ సౌకర్యాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలి. మరి వాళ్ళకు మీరు ఇవ్వకపోతే ఎవరు ఇస్తారు సార్?

వారికి ఇంకా ఏ ఆప్షన్ ఉంది ? ఇంకా ఏదన్నా హెల్త్ కార్డులు ఇస్తారా ? పోనీ, మరేదైనా చేస్తారా ? అటువంటిది ఏదైనా చేస్తామంటే చెప్పండి. ఏమీ లేకుండా, వాళ్ళని గాలికి వదిలేయడం మాత్రం అన్యాయం సార్. దీనిపైన స్పష్టమైనటువంటి హామీ మీ నుంచి రావాలని చెప్పి మేము కోరుతున్నాము సార్.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన అంశం. కేంద్రంలో Wage Board ఉంది. కేంద్రానికి సంబంధించినటువంటి రైల్వేలు, ఓఎన్‌జిసి గానీ ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు వారికి మినిమమ్ వేజ్‌ను కూడా చాలా ఎక్కువ పెంచడం జరిగింది. దాదాపుగా 40, 50 శాతం జీతాలు పెంచారు. మన రాష్ట్రంలో వేజ్ బోర్డు లేదు. రాష్ట్రంలో చాలా కాలం నుంచి వేజ్ బోర్డును వేయలేదు. దీనిమూలంగా ఈనాడు ఒక కార్మికుడు ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తుంటే, వాళ్ళకి మనం మన ప్రభుత్వాలే సంక్షేమం చూడాలి. ఇక్కడ మన కార్మిక శాఖా మంత్రి గారు కూడా ఉన్నారు. ఒక చిన్న ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడికి అనేక చట్టాలు కల్పించి, వారికి అన్ని విధాలుగా అంటే లేబర్ ఇన్‌స్పెక్టర్ ఒక లేఖ వ్రాస్తే ఆ కార్మికుడు పని చేస్తున్నటువంటి సంస్థ నుంచి ఆ యాజమాన్యాన్ని పిలిపించి అడిగే సందర్భాలు ఉన్నటువంటి స్థితిలో ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేసే వాళ్ళు ఏ ప్రభుత్వమైనా కానీ – ఆరోగ్యశ్రీలో కూడా. వాళ్ళు మన ఉద్యోగులు కాదు అని అంటున్నారు. ఫ్యాక్టరీలో పనిచేసే వాళ్ళ హక్కులను రక్షించే ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీలో పనిచేసే వాళ్ళు మా ఉద్యోగస్తులు కాదు అని మనం ఎలా అనగలుగుతాము ? ఇది చాలా సీరియస్‌గా చర్చించాలి. ఈ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పెట్టి కార్మికులుగా చూసేటటువంటి పరిస్థితిని రాష్ట్ర వ్యాప్తంగా అనేకమైన డిపార్టుమెంట్లలో మనం పరిగణిస్తున్నాము. ప్రియతమ ముఖ్యమంత్రిగారు శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి నాయకత్వంలో వీరికి తప్పకుండా న్యాయం జరగాలని నేను తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ.10.50

**శ్రీ యనమల రామకృష్ణుడు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు సోము వీర్రాజు అడిగినటువంటి వేజ్ బోర్డు గురించి సపరేట్ క్వశ్చన్ వేస్తే దానికి సంబంధించిన మంత్రిగారు సమాధానం చెబుతారు. వేజ్‌బోర్డు ఈ ప్రశ్నకు సంబంధించినది కాదు. కాంట్రాక్టు ఉద్యోగులకు, పొరుగుసేవల ఉద్యోగులకు discrimination కనిపిస్తుంది. మేము కూడా తప్పకుండా పరిశీలించి వీలైనంతవరకూ న్యాయం చేయడానికి చూస్తాము. సోము వీర్రాజు గారు అడిగిన ప్రశ్న సమంజసంగా ఉంది. ఎందువలనంటే పొరుగుసేవల ఉద్యోగులకు ప్రయోజనం కల్పించి కాంట్రాకు ఉద్యోగులకు కల్పించకపోవడం అనేది discrimination గా కనపడుతుంది. We will get it examined and come back to the house again.

## కోతుల బెడద

ప్రశ్న నెం.10058(9)

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** కోతుల బెడదవల్ల రైతులు మరియు సామాన్య ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమయిందా;

**ఆ)** అయితే, కోతులను అడవులకు తిరిగి పంపించడానికి తీసుకున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి (శ్రీ శిద్ధా రాఘవరావు):**

**అ)** అవునండీ.

**ఆ)** కోతుల బెడదను తగ్గించడానికి ఈ క్రింది ముందు జాగ్రత్తలను తీసుకోవడమయింది.

1. వ్యవసాయ క్షేత్రాలు మరియు జనావాసాలకు వస్తున్న కోతులను నిరోధించడానికి వనం-మనం కార్యక్రమంలో పండ్ల మొక్కలను నాటే పనిని చేపట్టడమయింది.

2. కోతుల బెడదను పరిష్కరించడంలో గ్రామ పంచాయతీలకు, మునిసిపాలిటీలకు మరియు మునిసిపలు కార్పొరేషన్లకు శాఖ మార్గదర్శకాన్ని అందిస్తున్నది.

3. ప్రధాన వన్యప్రాణి వార్డెను వన్యప్రాణ (రక్షణ) చట్టం 1972లోని 11(1)(బి) విభాగం క్రింద కోతులను పట్టుకుని విడిచిపెట్టే అధికారాలను క్షేత్ర స్థాయి సిబ్బంది/అటవీ సంరక్షకులకు అప్పగించడమయింది.

4. కోతులను పట్టుకునే ఖర్చును భరించే స్థానిక సంస్థలు నియమించిన వృత్తిపరమైన ట్రాపర్లు కోతులను పట్టుకోవడం జరిగింది.

5. ప్రధాన వన్యప్రాణి వార్డెన్ లేదా ఆయన నామినీలు సూచించినట్లుగా వన్యప్రాణులకు స్టెరిలైజ్ చేసి అడవులలోకి వదలాలని స్థానిక సంస్థలకు సూచించడమయింది.

6. కోతులు మనుష్యులకు సుపరిచితమై అవి అడవులలోకి వెళ్లకుండా ఆపుతున్నందుకు వాటికి ఆహార పదార్థాలను పెట్టకుండా ప్రజలకు అవగాహన కలిగించాల్సి ఉంది.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్):** అధ్యక్షా, చాలా సంతోషం. దీనికి సంబంధించినటువంటి సమాధానాన్ని చక్కగా చెప్పినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఎక్కడైతే అటవీ ప్రాంతం ఉంటుందో ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరు, గంగాధర, నెల్లూరు, చిత్తూరు అక్కడ నుండి చంద్రగిరి, తిరుపతి, పీలేరు వరకూ కోతుల బెడద ఎక్కువగా ఉంది. మనం ఒక వైపు ప్రైమరీ సెక్టారులో, అగ్రికల్చర్ సెక్టారులో జిడిపిగానీ, రెండు అంకెల వృద్ధి గానీ రావాలని చేస్తున్నాము. ఈ కోతులు ఇప్పుడు విశేషంగా బయటకు వచ్చేస్తున్నాయి. అవి బయటకు వచ్చి కుప్పం నియోజకవర్గంలో హార్టికల్చర్ క్రాప్స్‌కు చాలా నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు వచ్చినప్పుడు వారితో చర్చిస్తే, వారు కలెక్టర్‌గారికి చెప్పడం జరిగింది. కర్ణాటక రాష్ట్రం మనకు బోర్డర్‌లో ఉంది. అక్కడ ఉన్న కోతులను తెచ్చి మన ప్రాంతంలో వదిలేస్తున్నారు. దానితో సమస్య ఇంకా ఎక్కువగా ఉంది. దీని మీద చర్యలు తీసుకోవలసిన పరిస్థితి ఉంది. ఇవి వన్యప్రాణులని, ఆంజనేయుడని వీటిని కొట్టకూడదు, చంపకూడదనే పరిస్థితి కూడా ఉంది. ఆ ప్రాంతాలలో ఉన్న పిల్లలను కూడా కోతులు కొరికేస్తునాయి. అందువలన కోతులకు అటవీ ప్రాంతాలలో Monkeys Hostels అని పెట్టి అక్కడే ఆహారపదార్థాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే విషయాన్ని మేము చర్చించడం జరిగింది. కనీసం కోతుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో అయినా చర్యలు తీసుకుంటే బాగుంటుందని సూచిస్తున్నాను. అదే విధంగా ఫ్యామిలీ ప్లానింగ్ విషయంలో కూడా మంత్రి గారు వారికే అధికారాలు ఇచ్చామని చెప్పారు. కానీ స్థానిక సంస్థలు ఆ కార్యక్రమాన్ని చేసే పరిస్థితులలో లేవు. దానిని అటవీశాఖ వారు తీసుకుని దానిని sterilise చేయడం లాంటివి చేస్తే బాగుంటుందని కూడా సూచిస్తున్నాను. పంట చేతికొచ్చే సమయానికి కోతులు పంటను ధ్వంసం చేస్తున్నాయి. అవి తినేది కొద్దిగానే అయినా ధ్వంసం చేయడం ఎక్కువగా జరుగుతుంది కాబట్టి దయచేసి ఈ సమస్యను పరిష్కరించాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీమతి పి.శమంతకమణి (శాసనసభ నియోజకవర్గం):** అధ్యక్షా, చిత్తూరు జిల్లాలో కోతుల బెడద, అనంతపూర్ జిల్లాలో జింకలబెడద ఉన్నది. ఈ విషయం గురించి ఇదే సభలో మూడు సంవత్సరాల నుండి మాట్లాడుతున్నాను. కానీ నా మాటలు అన్నీ అరణ్య రోదన అవుతున్నాయే కానీ ఒక్కటి కూడా జరగడం లేదు. ఒకవేళ ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉంటే అక్కడ ఉన్న గ్రామస్తులకే చెబితే వారే కంట్రోల్ చేస్తారు. ఒక జింకను కొడితే వన్యప్రాణి రక్షణ క్రింద కేసులు పెట్టి వారిని పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పి తలప్రాణం తోకకు తీసుకొస్తున్నారు. జింకలు పుట్లూరు మండలంలో చాలా ఎక్కువగా ఉన్నాయి. అక్కడ వర్షపాతం లేక కష్టపడుతుంటే జింకల తాకిడి ఎక్కువై పోతుంది. వీటిని కంట్రోల్ చేయాలి. దయచేసి ఈ సమస్యను పరిష్కరించాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కరణం బలరామ కృష్ణ మూర్తి (శాసనసభ నియోజకవర్గం):** అధ్యక్షా, గౌరవ మంత్రి గారు కొన్ని విషయాలు గురించి చెప్పారు. కానీ వారి నియోజకవర్గంలోనే కోతులు దండిగా ఉన్నాయి. అవి పండిన పంటల్ని నాశనం చేస్తున్నాయి. అదే విధంగా గతంలో మేము తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లినప్పుడు మా చేతుల్లో అరటిపళ్ళు,

ప్రసాదం లాక్కుని వెళ్లిపోతుండేవి. వాటి పాపులేషన్ విపరీతంగా పెరిగిపోయింది. అవి విస్తరించుకుంటూ కృష్ణాజిల్లా దాటి దాదాపుగా కోస్టల్ ఏరియా అంతా వ్యాపించిపోయాయి. పంట పొలాలకు ముఖ్యంగా హార్టికల్చర్‌కు సంబంధించిన పంటలను తుంచి పడేస్తున్నాయి. వరిచేలను కూడా పాడుచేస్తున్నాయి. ఆ విధంగా కోతుల వలన నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నుండి పరిహారం ఇచ్చే పరిస్థితి ఏమైనా ఉందా? ఇది ఎప్పటినుండో ఉన్న సమస్య. దీనిని జాతి వైరం అంటారు. ఒక కొండముచ్చును చూసినా కోతులు పారిపోతాయి. మేము కొండముచ్చు వచ్చినప్పుడు కోతులు పారిపోవడం ప్రత్యక్షంగా చూశాము. కొండ ముచ్చులను తెచ్చుకుని పెట్టుకోవడానికి చట్టాలు అనుమతించడం లేదు. ఈ విషయాలను గురించి తమరు ఆలోచించి liberal గా వెళ్లడానికి ఏమైనా అవకాశాలు ఉన్నాయా అనే విషయాలను పరిశీలించాలని తమరి ద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ గౌనివారి శ్రీనివాసులు గారు చక్కని ప్రశ్న వేశారు. దానికి పరిష్కార మార్గాన్ని కూడా వారు చెప్పడం జరిగింది. కారుణ్య ఉద్దేశంతో కోతులను చంపితే పాపం అంటున్నారు. కానీ, మా ఏలూరు జనరల్ ఆసుపత్రికి కోతులు కరిచిన వారు రోజుకు ఒకరిద్దరు వైద్యం కోసం వస్తున్నారు. అందువలన గౌరవ సభ్యులు శ్రీ గౌనివారి శ్రీనివాసులు గారు చెప్పినట్లు అటవీ ప్రాంతంలోనే కోతుల్ని పోషిస్తే బాగుంటుందని నేను కూడా ఏకీభవిస్తున్నాను. ఈ విషయాన్ని పరిశీలించవలసినదిగా గౌరవమంత్రి గారిని తమరి ద్వారా కోరుతున్నాను.

**డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి:** అధ్యక్షా, ఈ కోతుల బెడద పోవడానికి అటవీశాఖ కొండముచ్చులను పెంచి ఊరూరికి ఒక కొండముచ్చుని వదిలితే కోతులు ఎక్కడా కనపడవు. ఈ పద్ధతి ఢిల్లీలో జరుగుతోంది. మేము పార్లమెంటుకు వెళ్తున్నప్పుడు కోతులు వస్తుంటే అక్కడ ఒక కొండముచ్చు తిరుగుతుంటుంది. అదే విధంగా కర్ణాటక రాష్ట్రంలో కూడా కొండముచ్చులను తిప్పుతున్నారు. అదేమీ కొత్త విషయం కాదు. కొండముచ్చులు ఉన్న చోట కోతులు ఉండవు. అందువలన అటవీశాఖ వారికి నేను చెప్పే సలహా ఏమిటంటే – కోతులు ఉన్న చోట ఒక కొండముచ్చును వదలి వాటికి ఆహారం కూడా సరఫరా చేస్తే ఈ బెడద తగ్గుతుందని తెలియజేస్తూ ఈ విషయం గురించి గౌరవ మంత్రి స్పందించవలసినదిగా తమరి ద్వారా కోరుతున్నాను.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** అధ్యక్షా, సమావేశంలో అందరూ కోతులు, జింకలు, కుక్కల గురించి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వాటి పక్షాన మాట్లాడడానికి ఇక్కడ ఎం.ఎల్.సీలు ఎవరూ లేరు. కనీసం జంతు ప్రేమికుల సంఘాలలో పనిచేసే వారిని గవర్నర్ కోటా కింద మీరు ఎం.ఎల్.సిగా అపాయింట్ చేస్తే వాటి గొంతు కూడా వినిపిస్తారు. వాటి ఆవాసాలన్నింటినీ మనుషులు ఆక్రమించుకుని వాటికి నిలువ నీడ లేకుండా చేయడం వల్లనే పాపం అవి ఇక్కడ తిరుగుతుంటే బెంగళూరులో ఉన్న వాటిని ఆంధ్రప్రదేశ్‌కు రాకూడదంటే ఎలా? మనం జంతువులకు వ్యతిరేకంగా మాట్లాడుకోవడం నాకు అంత న్యాయంగా అనిపించలేదు.

ఉ.11.00

**శ్రీ శిద్దా రాఘవరావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు గౌనివారి శ్రీనివాసులు గారు చిత్తూరు జిల్లాలోని పలమనేరు, చంద్రగిరి, చిత్తూరు, గంగాధర, నెల్లూరు ప్రాంతాల్లో కోతుల బెడద ఉందని ఎక్కువగా చెప్పారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి కూడా వచ్చింది. అదే కాకుండా కర్ణాటక బోర్డర్ ప్రాంతం నుంచి కోతులను వదిలేస్తున్నారని చెప్పడం జరిగింది. నేను కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాము. వాటిని ఎప్పుడైతే మనం కంట్రోల్ చేస్తామో హార్టి కల్చర్ క్రాప్‌ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతే కాకుండా సభ్యులు చెప్పినట్లు కోతి అంటే ఆంజనేయ స్వామి అని ఒక పవిత్ర భావంతో అందరూ భావిస్తూ, వాటికి సహాయంగా పండ్లు ఇస్తుంటారు. కోతులకు మంకీ హాస్టల్‌ని ఏర్పాటు చేయమని సభ్యులు సూచన ఇచ్చారు. దీనిపై కూడా డిపార్టుమెంటు అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాము. పమిడి శమంతకమణి గారు జింకల విషయంలో ఏదైనా యాక్టు లేదా ఎమెండ్‌మెంటును ఏదైనా చేస్తారా అని అడిగారు. దానిపై డిపార్ట్‌మెంట్‌తో చర్చిస్తాను. అలాగే కరణం బలరామ కృష్ణమూర్తి గారు పంటలు దెబ్బతింటున్నాయని, దానికి ఏమైన నష్టపరిహారం ఇస్తారా అని అడిగారు. దీనికి ఎక్కడా నష్టపరిహారం ఇవ్వలేదు. దానికి కూడా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంటాము. అలాగే డా.ఎం.వి.వి.ఎస్. మూర్తి గారు కొండముచ్చులను తీసుకువచ్చి అక్కడ ఉంచితే బాగుంటుందని అన్నారు. దానిపై కూడా ఆలోచించి నిర్ణయం తీసుకుంటాము. రాము సూర్యరావు గారు కూడా కొన్ని సూచనలు ఇచ్చారు. అలాగే విటపు బాలసుబ్రహ్మణ్యం గారు కూడా మంచి సూచనలు ఇచ్చారు. ఈ విషయంపై అధికారులతో చర్చించి, కోతుల బెడదను నివారించడానకి తగిన చర్యలు తీసుకుంటాము.

**MR. CHAIRMAN:** Next Question No.10180(10) by the Minister for Tribal Welfare and Empowerment.

## ఎ.పి.టి.డబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్ ఉపాధ్యాయుల సర్వీసుల క్రమబద్ధీకరణ

ప్రశ్న నెం.10180(10)

**శ్రీ గుండుమల తిప్పేస్వామి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) ఎ.పి.టి.డబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్. పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు ఏదైనా ప్రతిపాదన ఉందా;

ఆ) అయితే, ఎప్పటిలోగా వారి సర్వీసులను క్రమబద్ధీకరించడమవుతుంది?

**గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం – సాధికారత మరియు గిరిజన సంక్షేమ – సాధికారత శాఖ మంత్రి (శ్రీ నక్కా ఆనంద్ బాబు):**

అ) మహాశయా, ఎ.పి.టిడబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్.లో 2 కేటగిరీల ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు అంటే;

1. రెగ్యులర్ ఉపాధ్యాయులు, (బి) అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు. కాంట్రాక్టు ప్రాతిపదికపై ఎటువంటి ఉపాధ్యాయులను నియమించలేదు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**డా.ఎ.ఎస్.రామకృష్ణ (ఉపాధ్యాయ నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, nomenclature ఏదైనప్పటికీ మొట్టమొదట గెస్టు టీచర్స్ అన్నారు. తరువాత పార్ట్‌టైమ్ టీచర్సు అన్నారు. ఆ తరువాత మూడు నెలల క్రితం వీళ్ల nomenclature మార్చారు. వాళ్లని ఔట్‌సోర్సింగ్ టీచర్స్‌ని పేరు పెట్టారు. మరి కాలేజ్‌లలో పని చేస్తున్న వారికి రూ.18వేలు, పీజీటీలకు రూ.16వేలు, టీజీటీలకు రూ.14వేలు చొప్పున పెంచారు. అందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఔట్‌సోర్సింగ్ ఎప్పుడూ ఔట్‌సోర్సింగే. మనం తెలుగులో పొరుగుసేవలని మాట్లాకుంటున్నాము. మన అనే మాట లేదు. గిరిజన పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏజెన్సీ క్రింద పనిచేసే టీచర్స్ ఒక రకమైనటువంటి అభద్రతా భావనతో ఉన్నారు. మానవుని స్వభావం ఏమిటంటే భద్రతా భావన ఉన్నప్పుడే సమర్థవంతంగా పనిచేయడానికి అవకాశం ఉంది. మనకు గిరిజన ప్రాంతాల్లో విద్యను పెంపొందించాల్సిన ఆవశ్యకత మరియు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉంది. ఈ ఔట్‌సోర్సింగ్ వారికి భద్రతా భావన కల్పించడం లేదు. అందుకని వీరిలో ఎంతో అభద్రతా భావన ఉంది. అంతేగాకుండా, ప్రభుత్వం వీరికి ఇచ్చే జీతాన్ని 12 నెలలకు గానూ, 10 నెలలకు మాత్రమే ఇస్తున్నారు. దీనివలన ఒక రకమైన గందరగోళం నెలకొంటుంది. ఇప్పుడు సభలో మూడు గురుకులాలకు సంబంధించిన బీసీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రులు ఉన్నారు. ఇటీవల విద్యారంగంలో ఉన్న సమస్యలను చర్చించడానికి మంత్రి గారు ఎమ్మెల్సీల కమిటీ వేశారు. నా సలహా ఏమిటంటే ఉదాహరణకు సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్స్, గెస్టు లెక్చరర్స్, పార్ట్‌టైమ్ లెక్చరర్స్, రెగ్యులర్ లెక్చరర్స్ ఉన్నారు. అలాగే గురుకులాల్లోనూ ఈ నాలుగు వ్యవస్థలు ఉన్నాయి. గిరిజన పాఠశాలల్లో ఈ వ్యవస్థ లేదు. దీనివలన ఒక విధమైన గందరగోళం ఉంది. ఈ గందరగోళాన్ని తీసివేయడానికి ఎమ్మెల్సీలతో ఒక కమిటీ వేసి అన్ని గురుకులాల్లో ఒకే విధానం అమలుచేయాలని కోరుతున్నాను.

**శ్రీ నక్కా ఆనంద్ బాబు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు డా. ఎ.ఎస్. రామకృష్ణ గారు చెప్పిన దాని ప్రకారం గిరిజన గురుకుల పాఠశాలల్లో ఇటీవల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్స్ అందరినీ రెగ్యులరైజ్ చేయడం జరిగింది. ఆ తరువాత ఔట్‌సోర్సింగ్ విధానం అమలవుతూ ఉన్నది. ఈ సమస్యపై సభ్యులు చెప్పిన విధంగా ఆలోచించి తగిన చర్యలను తీసుకుంటాము.

**MR.CHAIRMAN:** Papers included in the agenda are deemed to have been laid on the Table of the House. Paper included in the agenda is deemed to have been placed on the Table of the House

## 3.సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు

1. "A copy of the Andhra Pradesh Police (Reforms) (Amendment) Ordinance, 2017 (A.P. Ordinance No. 4 of 2017), as required under clause 2(a) of Article 213 of the Constitution of India.

2. "A copy of the Andhra Pradesh Private Universities (Establishment and Regulation) (Amendment) Ordinance, 2018 (A.P. Ordinance No.1 of 2018), as required under clause 2(a) of Article 213 of the Constitution of India."

3. "A copy of the 40th Annual Report of the Andhra Pradesh State Seeds Development Corporation Limited for the Year 2016-17 as required under Section 394 of the Companies Act, 2013."

4. "A copy of the 16th Annual Report of the Andhra Pradesh Power Finance Corporation Limited for the year 2015-2016 in compliance with Sections 617, 619, 619-A & 619-B of the Companies Act, 1956."

5. "A copy of the Annual Report of the Andhra Pradesh Pwer generation Corporation Limited for the Year 2016-17 in compliance with Section 394 of the Companies Act, 2013."

## 4. సభా సమక్షలో పెట్టబడిన పత్రం

"A copy of the report on the decisions of the Business Advisory Committee taken at its meeting held on 27th March, 2018."

Now, Special Mentions

## 5. సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి(శాసనసభ నియోజకవర్గం) :** అధ్యక్షా, శాసనమండలి సభ్యులకు సంబంధించి ఈ మధ్య కాలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘనను సభ ద్వారా తమ దృష్టికి తీసుకువస్తున్నాను. ఎమ్మెల్యేల కంటే ప్రోటోకాల్ ఎక్కువైనటువంటి ఎమ్మెల్సీలకి ఎప్పుడైనా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు గౌరవ మర్యాదల్లో చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. నేను ఈ మధ్య కాలంలో కొన్ని ఆఫీసులకు వెళ్లినప్పుడు అలా జరిగింది. అందుకే, ఈ విషయాలను తమ దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతో సభలో ఈ ప్రత్యేక ప్రస్తావన చేయడానికి అనుమతించాలని మిమ్మల్ని అడిగాను. మండల ఆఫీసుల్లో గానీ, ఎంపీడీఓ ఆఫీసులకు వెళ్లినప్పుడు గాని అక్కడి సిబ్బంది మీరు ఇక్కడికి రావలసిన అవసరం లేదు, మిమ్మల్ని మేము పిలువ లేదు అనే పరిస్థితుల్లో మాట్లాడుతున్నారు. కాబట్టి, మా గౌరవ మర్యాదలకు భంగం కలుగకుండా తమరు చర్యలు తీసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:** మీరు లెటర్ పంపించండి. సంబంధిత మంత్రి గారికి పంపిస్తాము.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు:** అధ్యక్షా, కృష్ణా జిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో వివిధ గ్రామాల్లో ఫ్లోరైడ్ వాటర్ త్రాగడం మూలంగా వచ్చే కీళ్ల నొప్పులకు విరీతమైన పవర్‌ఫుల్ మందులు వాడటం కారణంగా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడి, ప్రజలు కిడ్నీ వ్యాధి భాధితులుగా మారి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే చూసినా, గత 2 సంవత్సరాలలో 14 మంది చనిపోయారని ఉంది. కానీ, మేము పరిశీలిస్తే ఈ 5 సంవత్సరాల కాలంలో సుమారుగా 100 మంది అక్కడ చనిపోయినట్లుగా సర్వేలో తేలింది. నేను ప్రత్యక్షంగా కూడా చూశాను. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో గిరిజన తండాలు ఎక్కువగా ఉంటాయి. నేను దీపలానగర్, చైతన్య నగర్, మత్రేయ తండా, మాన్‌సింగ్ తండా, । మలపాడు పెద్ద తండా, లక్షీపురంలను సందర్శించాను. ఈ గ్రామాలను కృష్ణా జిల్లా స్థానిక మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు గారు కూడా ప్రత్యేకంగా సందర్శించి, స్థానికంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేదు. కాబట్టి, ఈ విషయంలో ప్రభుత్వం కూడా జోక్యం చేసుకొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగా శాశ్వత మంచినీటి పైపు లైన్లు వెయ్యాలి. ఈ లోపుగా ట్యాంకర్ల ద్వారా ఆ గ్రామాలకు మంచినీటిని అందించాలి. అత్యవసరంగా ఎ.కొండూరు పిహెచ్‌సిలో ఒక డయాలసిస్ సెంటరును ఏర్పాటు చేసి, ఒక నెఫ్రాలజిస్ట్‌ను కూడా నియమించాలి. అక్కడ ఆల్‌రెడీ ఒక పోస్టు ఖాళీగా ఉంది. తగినంత మంది సిబ్బంది లేరు, 25 మంది ఎ.ఎన్.ఎం.లకు గాను, అక్కడ 11 మందే పనిచేస్తున్నారు. తగినంత మంది సిబ్బందిని నియమించాలని కోరుతున్నాను. అలాగే, వీరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కూడా సహాయం అందించాల్సిన అవసరం ఉంది. అలాగే గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ మధ్య సమన్వయం ఏర్పడితే ఈ సమస్యకు పరిష్కారం ఏర్పడుతుందని నేను భావిస్తున్నాను.

ఉ.11.10

**శ్రీ జి.దీపక్ రెడ్డి (స్థానిక సంస్థలు – అనంతపురం):** అధ్యక్షా, ఈ రోజు ప్రత్యేక ప్రస్తావనకు నాకు అవకాశ మిచ్చినందుకు మీకు కృతజ్ఞతలు. నేను చాలా బాధతో ఈ విషయాన్ని మాట్లాడవలసి వస్తోంది. నేను ఈ సభలో ఒక సభ్యుడిగా ఎన్నికై వచ్చినందుకు చాలా గౌరవంగా భావించాను. మన సభకున్న చరిత్రను ఒకసారి గమనిస్తే, గతంలో స్వాతంత్ర్య సమరయోధులు కూడా ఈ సభలో ఉండేవారు. చాలా గొప్ప నాయకులు ఈ హౌస్‌లో ఉన్న చరిత్ర ఉంది. రాజ్యాంగపరంగా చూసినా, there is certain responsibility on this House. అదేవిధంగా కొన్ని అధికారాలు కూడా ఈ హౌస్‌కు ఉన్నాయి. ఈ రోజు పరిస్థితుల్ని చూస్తే, చాలా మంది సభ్యులతో నేను పర్సనల్‌గా మాట్లాడటం జరిగింది. చాలా మంది సభ్యులు ఈ ప్రోటోకాల్ వయలేషన్స్ వల్ల బాధతో ఉన్నారు. నేను అనంతపురం జిల్లా లోకల్ బాడీస్ నుండి శాసనపరిషత్తుకు ఎన్నికైతే, 14 లోకల్‌బాడీస్‌లో నా ఓటర్లున్నారు. కానీ, ఎక్కడా నాకు కావాల్సిన సమాచారం రావడం లేదు. ఈ విషయం మీద దాదాపు పదిసార్లు జిల్లా కలెక్టర్‌కు చెప్పడం జరిగింది. కనీసం ఇన్ఫర్మేషన్ కూడా ఇచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రంలోని 5 కోట్ల మంది జనాభాలో కేవలం 58 మంది ఈ సభలో సభ్యులుగా ఉన్నాము.

ఈ 58 మంది కూడా జిల్లాకు నలుగురు చొప్పున ఉన్నాము. కానీ, వీళ్లెవ్వరికీ కూడా కనీస సమాచారం కూడా అధికారులు ఇవ్వడం లేదంటే ఎటువంటి **recklessness** వారిలో ఉందో చూడండి. కాబట్టి, శాసన పరిషత్తు సభ్యుల గౌరవాన్ని, సభా గౌరవాన్ని కాపాడాలని మీ ద్వారా కోరుతున్నాను.

**శ్రీ కె.ఇ. ప్రభాకర్ (స్థానిక సంస్థలు–కర్నూలు):** అధ్యక్షా, నేను మొట్టమొదటిసారి మాట్లాడుతున్నాను. నాకు ఈ అవకాశమిచ్చినందుకు మీకు నమస్కారాలు తెలియజేస్తున్నాను. ఇంతకుముందే చెప్పినట్లుగా, గౌరవ శాసన మండలి సభ్యులకు ఎదురైన అనుభవమే నాక్కూడా ఎదురైంది. అయితే, నాకు సమస్య లేదు. కానీ, సాక్షాత్తూ శాసన మండలి ఛైర్మన్ అయిన మీక్కూడా అలాంటి అనుభవమే ఎదురైంది. మీరు పట్టించుకోలేదనుకుంటా. అధ్యక్షా, ఈ విషయం మీద నేను మీకు లెటర్ ఇచ్చాను. ఆ లెటర్ మీద చర్యలు తీసుకోవాలని మిమ్మల్ని కోరుతున్నాను. ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేయాలని కోరుతున్నాను.

**CHAIRMAN:** Now, Tea Break for 15 minutes.

(The House then adjourned at 11.11 a.m.)

ఉ.11.40

(తేనీటి విరామానంతరం సభ ఉ.11.40 లకు ప్రారంభమయింది.)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్షస్థానం వహించారు)

## 6.సభా కార్యక్రమం – అర్జీల సమర్పణ

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం):** అధ్యక్షా, ఉపాధ్యాయ ఉద్యోగులకు పదవీ విరమణ పొందిన తరువాత 300 రోజుల వరకు **half pay leave** ను **earned leave** గా మార్చుకునే సౌకర్యాన్ని ఇచ్చారు. అయితే, 2013వ సంవత్సరంలో వీళ్ళు లోకల్‌బాడీస్ అని చెప్పి ఆ సౌకర్యాన్ని నిలిపివేశారు. మళ్ళీ 2017వ సంవత్సరంలో మేము లోకల్ బాడీస్ కాదు, 1981వ సంవత్సరంలోనే **provincilisation** కాబడ్డాము కాబట్టి, మేము గవర్నమెంటు సర్వెంట్లమేనని చెప్పి సుప్రీంకోర్టులో జడ్జిమెంటు వచ్చిన తరువాత, ప్రభుత్వం పరిశీలించి దానిపై మళ్ళీ జీవో ఇచ్చింది. తప్పు అని ఆరోపించిన అంశాన్ని ఆ తరువాత కరెక్టు అని చెప్పి ప్రభుత్వం జీవో ఇచ్చినప్పుడు, ఆ **gap period** కు సంబంధించి ఎటువంటి నిర్ణయం చెప్పకుండా, **prospective**గా ఇచ్చారు. కావున దీనిని పరిశీలించి ఉద్యోగులకు తగిన న్యాయం చేయవలసిందిగా కోరుతూ ఈ పిటీషన్‌ను సభకు సమర్పిస్తున్నాను.

(అర్జీని సమర్పించారు)

**శ్రీ కత్తి నర్సింహా రెడ్డి:** అధ్యక్షా, స్పెషల్ మెన్షన్ ఇచ్చాను.

**మిస్టర్ ఛైర్మన్:** స్పెషల్ మెన్షన్ సమయం అయిపోయింది. ఇప్పుడు అర్జీలు ఉంటే ఇవ్వండి.

**శ్రీ కత్తి నర్సింహా రెడ్డి:** సరే అధ్యక్షా. ఏ.పి. సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు పరిధిలో దాదాపు 1269 మంది ఫుల్‌టైం గెస్ట్ టీచర్లు, పార్ట్ టైం టీచర్లు పనిచేస్తున్నారు. బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఏపిఆర్ఇఐఎస్‌లో పనిచేసే వారందరికీ హానరోరియం పెంచారు. కానీ, సోషల్ వెల్ఫేర్‌లో ఉండే వారికి మాత్రం దాదాపు 22 నెలలుగా హానరోరియం పెంచలేదు. ఫైలు అటూ, ఇటూ తిరుగుతోంది కానీ, ఇంతవరకు అది అప్రూవల్ కాలేదు. కాబట్టి, మిగతా గురుకులాల మాదిరిగానే వీరికి కూడా హానరోరియం పెంచాలని, అలాగే కాంట్రాక్టు వారికి, వీరికి కూడా ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ పిటీషన్‌ను తమకు సమర్పిస్తున్నాను.

(అర్జీని సమర్పించారు)

## 7.గవర్నరు ప్రసంగంపై తీర్మానం – చర్చ

**CHAIRMAN:** Discussion on the Motion on Governors Address. Sri Manikya Vara Prasad garu,

**SRI D. MANIKYA VARA PRASAD:** Sir with your permission I beg to Propose:

"That the Members of Andhra Pradesh Legislative Council assembled in the Thirtieth Session are deeply grateful to the Governor for the Address which he has been pleased to deliver to the Legislative Council on 05.03.2018."

**SRI MOHAMMED AHEMD SHARIFF:** Sir, I Second the Motion.

**CHAIRMAN:** Sri Manikya Vara Prasad garu.

**శ్రీ డొక్కా మాణిక్యవరప్రసాద్:** అధ్యక్షా, మా ప్రభుత్వంపట్ల, రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు, కేంద్రం నుండి రావలసిన అనేక అంశాల పట్ల ఒక స్పష్టమైన వైఖరితో ఉన్న విషయాన్ని గవర్నరు గారు తమ సందేశంలో తెలియచేశారు.

అధ్యక్షా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కోపరేటివ్ ఫెడరలిజమ్ ద్వారా రాజ్యాంగ పరిధిలో, హక్కులతో, బాధ్యతలతో పనిచేయవలసి ఉంటుందనేది మీ అందరికీ తెలుసు. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్య కాలంలో చాలా విషయాలలో రాష్ట్రప్రభుత్వాలని నిర్లక్ష్యం చేస్తుందనేది ప్రజల అభిప్రాయం. 2014వ సంవత్సరంలో తెలుగు రాష్ట్రాన్ని విభజించారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎదగాలంటే ఇబ్బందులేమిటో దేశ ప్రజానీకానికి తెలుసు, పార్లమెంట్ సభ్యులకు తెలుసు, దేశంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రికి, మంత్రులకు, వ్యవస్థ అంతటికీ తెలుసు. రాష్ట్రం విడిపోయిన తరవాత మనకు రాజధాని లేదు, అడ్రస్ లేదు, ఉండటానికి ఇల్లు లేదు, ఆఫీసు లేదు. ఎటువంటి

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకుండా రాష్ట్రాన్ని విభజిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు పాలోమని అమరావతికి వచ్చి ఒక బస్సులో తన official duties discharge చేశారంటే ఈ భారతదేశంలో ఎంత దయనీయమైన పరిస్థితులు ఉన్నాయో అర్థంచేసుకోవచ్చు. అయినప్పటికీ నిస్పృహ చెందకుండా, బాధ్యతలను విస్మరించకుండా, అటువంటి పరిస్థితులను కూడా ఛాలెంజ్‌గా తీసుకుని, 5 కోట్లమంది ప్రజలు ఇచ్చిన తీర్పుని బాధ్యతగా తీసుకుని రాష్ట్రాన్ని ఈ రోజు ఈ దశకు తీసుకువచ్చారు.

అధ్యక్షా, దేశంలో ఒక ప్రాజెక్టు కట్టాలంటే ల్యాండ్ అక్విజిషన్‌కు ఎంత సమస్య అవుతుందో మనకు తెలియనిది కాదు. బెంగాల్ రాష్ట్రంలో సింగూరువద్ద టాటా ప్రాజెక్ట్ వస్తే ఎంత పెద్ద ఉద్యమం జరిగిందో మీకు తెలుసు. దేశంలో అనేక ప్రాజెక్ట్‌ల విషయంలో ఎన్నో సమస్యలు వస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి మాట మీద నమ్మకంతో 33,000 ఎకరాలు మా రాజధాని ప్రాంత రైతులు ఇచ్చారు. ఈ ప్రాంత రైతాంగం మాకు పైసా అక్కర్లేదు, మీకు అండగా ఉంటాము, మేము రాజధాని కోసం భూములిస్తాము తీసుకోండని 33,000 ఎకరాలు ఇచ్చారు. ఈనాడు అసెంబ్లీ, కౌన్సిల్, సెక్రటేరియట్ భవనాలు ఇంత చక్కగా నిర్మించి, మనం ఇంత ప్రశాంతంగా మాట్లాడుకుంటున్నామంటే ఆ రైతుల త్యాగఫలమనే విషయాన్ని ముఖ్యమంత్రిగారు పదే పదే చెబుతున్నారు.

అధ్యక్షా, పుట్టిన బిడ్డ ఎదగాలంటే ఏ ఆహారం కావాలి, ఏ మందులు కావాలని తల్లిదండ్రులకు తెలుసు. పుట్టిన బిడ్డ ఎదగడానికి ఆ తల్లిదండ్రులు పడే బాధ మనం నిత్యజీవితంలో చూస్తాము. రాష్ట్రం ఎదగాలంటే, 5 కోట్ల ప్రజల జీవన ప్రమాణం పెరగాలంటే ఎన్ని ఇబ్బందులుంటాయి? రూ.16,000 కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని విభజించి, ఈ రాష్ట్రాన్ని డెవలప్ చెయ్యమని, మేము సహాయం చేస్తామని చెప్పిన కేంద్రం ఆ తరువాత ఏమీ మాట్లాడకపోవడాన్ని ఏమంటారు అధ్యక్షా? Constitutional terminology అయితే అది చాలా ఇబ్బందికరమైన పదజాలం వస్తుంది. Most negligent. 5 కోట్ల మంది ప్రజలను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. స్పెషల్ కేటగిరీ స్టేటస్ ఇచ్చి మనల్ని ఆదుకుంటామని ఆనాడు పార్లమెంట్‌లో చెప్పింది ఎవరు? ఆ రోజు ముఖ్యంగా అరుణ్ జైట్లీగారు చెప్పారు, 5 సంవత్సరాలు కాదు, 10 సంవత్సరాల స్పెషల్ కేటగిరీ స్టేటస్ ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాలని చెప్పారు. ఆ రోజు వెంకయ్యనాయుడుగారు సభలో ఉండి 5 కాదు, 10 సంవత్సరాలు ఇవ్వాలి, లేకపోతే బిల్లు పాస్ చేయడానికి వీలు లేదని అన్నారు. చివరకు 5 సంవత్సరాల వరకు ఇస్తామని కేంద్రప్రభుత్వం ఒప్పుకుంటే ఇంతవరకూ ఆ విషయం తేల్చకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. స్పెషల్ కేటగిరీ స్టేటస్ వస్తే పరిశ్రమలు వస్తాయి, పెట్టుబడులు వస్తాయి, తద్వారా ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయి, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ప్రజానీకం ఎదురు చూస్తున్నారు అధ్యక్షా. దేశంలో ఉన్న రాజకీయ నాయకులలో అత్యంత సీనియర్ రాజకీయ నాయకులు మన ముఖ్యమంత్రిగారు. అటువంటి మన ముఖ్యమంత్రిగారిని 29 సార్లు పిలిపించుకుని వారి దగ్గర నుండి అనేక అర్జీలు తీసుకున్నారు. ఈ రాష్ట్రం కొత్తగా వచ్చింది, దానిని అభివృద్ధిచేయవలసిన బాధ్యత మీ ముందు ఉన్నదని పదే పదే 29 సార్లు తిరిగితే అంత నిర్లక్ష్యమా అధ్యక్షా? అది ధర్మమా, రాజధర్మమా? వారు రాజధర్మాన్ని విస్మరించారు.

రాజధర్మాన్ని గుజరాత్‌లో వదిలేశారు. కనీసం మిత్రధర్మాన్ని పాటించాలి కదా? మిత్రులుగా ఉన్నాము, మీతో కలిసి ప్రయాణం చేశాము, ఎన్నికలలో కలిసి పోటీ చేశాము, మీ ప్రభుత్వంలో ఉన్నాము, మీరే (ప్రధానమంత్రిగారే) స్వయంగా వచ్చి తిరుపతిలో చెప్పారు, అనేక ప్రదేశాలలో చెప్పారు, రాష్ట్రాన్ని ఆదుకుంటామని చెప్పారు. మీరు అధికారంలోకి వచ్చిన తరువాత 4 సంవత్సరాలైనా, ఇంత సీనియర్ ముఖ్యమంత్రి 29 సార్లు తిరిగితే మీరు ఒక్క మాట మాట్లాడరా? నిర్లక్ష్యం చేస్తారా? కేంద్రప్రభుత్వ వైఖరిని ఏమనాలి అధ్యక్షా? ఇది కో–ఆపరేటివ్ ఫెడరలిజం అని చెప్పాలా? రాజ్యాంగం విధులు నిర్వహిస్తున్నారని చెప్పాలా? మేము ఎలా మెచ్చుకోవాలి అధ్యక్షా? గవర్నరుగారి ఉపన్యాసంలో తేటతెల్లంగా చెప్పాము. ఈ విషయాలను నిర్లక్ష్యం చేయవద్దు. స్పెషల్ కేటగిరీ స్టేటస్ కాకుండా మరే అంశం మీద మేము చర్చించమని మా ముఖ్యమంత్రిగారు, మా ప్రభుత్వం, మా ప్రజలు, పార్టీ అందరం కూడా నిలదీస్తాము.

**ఉ.** 11.50

అధ్యక్షా, ఇది అయిదు కోట్లమంది ప్రజల గొంతు. దీనిని మీరు నిర్లక్ష్యం చేస్తే ఎలా? రాజ్యాంగం మీద మీకు నమ్మకం లేదా లేక రాజ్యాంగ విధులపట్ల మీకు విశ్వాసం లేదా? రాజధర్మాన్ని, మిత్ర ధర్మాన్ని పాటించలేరా? ఎంత నిర్లక్ష్యం? ఇలా అయితే ఇన్ని రాష్ట్రాలు, ప్రభుత్వాలు, ఈ భారతదేశం, 125 కోట్ల మంది ప్రజానీకాన్ని మీ నాయకత్వంలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారు? అందువల్ల మా గవర్నరుగారు కేటగారికల్‌గా విభజన చట్టం గురించి బయట, పార్లమెంట్ సాక్షిగా చెప్పిన ప్రతి అంశాన్ని కేంద్రం అమలుచెయ్యాలని చెప్పారు. అలా చెయ్యకపోతే ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదు. అయిదు కోట్ల మంది ప్రజలను నిర్లక్ష్యానికి గురిచేస్తే వాళ్ళ ఉసురు తగులుతుంది. కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏంటి? మీ ముఖ్యమంత్రిగారు, మీ ప్రభుత్వం, మీ పార్టీ ఏం చేస్తోందని టి.వి.లలో, బయట, ఇలా ఎక్కడంటే అక్కడ విద్యార్థులు, ప్రజలు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. ప్రజల వాణిని ఈ రోజు మీద్వారా కేంద్రానికి వినిపించాలని మేము కోరుకుంటున్నాము. కేంద్రం చెవులు మూసుకుని ఉంటేనో, కేంద్రం వినిపించుకోనంటేనో ప్రజాస్వామ్యంలో ప్రజలు ఊరుకోరు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ప్రజలు అనుకుంటే ప్రజాస్వామ్యంలో ఏమైనా చేస్తారు. అందువల్ల ప్రజల ఆశలను, ఆశయాలను, ప్రజాస్వామ్యపు విలువల్ని కాపాడండి.

అధ్యక్షా, పార్లమెంట్ సాక్షిగా చేసిన చట్టానికే గౌరవం లేకపోతే ఇక ఆ ప్రభుత్వాలకు ఏం విలువ ఉంటుంది? అందువల్ల మేము ఇంకోటి మాట్లాడడంకానీ, చర్చించడం కానీ చెయ్యము. స్పెషల్ కేటగిరీ స్టేటస్ ఇచ్చి తీరాల్సిందే. అయిదు కోట్లమంది ప్రజల హక్కుల కోసం, వారి భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో మేము ప్రజలవైపు నుంచి పనిచేస్తామని తమరిద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, రూ.16,000 కోట్లు గ్యాప్ ఉందనే విషయం కేంద్రప్రభుత్వ అధీనంలో ఉన్న సంస్థ, CAGనే చెప్పింది. అనేక సంస్థలు ఇంకో రకంగా చెప్తున్నాయి. ఆ గ్యాప్‌ను భర్తీ చేయాల్సిన బాధ్యత వారి మీద లేదా? రాజధానికోసం రైతులు భూములిస్తే, ఆ భూముల్ని అభివృద్ధిచేసి ప్రపంచంలోనే ఒక గొప్ప రాజధానిగా, ప్రజలంతా గర్వించే విధంగా,

తరతరాలు గుర్తుంచుకునే విధంగా ఒక విజన్‌తో ముఖ్యమంత్రిగారు అమరావతి రాజధానిని నిర్మించాలనుకుంటే దానికి వారు సహకరించరా? వారికేం తక్కువైంది? ఆంధ్రప్రదేశ్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? అంటే వారికి రాజకీయాలేనా? నెంబర్ గేమేనా? అయిదుకోట్ల మంది ప్రజల్ని నిర్లక్ష్యం చేస్తే ఆ ఉసురు భరించాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని తమరిద్వారా హెచ్చరిస్తున్నాను.

అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు 29సార్లు ఢిల్లీ వెళ్ళారు. చివరిసారిగా ఆయన 12.1.2018న కూడా వెళ్ళి ప్రధానమంత్రిగారిని, కేంద్ర మంత్రులను కలిసి మా రాష్ట్రానికి ఏదైనా చెయ్యండి, మీరే చట్టం చేశారు కాబట్టి ఆ చట్టాన్ని గౌరవించి, అమలుచేయాలని తన బాధను వ్యక్తంచేస్తూ, అయిదు కోట్లమంది కన్నీటి విజ్ఞప్తులను ప్రధాన మంత్రిగారికి తెలియజేశారు. ఆయన సహృదయంతో అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యంలో దయ లేకపోతే ఎలా? ప్రజాస్వామ్యంలో రాజధాని లేకుండానే ఒక రాష్ట్రం ఏర్పడి, అయిదు కోట్లమంది ప్రజలు నిరాశ్రయులుగా ఉంటే, వాళ్ళను ఆదుకోవాల్సిన పరిస్థితి కేంద్రప్రభుత్వానికి లేదా? ప్రజాస్వామ్యమంటే ఏంటి? కోఆపరేటివ్ ఫెడరలిజం అంటారు. అందుకే "రాష్ట్రాలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయనీ, రాష్ట్ర హక్కుల్ని కాలరాస్తున్నారని కేంద్రం మిథ్య అని, కేంద్ర ప్రభుత్వం మీద పోరాటం చేస్తాను" అని మా నాయకుడు ఎన్.టి.రామారావుగారు గతంలోనే చెప్పారు. అలాంటి పరిస్థితి రాకుండా రాజ్యాంగ విధుల్ని నిర్వహించాల్సిన బాధ్యత కేంద్రంమీద ఉంది. సీనియర్ మోస్ట్ రాజకీయ నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు చాలా నమ్రతగా 29సార్లు కేంద్రం వద్దకు వెళ్తే వారు ఆ విధంగానా చేసేది.

అధ్యక్షా, చట్టంలోని స్పెషల్ కేటగిరీ స్టేటస్ విషయం గురించి కేంద్రం మాట్లాడదు. అలాగే రిసోర్సెస్ గ్యాప్, లోటు బడ్జెట్ గురించి మాట్లాడరు. పోలవరం ప్రాజెక్ట్‌ద్వారానే ఈ రాష్ట్రం అభివృద్ధి చెంది, రైతులకు మేలు కలగడమేగాక, కృష్ణా–గోదావరి అనుసంధానం జరిగి నదీ జలాల్ని సద్వినియోగం చేసుకోవడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రిగారు ఎంతగా కష్టపడుతున్నారో దేశమంతా చూస్తోంది. "ఏ టి.వి ఛానల్ చూసినా, ఏ పత్రిక చూసినా పోలవరం అని వస్తోంది, పోలవరం గురించి ముఖ్యమంత్రిగారు చాలా కష్టపడుతున్నారు, మేము తప్పకుండా సహాయం చేస్తాము" అని కేంద్ర జలవనరుల శాఖా మంత్రిగారే అన్నారు. అయినా వారు ఏం సహాయం చేస్తున్నారు? పోలవరాన్ని పూర్తిగా ఆదుకుంటామని చట్టంలో చెప్పారు. ఇప్పటివరకూ ఇవ్వాల్సిన ప్రతిదాంట్లో పే। సే. పోలవరాన్ని ముందుకు తీసుకెళ్ళకుండా అనేక రకాలుగా ఇబ్బందులు సృష్టిస్తున్నారు. పోలవరం జీవనాడి అని ముఖ్యమంత్రిగారు ఒక పక్క చెప్తున్నారు. అలాగే ప్రజలూ ఆశిస్తుంటే దానిని పూర్తి చేయాల్సిన బాధ్యత, చట్టంలో చెప్పిన విధంగా నిధులు ఇవ్వాల్సిన బాధ్యత, ఇంప్లిమెంట్ చేయాల్సిన బాధ్యత వారి మీద లేదా?

అధ్యక్షా, పోలవరం పూర్తయితే గోదావరి నీరు కృష్ణాకు వచ్చి, కృష్ణానుంచి నాగార్జున సాగర్ రైట్ కెనాల్ మీదుగా తుంగభద్రదాకా జలాలను తీసుకెళ్ళడంవల్ల మా గుంటూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలకేగాక, గొల్లపల్లి దగ్గర 200 టి.ఎం.సి.లు నిలబెట్టడం ద్వారా, ఆ నీటిని మరలా పెన్నాకి, తుంగభద్రకు తీసుకెళ్ళి మొత్తం రాయలసీమలోని

వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిచేయాలని ముఖ్యమంత్రిగారు కలలు కంటూంటే వారు పురిట్లోనే సహాయం చేయకపోతే ఎలా? ఇది ధర్మమా అని తమరిద్వారా నేను కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రానికేం ఇబ్బంది? ప్రతి రాష్ట్రానికి ఒక రైల్వేజోన్ ఉండాలని చట్టం చెప్తోంది. ఆ చట్టాన్ని గౌరవించి ఒక రైల్వే జోన్ ఇవ్వడానికి మీకేం అభ్యంతరం? రైల్వే జోన్ విషయంలో ఇతర రాష్ట్రాలు ఏదో పే। పెడ్తున్నాయంటున్నారు. అంటే ఇతర రాష్ట్రాలు పే। పెడితేనే రాష్ట్రాన్ని విభజించారా? రాష్ట్ర విభజనలో మీరూ భాగం పంచుకున్నారుగా? మీరు లేకపోతే ఆరోజు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ముందుకెళ్ళేది కాదు కదా? మీరెందుకు ఆరోజు ఆ మాట చెప్పారు?

అదేవిధంగా, establishment of a Greenfield Crude Oil Refinery, Petro Chemical Complex వంటివి చట్టంలో పెట్టారు కదా! దాని గురించి పట్టించుకోరు. ఢిల్లీని తలదన్నే రాజధానిగా అమరావతిని చేస్తామన్నారే. అమరావతి గురించి ఏమైంది? దానిని పట్టించుకోరు. అమరావతిని గొప్ప రాజధానిగా నిర్మించాలని ముఖ్యమంత్రిగారు అనుకుంటూ ఉంటే మీరు పట్టించుకోరు. రాజధాని డాక్యుమెంట్స్, ముఖ్యమంత్రిగారి విజన్‌ను ఒకసారి అందరూ చూడాలి. అలాగే ఢిల్లీవాళ్ళు కూడా చూడాలి. ఇంత గొప్ప రాజధానిని భవిష్యత్తు తరాలు కొన్ని వేల సంవత్సరాలపాటు గుర్తుంచుకునే విధంగా, చరిత్రలో అమరావతివంటి గొప్ప రాజధానిని నిర్మించిన ముఖ్యమంత్రిగారు ఉన్నారని చరిత్రలో ప్రజలందరూ కూడా తెలుసుకునే విధంగా, తెలుగు ప్రజలందరూ గర్వించే విధంగా, రాజధానిని నిర్మించాలని చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో వెళ్తోంటే దానికి మీరు సహకరించరు. ఏంటి అధ్యక్షా ఇది? Peoples Capital of Andhra Pradesh. ఇది ఎలా ఉంటుందంటే Justice City, Electronic City, Knowledge City, Health City, Media City, Sports City, Tourism City, Government City, Finance City ఇట్లా అన్ని నగరాలు నిర్మించి ఒక గొప్ప రాజధాని, కొత్త రాజధాని, ప్రపంచంలో ఎవరూ ఊహించని రాజధానిగా అమరావతిని నిర్మించాలనుకుంటే వారు సహకరించడం లేదు.

అమరావతి అంటే స్వర్గం. శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు ఏ ఆశయంతో అమరావతిని నిర్మించారో కానీ, అటువంటి అమరావతి నిర్మాణంలో అంతా దళితుల పాత్ర ఉందని ఈ సందర్భంలో చెప్పాల్సిన అవసరముంది. అంతేగాకుండా, సభ ద్వారా రాష్ట్రానికి తెలియాల్సిన అవసరముంది. అధ్యక్షా, మనం తెలుగు ప్రజలం. శుభసూచకంగా పూర్ణ కుంభం ఇస్తాము. ఆంధ్రప్రదేశ్ గుర్తు పూర్ణ కలశం. అది ఎలా వచ్చిందంటే, అమరావతి చరిత్ర తవ్వకాలు తవ్వుతుంటే బుద్ధిజం వారి స్తూపం కనిపించింది. ఆ స్తూపంలో ప్రధానంగా దీనిమీదే సాహిత్యం ఉంది. అదేంటంటే విదుకుడు అనే ఒక దళిత చర్మకారుడు, మాదిగ కులానికి చెందినవాడు. ఒకరోజు ఒక బౌద్ధభిక్షువు ఆకలిని తీర్చడానికి విదుకుడు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం చెప్పి ఆహారాన్ని అందించాడు. పూర్ణ కుంభం అంటే ఎదుటి వారి ఆకలిని ప్రేమించడం, ఆకలిని తీర్చడం. ఇవన్నీ పూర్ణకుంభంలో కలిసి ఉన్నాయి. అది చరిత్ర తవ్వకాలలో బయటపడింది. దానిమీద మొట్టమొదటి తెలుగు అక్షరం 'నాగబు' అని ఉంది. అంటే అమరావతికి అలాంటి

చరిత్ర ఉంది. అమరావతి తరువాత నూతన అమరావతిని శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు నిర్మిస్తే, ఆ నిర్మాణాన్ని చేపట్టింది వారి సర్వసైన్యాధ్యక్షుడు కొలకలూరి భుజంగరావు. అతను అమరావతి మాదిగపల్లికి చెందిన ఒక దళితుడు. నేను ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించాను.

మ.12.00

ఆరోజు వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు అవతలి ఒడ్డువైపు ఉంటే వారిని కాపాడుకుని అక్కడి నుండి ఇక్కడకు తీసుకుని వచ్చి, ఇక్కడ రాజధానిని నిర్మించి ఈ రాజధానిలో దళితులమైన మేము మీకు అండగా ఉంటామని, మీ ప్రాణానికి మా ప్రాణం ఇస్తామని ఆ రోజు రాజ్యంలో ఉన్న అన్ని ఇబ్బందులను నవరించి కొలకలూరి భుజంగరావు ఆ రాజుని, రాజ్యాన్ని కాపాడారు. ఈ రోజు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు కట్టే నూతన అమరావతిలో, ఈ **peoples capital**లో, ఇన్ని సిటీలలో, నవ రాజధానిలో, ప్రజారాజధానిలో మేము దళితులం, పేదవారు, రైతులు అందరూ కూడా ముందుకు వచ్చి భూములు ఇచ్చి సహకరిస్తూ, ముందుకు వెళుతూ ఉంటే కేంద్రప్రభుత్వం సహకరించదా? ఇది ఏం ధర్మం అధ్యక్షా? ఇది రాజధర్మమా, మిత్రధర్మమా అధ్యక్షా?

అదేవిధంగా ప్రముఖ జాతీయ సంస్థలు, నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న దుగరాజపట్నం పోర్టు చాలా అవసరం. పోర్టు అనేది ఆర్థికంగా ఎంతో ముఖ్యం. ఒకపోర్టు నిర్మాణం జరిగితే ఎన్నో వేల మందికి ఉద్యోగాలు వస్తాయి, ఎంతో ఆర్థిక పరిస్థితి పరిపుష్టం అవుతుంది. వారు దుగరాజపట్నం పోర్టు గురించి మాట్లాడడం లేదు. అదేవిధంగా **Increase of seats in A.P Legislative Assembly**, సరే అది మీ ఇష్టం, ఇస్తే ఇవ్వండి లేకపోతే లేదు. కాని అది కూడా ఇవ్వాలని చట్టంలో ఉంది కదా? దానికి ఏం అబ్జెక్షన్ ఉంది? ఏ పార్టీ అబ్జెక్షన్ పెట్టింది? కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యం కాక మరేమిటి ? అదేవిధంగా **anomalies in taxation matters, Steel plant in YSR Kadapa District.** స్టీల్ ప్లాంట్ నిర్మించడానికి ఎవరు అబ్జెక్షన్ పెట్టారు? ఏ పార్టీ అబ్జెక్షన్ పెట్టింది? ముఖ్యమంత్రిగారు ల్యాండ్ ఇస్తామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. వారు పెట్టుబడి పెట్టి ఒక స్టీల్‌ప్లాంట్ నిర్మించలేరా? కేంద్రప్రభుత్వం ప్రతి విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నదనేది తమరిద్వారా తెలియజేస్తున్నాను.

వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ వస్తే చాలామందికి ఉద్యోగావకాశాలు వస్తాయి, పరిశ్రమలు వస్తాయి, సముద్రతీర ప్రాంతం అంతా కూడా మంచి ఎకనామిక్ హబ్‌గా తయారవుతుందని ప్రజలు, ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు. అది ప్రారంభించడానికి వారికి ఉన్న అభ్యంతరం ఏమిటి? దానికోసం ఎందుకు కృషి చేయరు? విశాఖపట్నం, విజయవాడ నగరాలకు మెట్రోరైలు కోసం నిధులు కేటాయించాలి. అహ్మదాబాదుకు, ముంబై హై స్పీడ్ రైల్ ప్రాజెక్ట్‌కు లక్షల కోట్లు ఇస్తారు. మాది కొత్త రాష్ట్రం, అమరావతి కొత్త రాజధాని, పసిబిడ్డలాంటి దానిని ఆదుకోవడానికి కేంద్రప్రభుత్వానికి చేతులు రావడం లేదు. ఎంత అన్యాయం? **Rapid rail and road connectivity to Amaravathi.** అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోంది. ఈ రాజధానికి అనంతపూర్, చిత్తూరు వంటి

వెనుకబడిన ప్రాంతాల నుండి ప్రజలు రాజధానికి రావాలంటే రోడ్ కన్కెక్టివిటీ ఉండాలి కదా? అందుకు ఎందుకు చొరవ తీసుకోరు? అది మీ బాధ్యత కాదా? చట్టంలో ఉంది కదా? కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యం ప్రతి విషయంలోనూ కనపడుతోందన్న విషయాన్ని మీద్వారా వారికి తెలియజేస్తున్నాను.

Rapid rail connectivity to Amaravathi, development assistance to backward districts. అధ్యక్షా, రాయలసీమ ఎంత వెనుకబడిన ప్రాంతమో మీకు తెలుసు. అనంతపురంలో వర్షపాతం చాలా తక్కువగా ఉంటుంది. వారిని ఆదుకోవాలి, వారికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు కదా? చట్టంలో పెట్టుకున్నారు కదా, ఆ చట్టాన్ని గౌరవించి దానికి సంబంధించిన నిధులు ఇవ్వాలి కదా? నేను మొన్న విశాఖపట్టణం జిల్లాలోని ఒక గ్రామీణ ప్రాంతానికి వెళ్లి వచ్చాను. రామానాయుడనే మిత్రుడు దళిత తేజం అనే ప్రోగ్రాం నిర్వహిస్తే వెళ్లాను. అక్కడి ప్రజల జీవన విధానం, వారి వస్త్రాలు, ఆర్థికంగా వారి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. మరోసారి ప్రధానమంత్రిగారు మన రాష్ట్రానికి వస్తే అటువంటి ప్రాంతానికి తీసుకువెళ్లి వారి పరిస్థితిని వివరించాలనిపించింది. ఆంధ్రప్రదేశ్ అంటే విశాఖపట్నం వంటివి మాత్రమే కాదు, అమరావతి, గ్రామీణ ప్రాంతాలు కూడా ఉన్నాయి. వెనుకబడిన జిల్లాలకు ఎందుకు సహాయం చేయరు? అందుకు గల ఇబ్బంది ఏమిటి? వారు ఎప్పుడు అభివృద్ధి చెందాలి? వారికి ఎప్పటికి అభివృద్ధి ఫలాలు అందాలి? ముఖ్యమంత్రిగారి తపన కూడా అదే కదా! ముఖ్యమంత్రిగారు అన్ని గంటలు కష్టపడి, చలికి, ఎండకు ఓర్చి అన్ని దేశాలు తిరుగుతూ మా రాష్ట్రానికి రండి, పెట్టుబడులు పెట్టండని అంటోంది వెనుబడిన జిల్లాలు అభివృద్ధి చెందాలనే కదా! దానికి సహాయం చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వానిదే కదా? రాష్ట్రచట్టంలో ఉన్న అనేక అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగారి విజన్‌తో వైజాగ్‌లో ఇండస్ట్రియల్ సమ్మిట్ నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. ఆ పెట్టుబడులవలన ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తాయి, ఈ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు దొరుకుతాయనేది ముఖ్యమంత్రిగారి తపన. ఆ మూడు రోజులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని సంస్థలను పిలిచి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితులను అందరికి వివరించడం జరిగింది. Ease of Doing Business లో ఆంధ్రప్రదేశ్ నెం.1, పరిశ్రమల క్లియరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ నెం.1, మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆంధ్రప్రదేశ్ నెం.1. వీటన్నింటికి కారణం ముఖ్యమంత్రిగారి కృషే. ఆయన కష్టాన్ని గుర్తించాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం మీద ఉన్నదని మీద్వారా తెలియజేస్తున్నాను.

సమ్మిళిత వృద్ధి సాధించాలంటే పేదరికాన్ని నిర్మూలించాలి, పేదలందరికి సంక్షేమ ఫలాలు అందాలి, అభివృద్ధితోపాటు సంక్షేమం ఉండాలని ఆయన తపన పడుతోంటే అందరూ సహకరించాల్సిన బాధ్యత లేదా అని కేంద్రప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నాను. కొత్త రాజధానిలో ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, యూనివర్సిటీలు వస్తే ప్రపంచంలోనే ఒక గొప్ప నాలెడ్జ్ హబ్‌గా తయారవుతుంది. దానికి కావాల్సిన సదుపాయాలన్నీ ఆయన ఒక్కడే కష్టపడితే అవుతుందా? కేంద్రప్రభుత్వం ఉన్నది ఎందుకు? వారి బాధ్యత ఏమిటి? మా ట్యాక్సులు తీసుకువెళ్లడానికా? మేము కట్టిన ట్యాక్సులు తీసుకువెళ్లి మరలా మాకు ఇవ్వడానికా? ఇదేం ధర్మం? దీనిని రాజ్యాంగం అంటారా?

రాజ్యాంగ విధులు అంటారా? కోఆపరేటివ్ ఫెడరలిజం అంటారా? కాబట్టి కేంద్రం తమ వైఖరిని పునఃపరిశీలించుకోవాలి. ఈరోజు హ్యాపీ ఆంధ్రప్రదేశ్, సక్సెస్‌ఫుల్ ఆంధ్రప్రదేశ్ అనే హ్యాపీ ఇండెక్స్‌ను పెట్టుకుంటున్నాము. ప్రపంచంలో చాలా తక్కువ దేశాలు ఈ హ్యాపీ ఇండెక్స్‌ను వాడుతున్నాయి. అటువంటి ఈ హ్యాపీ ఇండెక్స్‌ను తీసుకుని ప్రజలను ఏవిధంగా సంతోషంగా ఉంచాలి, ప్రజల మానసిక పరిస్థితిని ఏవిధంగా ఎగ్జిక్యూట్ చేయాలని ఆయన కష్టపడుతున్నారు. దానిలో మీ పాత్ర ఏమిటని నేను కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నాను.

ఇండస్ట్రియల్ కారిడార్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈరోజ ఐ.టి పాలసీ చేశారు. శ్రీ నారా లోకేశ్‌గారు ఐ.టి శాఖ మంత్రి అయిన తరవాత ఒక గొప్ప ఐ.టి పాలసీ పెట్టారు. ఈ ఐ.టి పాలసీ మరెక్కడా ఉండదు. అనేక ఐ.టి కంపెనీలు అమరావతికి, వైజాగ్‌కు వస్తున్నాయి. ఎందుకు వస్తున్నాయంటే లోకేశ్‌గారు దేశ దేశాలు తిరుగుతున్నారు. అమెరికా, లండన్, దావోస్ వెళ్లి మా రాష్ట్రంలో ఐ.టి. కంపెనీలు పెట్టండి, మీకు అన్ని సదుపాయాలు కల్పిస్తాము, మా పాలసీ ఈ విధంగా ఉన్నదని ఐ.టి. పాలసీని ప్రపంచానికి తెలియజేసి పరిశ్రమలను ఆకర్షిస్తున్నారు. ఐ.టి. పరిశ్రమలు వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని ఆయన తపన. ముఖ్యమంత్రి కుమారుడిగాకాక రాజ్యాంగ విలువలు తెలిసిన ఒక మంత్రిగా ఈరోజు ప్రపంచమంతటా తిరుగుతున్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలని గంటలకొద్దీ కష్టపడుతున్నారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా దళిత వాడలన్నింటిలో రోడ్లనిర్మాణం ఈ సంవత్సరం చివరినాటికి పూర్తి కావాలనే ఒక లక్ష్యాన్ని పెట్టుకుని పనిచేస్తున్నారు. గ్రామాలలో వేలాది కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఈ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో మంచినీటి వసతి గురించి మాట్లాడారు. ప్రతి ఒక్క ఇంటికి మంచినీరు అందాలనే ఒక ప్రణాళిక పెట్టుకుని ముందుకు వెళుతున్నారు. అది సఫలం కావాలి. నీళ్లకోసం బిందెలు తీసుకుని మైళ్ల కొలదీ దూరం నడచివెళ్లే జీవితం నుండి వచ్చినవాళ్లం.

మ.12.10

అధ్యక్షా, ఈరోజు రాష్ట్రంలో కంప్లీట్‌గా ఓడిఎఫ్ అంటున్నాము. మరి అది జరగాలంటే నీరు కూడా చాలా అవసరం. అలాగే త్రాగునీరు కూడా చాలా అవసరం. మంచి త్రాగునీరు లేక వివిధ రకాల వ్యాధులు వస్తున్నాయి. పంచాయతీ రాజ్ శాఖామంత్రి శ్రీ నారా లోకేశ్‌గారు ఎంత కష్టపడుతున్నారో ఒకసారి అందరూ కూడా గుర్తించాలి. దీనికి కేంద్రం సహకరించాలి.

అదేవిధంగా సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్. విజన్ 2029కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రిగారు తపన పడుతున్నారు. వ్యవసాయం కోసం ముఖ్యమంత్రిగారు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గారు వైజాగ్‌లో అగ్రిటెక్ సమ్మిట్‌ను నిర్వహించి, బిల్‌గేట్స్‌ను తీసుకువచ్చి, ప్రపంచంలో ఉన్న టెక్నాలజీని మనరైతాంగానికి ఇచ్చి, రైతుల పెట్టుబడులకు తగ్గట్టుగా వారికి ఆదాయం వచ్చే విధంగా ఒక అగ్రిటెక్ సమ్మిట్‌ను నిర్వహించారు. అది ఏమైనా చిన్న విషయమా అధ్యక్షా? దానికి కేంద్రం సహకరించదా? రాష్ట్రప్రభుత్వాలే చేసుకోవాలా? కేంద్రం కేవలం

పోలీసింగా? వారు కలెక్షన్ చేసుకుని మా డబ్బు తీసుకు వెళ్లడానికా? ఇదేం ధర్మం అధ్యక్షా? రాజ్యాంగం అదేనా చెప్పింది. రాజధర్మం వారికి అదే చెప్పిందా? కో–ఆపరేటివ్ ఫెడరలిజం అంటే అదే చెప్పిందా? కాబట్టి అగ్రికల్చర్‌లో ఈరోజు రైతుల ఆదాయం పెంచాలని అగ్రిటెక్ సమ్మిట్ నిర్వహించి, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ద్వారా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. రైతులకు వారి పంటకు గిట్టుబాటుధర పెరగాలని, వారు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రిగారి తపన.

అధ్యక్షా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పోర్టులు, టూరిజం ఇలా ప్రతి అంశం మీద ముఖ్యమంత్రిగారు కృషి చేస్తున్నారు. టూరిజం ద్వారా చాలా ఎంప్లాయ్‌మెంట్ వస్తుంది. టూరిజం ద్వారా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. నిరుద్యోగులకు ఎక్కువ ఉద్యోగాలు వచ్చి వారికి మంచి జరుగుతుంది, పెట్టుబడులు వస్తాయి, రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని ముఖ్యమంత్రిగారు టూరిజంను బాగా డెవలప్ చేస్తున్నారు. అమరావతి నుండి మిగతా చారిత్రక ప్రదేశాలకు కనెక్టివిటీని పెంచుతున్నారు. కేంద్రానికి 29 సార్లు ముఖ్యమంత్రి గారు వెళ్లొచ్చినా కేంద్రంలో చలనం లేదు. సన్‌రైజ్ సిటీ, అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ అని ఇన్ని చేస్తున్నా, ముఖ్యమంత్రి గారి మీద, రాష్ట్ర ప్రజల మీద కేంద్రానికి దయలేకపోవడం చాలా బాధాకరం. Compassion is very important. రాజ్యాంగ విధుల్ని నిర్వహించాలి. రాజ్యాంగ విధులు నిర్వహించరు, దయచూపరు. కేంద్రం అంటే ఏమిటి? కేంద్రం అంటే మొండిగా ఉండడమేనా? మిలిటరీతో పరిపాలించడమేనా? ప్రజల్ని ఆదుకునేది లేదా? ఈరోజు ముఖ్యమంత్రిగారు ఒక విజన్ డాక్యుమెంటుతో పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రిగారు రాష్ట్రాన్ని ఆదుకోవాలి. ఐదుకోట్ల మంది ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించాలని ఆయన కష్టపడుతున్నారు. ఈ మధ్య మార్కెట్‌లో "India's Global Leader" అనే ఒక పుస్తకం వస్తే చూశాను. "India's Global Leader" అంటే ప్రపంచాన్ని స్టడీ చేసి, ప్రపంచాన్ని అర్థం చేసుకుని తన రాష్ట్రంలో ఎలా అభివృద్ధి చేయాలో, ఒక విజన్ డాక్యుమెంట్‌తో పనిచేస్తున్న ఒక లీడర్ గురించి రచయిత తేజస్విని పగడాల చాలా అద్భుతమైన పుస్తకం రాశారు. దీనిలో ఒక్కమాట చదివి నేను ముగిస్తాను. Chandrababu Naidu is a man who appreciates novel ideas. He was in a awe of Mr. Sang and that was evident soon after his foreign visits. Naidu discussed the best practices and ideas that impressed him the most so much so that it will be obvious to predict the idea or the person who impressed him the most in the foreign countries. His revolutionary thinking was evident in the way he made the capital announcement emphasising on decentralised development in the new state of Andhra Pradesh. Naidu is not a theoretical person, he respects debates, recognises the need for a fine argument, a strong believer in how process shapes, outcomes - ఇలా కొన్ని బెస్ట్ ప్రాక్టీసెస్‌ని, ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను ఇక్కడ ఇంప్లిమెంట్ చేసి ఈ రాష్ట్రాన్ని, ఈ ప్రజలను ఆదుకోవాలని పని చేస్తున్నారు. అందువల్ల గవర్నర్ గారు ఇచ్చిన ఈ ప్రసంగంలో తమరి ద్వారా కేంద్రప్రభుత్వానికి, రాష్ట్రప్రజానీకం వాణిని వినిపిస్తున్నాము.

అధ్యక్షా, జిడిపి, జిఎస్‌డిపి అంశానికి వస్తే కేంద్రం జిడిపి ఎంత ఉంది? ఈ రాష్ట్ర జిఎస్‌డిపి ఎంత ఉంది? ఒక రాష్ట్ర జిఎస్‌డిపి అభివృద్ధి చెందాలంటే ఆ రాష్ట్ర నాయకుడు ఎంత కష్టపడి ఉంటాడో ఆలోచించారా? దాదాపు 12 శాతం గ్రోత్‌రేటు వచ్చింది. ఈవిధంగా మరే ఇతర రాష్ట్రాలలోనూ లేదు. ఇది భవిష్యత్తులో ఏ దశకు చేరుతుంది, ప్రభుత్వం దగ్గర నిధులు ఉంటే పేదరిక నిర్మూలనకు, పేదల అభివృద్ధికి సంబంధించి అనేక కార్యక్రమాలు చేయవచ్చు. పేదలకు అవకాశాలు ఉండాలి. దళిత తేజం– తెలుగుదేశం కార్యక్రమం ద్వారా దళితుల్ని ఆదుకోవాలి.

అధ్యక్షా, ఈక్వాలిటీ అంటే ఈక్వల్ ఆపర్చునిటీ ఇవ్వాలి. ఇన్‌కమ్ ఈక్వాలిటీ, ఆపర్చ్యునిటీలో ఈక్వాలిటీ, పవర్ ఈక్వాలిటీ ఇవ్వాలనేది ముఖ్యమంత్రిగారి లక్ష్యం. అందువల్ల సమాజంలో అన్ని వర్గాల ప్రజలు, మైనార్టీలు, దళితులు, బలహీన వర్గాలు పెళ్లిళ్లు చేసుకుంటుంటే, సంక్షేమం క్రింద పేద ప్రజలందరికీ, అన్ని వర్గాల ప్రజలకు, ఎస్సీలు, బీసీలు, దళితులు, గిరిజనులు అందరికీ నిధులు ఇస్తున్నారు.

హెల్త్ విషయానికి వస్తే, ముఖ్యమంత్రిగారు అనేక హెల్త్ కార్యక్రమాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విరాళంగా ఎంతో వితరణ శుద్ధితో ఇస్తున్నారు. హెల్త్ ద్వారా అనేక హాస్పిటల్స్ ఇంప్రూవ్ చేస్తున్నారు. మైనార్టీల కోసం ప్రత్యేక కార్యక్రమాలు తీసుకుని వాళ్లను ఆదుకునే విధంగా ముఖ్యమంత్రిగారు చేస్తున్నారు. అందువల్ల రాష్ట్రంలో రైతాంగాన్ని, పేదల్ని, దళితుల్ని, మైనార్టీలను, బలహీల వర్గాలను, మహిళలను ఈవిధంగా అన్ని వర్గాల ప్రజల్ని ఆదుకోవడానికి ముఖ్యమంత్రిగారు ముందుకు వెళుతుంటే కేంద్రప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో చూడడమనేది రాష్ట్రానికి, దేశానికి మంచిది కాదు. దేశభక్తి ఉన్న ముఖ్యమంత్రిగారు ఒకే విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్రాన్ని ఆదుకుంటే మీరు దేశాన్ని ఆదుకున్నట్లే. రాష్ట్రాన్ని ఆదుకుంటే మీరు దేశభక్తిని బాగా పెంపొందించుకున్నట్లే. ఒక రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తే, దేశం బాగుపడుతుందా? రాష్ట్రం అంటే దేశంలో ఒక భాగం. అందువల్ల దేశభక్తి అంటే చంద్రబాబు నాయుడు గారు లాగా చేయాలి. వారి నుండి ఐడియాలు తీసుకోండి. ఆ ఇన్‌క్లూజివ్‌నెస్ నేర్చుకోండి. ఈ రాష్ట్రంలోని 13 జిల్లాలను ఏవిధంగా అభివృద్ధి చేయాలి, ఈ రాష్ట్రాన్ని ఏవిధంగా అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన రాష్ట్రంగా చేయాలి, ప్రపంచంలోనే ఒక గొప్ప రాష్ట్రంగా తయారుచేయాలి. ఐదుకోట్ల మంది ప్రజలను, విద్యార్థులను ఆదుకోవాలి. నిరుద్యోగులను ఆదుకోవాలి. భవిష్యత్తులో ఒక **aspiring society** ని, ఒక గొప్ప స్వర్ణాంధ్రప్రదేశ్‌ని, ఒక మంచి ఆంధ్రప్రదేశ్‌ని, ఒక గ్రీన్ స్టేట్‌ని నిర్మించాలని, రైతుల్ని ఆదుకోవాలని కలలు కంటున్న ముఖ్యమంత్రిగారికి అండదండలు ఇవ్వాలి. లేకపోతే ఐదు కోట్ల మంది ప్రజల ఉసురు తగులుతుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేయడానికి అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్:** అధ్యక్షా, గవర్నర్‌గారి ప్రసంగానికి సభ్యులు శ్రీ డొక్కా మాణిక్య వర ప్రసాద్ గారు ప్రవేశపెట్టిన తీర్మానానికి నేను మద్దతు పలుకుతూ, ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి మూడున్నర సంవత్సరాలు అయిన తరువాత పరిపాలన పరంగా జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు, దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఈ రాష్ట్రం అగ్రగామిగా ముందుకు పోతోంది. దీనికి కారణం ఒకటే, సమర్థుడైన, పరిపాలనా దక్షత కలిగిన, భవిష్యత్తు

కార్యాచరణ ప్రణాళికను దూరదృష్టితో ఆలోచించి దానిని నిర్దుష్టంగా అమలు చేసుకుంటూ ముందుకు సాగడం వల్ల ఇన్ని ఫలితాలు రాష్ట్రంలో వస్తున్నాయని ఈరోజు ప్రజలు గమనిస్తున్నారు. విభజన చట్టం వచ్చిన తరువాత జనాభా ఎక్కువ, ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ, అదేరకంగా అప్పుల భారం కూడా ఎక్కువైన ఈ నవ్యాంధ్రప్రదేశ్‌కి, రాష్ట్రాన్ని విడగొట్టిన తరువాత ఏదైతే హామీలు, విభజన చట్టంలో పొందుపరచారో వాటిని నెరవేర్చకపోవడం అనేది బాధాకర విషయంగా వర్ణించక తప్పదు. ఎందుకంటే ఈ రాష్ట్రం అన్ని రంగాలలో అగ్రగామిగా ముందుకు సాగుతున్న తరుణంలో ఎంత చూసుకున్నా కూడా, రాజధాని లేకపోవడం, అదేరకంగా పరిశ్రమలు లేకపోవడం, వ్యవసాయం మీద ఎక్కువగా ఆధారపడిన రాష్ట్రం కావడం వల్ల వాణిజ్య పరంగా కూడా మనకు రావలసిన ఆదాయం సరిగ్గా రాకపోవడం, సుమారుగా 60, 70వేలకోట్ల రూపాయల ఆదాయం వచ్చే హైదరాబాదు లాంటి రాజధాని మనకు లేకపోవడం వలన మనకు ఇబ్బందులు ఉన్నాయనే విషయం, దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే మన తలసరి ఆదాయం ఇంకా రూ.35,000లు తక్కువగా ఉన్నదనే విషయం ఈ దిక్సూచి ద్వారా మనకు తెలుస్తుంది.

మ. 12.20

అధ్యక్షా, మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి సమర్థతతో మనం ముందుకు సాగుతున్న ఈ తరుణంలో రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచిన అంశాలు ఏవైతే ఉన్నాయో వాటికి సంబంధించి చూసినట్లయితే అవి – ప్రత్యేక హోదా, ఆర్థిక లోటు భర్తీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రైల్వే జోన్ ఏర్పాటు, గ్రీన్ ఫీల్డ్ క్రూడాయిల్ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు గానీ, రాజధాని అమరావతికి ఆర్థిక సహాయం మరియు జాతీయ సంస్థల ఏర్పాటే కాకుండా, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీలు ప్లాంటు, విజయవాడ–విశాఖపట్టణం మెట్రో రైలు ప్రాజెక్టు మొదలైనవన్నీ కూడా చట్టంలో ఉన్న అంశాలే. ఇప్పటికి మన రాష్ట్రం క్రొత్తగా ఏర్పడింది కాదు. ఆరు మాసాలైంది అని తొందరపడి మాట్లాడడం కాదు. ఇప్పటికి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతోంది. ఒక సంవత్సరం ఆగినా, ఆలస్యం అయినా పరవాలేదు అనుకుంటే కాదు. ఇప్పటికి మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. నాలుగవ సంవత్సరం కూడా గడిచిపోతోంది. ఈ నాలుగు సంవత్సరాలలో చట్టంలో పొందుపరచిన అంశాలు మరియు పార్లమెంటులోని ఉభయ సభలలో చర్చించి చట్టంలో పొందుపరచిన అంశాలను ఈనాడు అమలు చేయకపోవడం అనేది ఒక దారుణమైన అంశంగా నేను భావిస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు ఈ సభలో మనం మాట్లాడుకోవడం కాదు గానీ, యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం ఒక బాధాతప్తహృదయంతోను, అదే దృక్పథంతో ఉన్నారు. కాబట్టి, ఈ విషయంలో కేంద్రప్రభుత్వం ఇప్పటికీ దృష్టి సారించడం లేదు. ఇప్పటికీ ఎం.పీ.లు పార్లమెంటులో తమ గళం విప్పి న్యాయం చేయండని ఉభయ పార్లమెంట్లలో మాట్లాడుతున్నా, నిరసనలు సాగిస్తున్నా కూడా కేంద్ర ప్రభుత్వం ఉలకకుండా, పలకకుండా ఉండడం ఇది భావ్యమైన విషయం కాదని ఈ సందర్భంగా తమ ద్వారా సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ఇది ఈనాడు మేము క్రొత్తగాను, అదనంగాను అడగడం లేదు. ఇక్కడ నుంచి వస్తున్న ఆదాయంలో అన్ని రాష్ట్రాలకు ఇస్తున్నట్లుగానే మాకు కూడా

ఇస్తున్నారు. అందరితోపాటుగా మాకు కూడా సహకారం చేస్తున్నారు. కానీ, చట్టంలో పొందుపరచిన అంశాలను కేంద్రప్రభుత్వం తీర్చడంలో ఎందుకు ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నదో ఇక్కడ ఎవరికీ అర్థం కాని అంశంగా ఈ సందర్భంగా తమ ద్వారా మనవిచేస్తున్నాను.

(గౌరవ డెప్యూటీ చైర్మన్ అధ్యక్షస్థానం వహించారు)

అధ్యక్షా, ఈనాడు గవర్నరు గారి ప్రసంగంలో ఈ అంశాలు ప్రస్ఫుటంగా చెప్పడం జరిగింది. రాష్ట్ర ప్రగతిని పూర్తిగా అద్దంలో చూపించినట్లుగా ఆయన చక్కగా, వివరంగా తన ప్రసంగంలో చెప్పారు. ఈనాడు సంక్షోభంలో కూడా అభివృద్ధిని సాధించుకోవాలనే చాకచక్యం మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారికి ఉన్నటువంటి అర్హతలలో ఒకటి. ఆయన సంక్షోభంలోనూ రాష్ట్రం విడిపోయినప్పుడు జీరో స్థాయిలో ఉన్న మన రాష్ట్రాన్ని అభివృద్ధి పంథాలో పైకి తీసుకురావడానికి ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా మనమందరం అభినందించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అందుకే ఈ రాష్ట్రం విడిపోయిన తరువాత నవ నిర్మాణ దీక్ష అనే కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలి. ఎందుకంటే మన రాష్ట్రాన్ని అనైతికంగా, అన్యాయంగా విభజించి కట్టుబట్టలతో మనల్ని వదలివేశారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత ప్రజలందరి మీద ఉంది అనే విధంగా ప్రజలందరినీ సమాయత్తం చేయడానికి ప్రతి సంవత్సరం 'నవ్యాంధ్ర నవ నిర్మాణ దీక్ష' అనే కార్యక్రమాన్ని చేపట్టి ఆ రకంగా ప్రజలను కూడా ఈ అభివృద్ధిలో భాగస్వాములను చేసే రకంగాను, ప్రజా భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించే రకంగా మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్ర బాబు నాయుడుగారు చేస్తున్న కృషిని కూడా ఈ సందర్భంగా ఉటంకించవలసిన అవసరం ఉంది.

ఈనాడు 7 మిషన్లు, 5 గ్రిడ్లు, 5 క్యాంపైన్ల ద్వారా మన లక్ష్యాన్ని సాధించుకునేందుకు రాష్ట్ర యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తూ, ప్రజలను ఉత్తేజపరుస్తూ, వారిని కూడా భాగస్వాములను చేస్తున్నారు. ఈనాడు మన రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం మన ముఖ్యమంత్రి గారు దృష్టి సారిస్తున్నారనే విషయాన్ని ఈ సందర్భంగా అందరూ గమనించవలసిన అవసరం ఎంతైనా ఉందని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ముఖ్యంగా భావనపాడు పోర్టు గానీ, దక్షిణ కొరియా కియా మోటార్స్, బిఇఎల్, అగ్రి-ప్రాసెసింగ్ పార్కులు, టూరిజం ప్రాజెక్టులు, అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ వే గానీ, విమానాశ్రయాల అభివృద్ధి, కేంద్ర విశ్వవిద్యాలయం, ఇంధన విశ్వవిద్యాలయం, జాతీయ కస్టమ్స్ అకాడమీ, ఎక్సైజ్, నార్కోటిక్స్ మొదలైన ప్రధానమైన ప్రాజెక్టులన్నింటిని కూడా వెనుకబడిన ప్రాంతాలలో పెట్టి అక్కడి ప్రజలకు జీవనోపాధి కల్పించడానికి ఈనాడు మన ముఖ్యమంత్రిగారు చేస్తున్న కృషిని కూడా ఈ సందర్భంగా అందరూ అర్థం చేసుకోవలసిన అవసరం ఉందని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

అలాగే, 13వ షెడ్యూలులోని 11 కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. వాటిల్లో ఐఐటి, ఐఐఎం, ఐఐఎస్ఇఆర్, కేంద్రీయ విశ్వవిద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయం, ఐఐఐటి మరియు

పెట్రోలియం విశ్వవిద్యాలయం మొదలైన వాటిని ఎక్కువగా రాయలసీమ, ఉత్తర కోస్తా జిల్లాలలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఈనాడు వాటికి స్థలాలను కూడా కేటాయించింది. సుమారుగా రూ.11,000కోట్లు విలువ చేసే స్థలాలు కేటాయించి, వాటి చుట్టూ ప్రహరీ గోడను నిర్మించడం జరిగింది. అయితే, మన బడ్జెట్‌లో ఎంతో ఆశగా ప్రతి ఒక్కరు కూడా టీ.వీ.లకు అతుక్కుపోయి కేంద్ర బడ్జెట్‌లో మన ఆంధ్రప్రదేశ్‌కు ఏమేమి ఇచ్చారో చూస్తే – ఆ సంస్థకు రూ.10కోట్లు, ఈ సంస్థకు రూ.50కోట్లు, ఇంకొక దానికి రూ.11కోట్లు, దీనికి ఒక రూ.25కోట్లు అన్నట్లుగా దాదాపు రూ.250కోట్లు ముష్టిగా ఈ సంస్థలకు కేంద్రం ఇచ్చింది. ఈనాడు వేలాది కోట్ల రూపాయలు స్వంత భవనాలు నిర్మించుకుని అక్కడ ఈ జాతీయ సంస్థలలో కార్యకలాపాలను చేయడానికి అవసరమైన నిధులను ఇవ్వడంలో ఈనాడు కేంద్ర ప్రభుత్వం విఫలమైనదనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా మనమందరం గమనించవలసిన అవసరం ఉందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

గత మూడు సంవత్సరాలుగా వరుసగా రెండంకెల అభివృద్ధిని సాధించాము. ప్రతి సంవత్సరం సగటున 11.31శాతం ఈనాడు అభివృద్ధిని సాధించిన విషయాన్ని కూడా అందరు గుర్తించాలి. జాతీయ స్థాయిలో ఈనాడు అభివృద్ధి రేటు 6.97 శాతం ఉంటే, మన రాష్ట్రంలో 11.31శాతం అభివృద్ధిని సాధించిన విషయాన్ని మనం గమనించాలి.

అలాగే, ఈనాడు వర్షపాతం విషయంలో కూడా గతంలో 30 శాతం వర్షపాతం తక్కువగా ఉంది. ఈ ఏడాది 13.4 శాతం వర్షపాతం తక్కువగా పడింది. అయినా కూడా మన ముఖ్యమంత్రిగారు ఈ వర్షాన్ని, ప్రతి వర్షపు చుక్కని కూడా ఒడిసి పట్టి దానిని భూగర్భజలాలుగా మార్చుకుని ఆ రకంగా నీరు–ప్రగతి, జల సంరక్షణ ఉద్యమాలను చేపట్టి ఈనాడు వర్షాలు పడకపోయినా, వర్షాభావం ఉన్నప్పటికీ కూడా ఈనాడు వ్యవసాయంలో అనుకున్న ప్రగతిని సాధించగలిగామనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా అందరూ గుర్తించవలసిన అవసరం ఉంది.

ఈనాడు వ్యవసాయ ప్రగతిని చూసినట్లయితే, అన్ని అనుబంధ రంగాలను కలుపుకుని 25శాతం అభివృద్ధి రేటును సాధించాము. వ్యవసాయంలో 17.44శాతం అభివృద్ధిని సాధిస్తే, ఆక్వా రంగంలో 42.75 శాతం అభివృద్ధిని సాధిస్తాము. పశుగణాభివృద్ధి రంగంలో 13.68 శాతం మరియు ఉద్యానవన రంగంలో 18.62 శాతాన్ని సాధించాము. ఆ రకంగా వ్యవసాయ రంగంలో అగ్రగామిగా ఉన్న మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతూ, ఈ రంగానికి అన్ని రకాలుగా చేయూతనందిస్తూ, ఆ రకంగా వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి ఈ దేశంలోనే అగ్రగామిగా ఉండే రకంగా ఈనాడు ముందుకు సాగుతున్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా గమనించవలసిన అవసరం ఉంది. గతంలో వ్యవసాయదారులకు పొలాలలో పిచికారీ కొట్టుకోవడానికి చిన్న చిన్న కిట్లు లాంటివి ఇచ్చేవారు. కానీ, ఈనాడు వ్యవసాయ యాంత్రీకరణం పేరుతో రూ.1500కోట్ల విలువ చేసే 5,01,574 యంత్రాలను, ఇతర పరికరాలను గత నాలుగు నెలల్లోనే రైతులకు ఇచ్చారంటే ఏ రకంగా రైతుల ఎడల ఈనాటి ప్రభుత్వం పూర్తిగా చొరవ చూపెడుతున్నదనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా గౌరవ సభ్యులు గమనించాలని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈనాడు ప్రతి ప్రాంతంలో చూసినట్లయితే, దాదాపుగా రెండున్నర లక్షల రూపాయల సబ్సిడీతో ట్రాక్టర్లను రైతులకు ఇచ్చే కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతోంది. ఆ రకంగా 12,670 ట్రాక్టర్లను రైతులకు ఇవ్వాలనే లక్ష్యంగా పెట్టుకుంటే అందులో ఇప్పటివరకు 7,690 ట్రాక్టర్లను రైతులకు అందజేయడం జరిగింది. ఆ విధంగా రూ.121కోట్లను ఈ ప్రభుత్వం రైతాంగానికి సబ్సిడీగా ఇచ్చిందంటే అతిశయోక్తి కాదు. ఈనాడు వ్యవసాయ యాంత్రీకరణలో ప్రభుత్వం ఏ రకంగా చొరవ చూపెడుతోందన్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా మనమందరం గమనించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అంతేగాకుండా, ఈనాడు రైతులకు ఋణమాఫీ విషయంలో కూడా ఇప్పుడిప్పుడు తెలంగాణ ప్రభుత్వం వారు కూడా రైతుల ఋణమాఫీని ప్రకటించారు. అయితే, అవి అక్కడ సక్రమంగా అమలు జరిగే పరిస్థితులు లేవు. లక్ష రూపాయల కంటే ఎక్కువ రైతు ఋణ మాఫీ చేయలేదు. ఈ మధ్య కాలంలో రాజస్థాన్‌లో కూడా రైతు ఋణ మాఫీని కేవలం రూ.50,000లకే ప్రకటించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సభ్యులందరూ గమనించాలి. మన రాష్ట్రంలో ఒక్కో రైతుకు రూ.1,50,000ల వరకు దాదాపు రూ.24,000కోట్లను ఋణ మాఫీ చేసిన ఘనత మన తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్న విషయాన్ని ఈ సందర్భంగా, గర్వంగా మీ ముందు ఉంచుతున్నాను. ఇప్పటి వరకు రూ.13,976కోట్లు రైతుల ఖజానాలో ప్రభుత్వం జమ చేయడం జరిగింది. ఇవి మాటలు కావు, వాస్తవ రూపంలో చేసి చూపెడుతున్నది మన ప్రభుత్వం. ఈనాడు రూ.16,000కోట్లు లోటు బడ్జెటు ఉన్నప్పటికీ కూడా కేంద్రం ఈ లోటును భర్తీ చేయడంలో మీనమేషాలు లెక్కపెడుతోంది కానీ, పూర్తిగా సహకరించే పరిస్థితి లేనప్పటికీ కూడా ఈ ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఈ వాగ్దానాన్ని నెరవేర్చాలని, మాట నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రిగారు రూ.13,976కోట్లను ఇప్పటికే దాదాపుగా 80 లక్షల మంది రైతులకు అందజేసిన వైనాన్ని కూడా ఈ సందర్భంలో గమనించాలని తమ ద్వారా గౌరవ సభ్యులను కోరుతున్నాను.

అధ్యక్షా, గతంలో మనం ఈ ఉద్యాన రైతులకు ఋణ మాఫీ చేస్తామని చెప్పలేదు. అయినప్పటికీ కూడా వాళ్ళు కోరారనే ఉద్దేశంతో దాదాపుగా 2,24,000 మందికి సుమారుగా రూ.384కోట్లతో వారి ఋణాలను కూడా మాఫీ చేసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా మనం గమనిస్తే, ఈనాడు మనం రైతులను ఏరకంగా ఆదుకున్నామనే విషయం కూడా సుస్పష్టం అవుతుంది. అలాగే, మాట నిలబెట్టుకున్నారని మన ముఖ్యమంత్రి గారు చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోతారనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా సభ్యులందరూ గమనించవలసిన అవసరం ఉంది.

మ.12.30

అధ్యక్షా, ఈరోజు మనకు తడ నుండి ఇచ్ఛాపురం వరకూ సముద్రతీర ప్రాంతం ఉంది. అందువలన మనకు ఎక్కువగా రొయ్యలు, చేపలు ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఆక్వా కల్చర్, ఫిష్ కల్చర్ మీద ఎన్నడూ లేని విధంగా శ్రద్ధ వహించారు. గతంలో 2014-15లో రూ.22,707కోట్ల విలువ చేసే చేపలు ఉత్పత్తి చేస్తే, ప్రస్తుత సంవత్సరంలో

రూ.43,538కోట్ల విలువ చేసే చేపలు, రొయ్యలు ఉత్పత్తి చేసిన పరిస్థితిని గమనిస్తే ఏరకంగా చేపలు, రొయ్యల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందో అర్థం అవుతుంది. అదే రకంగా జలవనరుల విషయంలో నీరు దొరికితే గాని వ్యవసాయం సాగదు. వ్యవసాయానికి ప్రాధాన్యత ఉన్న ఈ రాష్ట్రంలో నీటి మీద దృష్టి సారించాలనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు గత మూడున్నర సంవత్సరాలుగా 29ప్రాజెక్టులను పూర్తి చేసే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నారు. అదే రకంగా నీరు–చెట్టు కార్యక్రమం విజయవంతం అవడంతో ఈరోజు 4.5మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగినాయి. దీని మూలంగా మనం 7 గంటలు ఉచిత కరెంటు ఇసున్నాము. దాని మూలంగా సుమారు రూ.500కోట్లు కరెంటు ఛార్జీలు తగ్గే పరిస్థితి వచ్చిందనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా మనం గమనించవలసిన అవసరం ఉంది. గత మూడేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టుల మీద రూ.48,470కోట్ల ఖర్చు చేశాం. మొత్తం 13.61లక్షల ఎకరాల ఆయకట్టును కల్పించడమయిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అదే రకంగా ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పిఎంకెఎస్‌వై) వాటర్ షెడ్స్ ద్వారా కూడా రూ.1051కోట్లు ఖర్చు చేసి దాదాపు 9.11లక్షల హెక్టార్ల విస్తీర్ణానికి నీటిని అందించి 1.51లక్షల మంది రైతులకు లబ్ది చేకూర్చే కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని కూడా గమనించాలి. పంట సంజీవిని క్రింద 4.85లక్షల సాగు కుంటలను పూర్తి చేశాము. మరో1.22లక్షల పంట కుంటల నిర్మాణం పురోగతిలో ఉన్నాయి. వర్షపునీరు వృథాగా పోకుండా ఎక్కడ నీటిని అక్కడే ఉండేటట్లు, నీటి బొట్టును ఒడిసి పట్టుకుని ఆ నీటి జలాలను వ్యవసాయానికి ఉపయోగించుకునే పథకం ఈనాడు దిగ్విజయంగా నడుస్తుందనే విషయం కూడా గమనించాలి.

అధ్యక్షా, సంక్షేమం, అభివృద్ధి పైన మన గౌరవ ముఖ్యమంత్రి గారు ఏవిధంగా దృష్టి పెడుతున్నారో, అదే విధంగా రెండూ సమానంగా ఉండే విధంగా పేద వారికి ఏదైతే అవసరం ఉంటుందో వారికి అన్నీ సమకూర్చే విధంగా సంక్షేమ కార్యక్రమాలు ఉండడంగా మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి పరిపాలన ఉంది. సుమారుగా గత బడ్జెట్‌లో రూ.28,000కోట్లు పైచిలుక సంక్షేమానికి ఖర్చు పెట్టిన వైనాన్ని కూడా ఈ సందర్భంగా గమనించాలి. పేదవారి పట్ల ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల ఎడల మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి ఉన్న ప్రేమాభిమానాన్ని తార్కాణంగా చెప్పకోవచ్చు. ఈనాడు కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలను బీసీలలో చేరుస్తామని చెప్పడం జరిగింది. ఈ మధ్యనే అసెంబ్లీలో విద్య, ఉపాధిలో వారికి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానించాము. అలాగే వాల్మీకి, బోయ కులాలను కూడా ఎస్టీలో చేర్చాలని కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేశాం. దాని మీద కేంద్ర ప్రభుత్వం నుండి సరైన స్పందన లేనట్లు కనిపిస్తుంది. ఇక్కడ ఉన్న కులాల వారి ఇబ్బందులు, వారి జీవన స్థితిగతులు వారి వెనుకబాటుతనాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. 50శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదు అనే ఒక స్థిరమైన అభిప్రాయంతో ఉండి, ఈనాడు దానిని తిప్పి కొట్టే ఆలోచనతో కేంద్రప్రభుత్వం ఉండడం సరియైనది కాదు. ఎన్నో సందర్భాలలో రాజ్యాంగాన్ని మనం సవరించుకున్నాం. ఈనాడు 85శాతం పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఉన్నప్పుడు 50శాతం కంటే రిజర్వేషన్ ఎక్కువగా ఉండకూడదనే

మొండి వైఖరికి పోకుండా వారి సామాజిక పరిస్థితులను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ రిజర్వేషన్లను పెంచవలసిన అవసరం ఉంది. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు వారి స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని అన్నీ ఆలోచించి కమిటీ సిఫారసుల మేరకే పంపించారు తప్ప ఏదో ఆషామాషీగా పంపించిన పరిస్థితి కాదని కేంద్రప్రభుత్వం గమనించాలని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు విద్య విషయంలో చూస్తే స్కూల్స్‌లో పిల్లలు సరిగా చదువుకోలేరు, వారు రావడానికి, వెళ్లడానికి ఇబ్బందులు ఉంటాయి. తిండి లేకుండా ఉంటారు కాబట్టి రెసిడెన్షియల్ స్కూల్స్ ఉంటే వారు అందులో స్థిరంగా చదువుకుంటారనే ఉద్దేశంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం ఈ సంవత్సరం దాదాపు 3.3 లక్షల మంది విద్యార్థులు 3,373 హాస్టళ్లలో, 1,121 సంక్షేమ పాఠశాలల్లో, 1.7లక్షల మంది విద్యార్థులను చదివించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేవలం వారికి తినడానికి తిండి మాత్రమే కాకుండా ఉండడానికి కూడా అవకాశం కల్పిస్తూ వారు భవిష్యత్తులో కూలీలుగానో, చిన్ని వృత్తులు చేసుకునే వారి గానో కాకుండా వారు కూడా పై స్థాయికి వచ్చి వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలనే దూరదృష్టితో విద్య మీద దృష్టిసారిస్తున్న వైనాన్ని కూడా ఈ సందర్భంగా గమనించవలసిన అవసరం ఉంది.

అధ్యక్షా, ఇల్లు కట్టి చూడు పెళ్లి చేసి చూడు అని ఒక సామెత ఉంది. పేద వారిలో ఇల్లు కట్టుకునే పరిస్థితి ఉండదు. పెళ్లి చేసుకోవడానికి కూడా భారంగా ఉండే దుర్భర పరిస్థితులు ఉన్నాయి. అందువలన ఈనాడు మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు గిరిపుత్రిక అనే పథకంలో పెళ్లిచేసుకునే ఎస్టీ వధువులకు రూ.50,000, పేద మైనార్టీ వధువులకు దుల్హన్ పథకంలో రూ.40,000 మరియు ఎస్సీ వధువులకు రూ.35,000ల ప్రోత్సాహకంతో, బీసీ వధువులకు నూతన చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని చేర్చి పిల్లల పెళ్లిళ్ల సమయంలో ఇబ్బంది పడకుండా ఒక తోబుట్టువుగా మీకు అండగా ఉంటానని చెప్పి పేద వారి పెళ్లిళ్ల విషయంలో కూడా సహాయం చేస్తున్నారనే విషయాన్ని కూడా గమనించాలి.

అధ్యక్షా, దేశంలో ఎవరూ చేయలేని విధంగా అంతర్జాతీయ స్థాయిలో కడుతున్న రాజధాని అమరావతిలో 20 ఎకరాల స్థలంలో 125 అడుగుల ఎత్తైన డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఒక రకంగా చెప్పాలంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ పౌరులు ఏ రకంగా ఉండాలి వారికి ఉండే స్వేచ్ఛ ఏమిటి, విద్యావకాశాలు ఏమిటి, రాజకీయ అవకాశాలు ఏమిటని రాజ్యాంగంలో క్షుణ్ణంగా పొందుపరచిన డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌కు సరియైన, ఘనమైన నివాళి ఈనాడు మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో డా.బి.ఆర్.అంబేద్కర్ స్మృతి వనం పేరు మీద రూ.97కోట్ల వ్యయం చేయడం చాలా అభినందనీయమైన విషయమని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీల కోసం గతంలో రూ.29,000కోట్లు కేటాయించగా ఈనాడు కేవలం ఎస్టీల కోసం రూ.10వేల కోట్లు , అదే విధంగా బీసీల కోసం రూ.20,000కోట్లు ఇతోధికంగా కేటాయించారు. గతంలో సబ్‌ప్లాన్ నిధులను ఇతర కార్యక్రమాలకు కమీషన్ ఇచ్చే వాటికి ఉపయోగించేవారే కానీ, ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులను సరిగ్గా వినియోగించలేదు. కానీ ఈనాడు సబ్‌ప్లాన్ నిధుల్ని పూర్తిగా వినియోగించే పరిస్థితి ఉందనే విషయాన్ని కూడా గమనించాలని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, బీసీలలో అనేక ఉప కులాలు ఉన్నాయి. బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌లో నాయీ బ్రాహ్మణులు గానీ రజకులు గానీ ఎవరైతే ఉన్నారో వారి స్థితిగతులు చాలా దారుణంగా ఉన్నాయి. ఇంకా వారు అట్టడుగునే ఉన్నారు. ఇంకా వారు వారి కుల వృత్తులను నమ్ముకునే జీవితం గడుపుతున్నారు. అటువంటి వారికి సరియైన ఆర్థిక ప్రోత్సాహం ఇస్తే బాగుంటుందనే ఉద్దేశంతో వారికి రూ.315కోట్లు కేటాయించడం జరిగింది. కాపు కార్పొరేషన్‌కు రూ.2,100కోట్లు కేటాయించడం జరిగింది. అదే విధంగా అన్ని కులాల వారికి, చివరికి ఈబీసీలకు కూడా కొత్తగా రూ.260కోట్లతో ఆర్థిక సహాయాన్ని కల్పించే విధంగా ఈనాడు ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి వల్లనే అవుతుంది గానీ మరెవరి వల్లా కాదని కూడా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మైనారిటీల కోసం గతంలో 23 జిల్లాలు ఉన్న సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా రూ.200కోట్లు కేటాయించారు. ఈనాడు 13జిల్లాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో రూ.370కోట్లు, రెండవ సంవత్సరం రూ.710కోట్లు ఈ సంవత్సరం రూ.840కోట్లు కేటాయించారు. ఆ రకంగా ఇప్పటికి రూ. 2,300కోట్లు మైనారిటీల సంక్షేమం కోసం, వారి విద్యాభివృద్ధి కోసం ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం ఖర్చు పెట్టిన వైనాన్ని గమనించాలని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు హజ్ యాత్రకు వెళ్లే వారికి కేంద్రప్రభుత్వం సబ్సిడీ తొలగించింది. కానీ ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవ సంక్షేమం కోసం, జెరూసలెం వెళ్లే వారికి గతంలో రూ.20వేలు ఇస్తే ఈనాడు రాష్ట్రప్రభుత్వం రూ.40వేలు ఇస్తున్నది.

అధ్యక్షా, చంద్రన్న బీమా పథకం చాలా బ్రహ్మాండమైన పథకం. గతంలో ఇంటిలో సంపాదించే వ్యక్తి ఎవరైనా అకారణంగా మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి. ఆ పరిస్థితి నుండి ఆ కుటుంబాన్ని దూరం చేయడానికి చంద్రన్న బీమా పథకం పిఎంజెజెబివై పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. రాష్ట్రంలోని 2.46కోట్ల మందికి ఈ పథకం వర్తింప చేస్తుంది. ఈ పథకం ద్వారా ప్రమాదాల వలన సంభవించిన మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైతే రూ.5లక్షలు, సహజ మరణం జరిగితే రూ.2లక్షలు ఇచ్చే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తుంది. 2016-17లో చంద్రన్న బీమా పథకం కింద దాదాపు 79,960 కుటుంబాలకు రూ.590కోట్లు ఆర్థిక సహాయాన్ని అందించడమే కాకుండా చనిపోయిన కుటుంబంలో ఉన్న పిల్లల చదువు కోసం స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం కోసం అదనంగా ఈ పథకం క్రింద

రూ.202కోట్లు మంజూరు చేశారంటే ప్రభుత్వం ఏ విధంగా పేదలు గురించి ఆలోచిస్తుందో ఈ సందర్భంగా గమనించవలసి ఉందని తెలియజేస్తున్నాను.

మ.12.40

అధ్యక్షా, కేవలం చదువు, ఆర్థిక వికాసం, వారి వృత్తుల విషయంలోనే కాదు, ఈనాడు పండుగ సమయంలోనూ చంద్రన్న సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అని కానుకలు ఇస్తున్నారు.

యువత కోసం పరిశ్రమలు పెట్టాలి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణా కార్యక్రమానికి సంభంధించి 6 లక్షల మందికి శిక్షణ ఇచ్చే విధానాన్ని మనం గుర్తుచేసుకోవాలి. గతంలో హైదరాబాదు నగరాన్ని అభివృద్ధి చేసుకుని రాష్ట్రంలోని మిగతా జిల్లాలను వదిలేశాము. ఈరోజు అలా కాకుండా 13 జిల్లాల్లో ఎక్కడెక్కడ ఏ వనరులు ఉన్నాయో మానవ వనరులను, సహజ వనరులను, నదుపాయాలను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు నాయుడు గారు సమానంగా అభివృద్ధి సాధించే విధంగా విప్లవాత్మంగా ఎవరికీ అన్యాయం జరగకుండా, వారు వేరే ప్రాంతాలకు వలస వెళ్లకుండా వారి వారి ప్రాంతాల్లో విద్యా, ఉపాధి అవకాశాలు లభించేలా అనేక పరిశ్రమలు స్థాపిస్తున్నారు. అలా స్థాపించిన వాటిలో ఇసుజు మోటార్స్, పెప్సీ, మెర్సిడెజ్, వోక్స్‌వాగన్, బెర్జర్ పెయింట్స్, అరబిందో ఫార్మా, డా. రెడ్డీస్ లేబొరేటరీస్, సెల్కాన్, కాల్గేట్, పామోలివ్ వంటి కంపెనీలు ఉత్పత్తులు ప్రారంభించిన విషయాన్ని మనం గమనించాలి. విశాఖపట్నంలో సంయుక్తంగా నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో గతంలో రూ.13,00,054కోట్ల రూపాయల ఒప్పందాలు కుదుర్చుకొని, 1946 భారీ మరియు మెగా ప్రాజెక్టులు రాబోతున్న విషయాన్నీ మనం గుర్తు చేసుకోవాలి. ఇటీవల 2018, భాగస్వామ్య సదస్సు ముగింపులో రూ.4.39లక్షల కోట్ల సంభావ్య పెట్టుబడులతో మరియు 11 లక్షల మందికి సంభావ్య ఉపాధికల్పనతో మరొక 704 ఎంఓయూలు జరిగాయంటే, ఈనాడు ఏవిధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారనే విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి. దక్షణ కొరియాకు చెందిన కియా మోటార్సు, గ్రీన్ ప్లై, ఏషియన్ పెయింట్స్, ఆర్ఐఎన్ఎల్ కంపెనీలు త్వరలో ఉత్పత్తులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఆ రకంగా విశాఖపట్నంలో గానీ, చిత్తూరు జిల్లా తిరుపతిలో ఎలక్ట్రానిక్ హబ్‌గా శ్రీ సిటిని ఏర్పాటు చేయడం గానీ, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జౌళి ప్రాసెసింగ్ యూనిట్స్‌ను ఏర్పాటు చేసే విషయంలో ప్రభుత్వం చొరవ చూపుతున్న విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి.

ఈనాడు ఆరోగ్య విషయంలో ప్రభుత్వం ఎంతో ఉదారంగా ఉండి, **CMRF** క్రింద లక్ష రూపాయల నుండి 20 లక్షల వరకూ అనేక మందికి ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా అనేక మందికి వైద్యం అందుతుంది. అదే విధంగా జిల్లా కేంద్రాల్లో ఒక కోటి నలభై ఆరు లక్షల రూపాయలతో ల్యాబ్ టెస్టులు, రూ.7.2లక్షల విలువ చేసే ఉచిత టెలి రేడియాలజీ సేవలను అందిస్తున్నారు. దాదాపు 2.4 లక్షల మంది తల్లులు "తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్" ను వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా గర్భిణీ బాలింతల కోసం గర్భం దాల్చిన నాటి నుండి

మరలా బిడ్డ పుట్టేంత వరకూ 2.92 లక్షల మంది గర్భిణీలకు మరియు బాలింతలకు 104 ప్రాజెక్టులో భాగంగా "అన్న అమృత హస్తం" కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది.

గతంలో మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ విషయంలో కొంత వరకు వెనుక బడి ఉన్నాం. ఈ రెండు సంవత్సరాలుగా పేదవాడికి పక్కా ఇళ్ల నిర్మాణ విషయంలో రూ.50,000కోట్ల వ్యయంతో 19 లక్షల గృహాలను నిర్మించాలని ఉంది. 2018, జూన్ నాటికి 2.5 లక్షల గ్రామీణ గృహాలను 2019, జనవరి నాటికి 5.10 లక్షల గ్రామీణ గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడమయింది. గతంలో ఇళ్ల నిర్మాణం కోసం రూ.70 వేలు మాత్రమే ఆ సొమ్ముతో ఇల్లు ఇచ్చేవారు. కానీ ఇళ్లు కట్టుకునే పరిస్థితి లేదు. ఈనాడు ప్రభుత్వం ఉదారంగా రూ.2.5లక్షలు ఇస్తున్నది. అదే పట్టణ ప్రాంతాల్లో రూ.3.5లక్షలు ఇస్తుంది, మరలా కట్టవలసిన అవసరం లేకుండా పట్టణ ప్రాంతాల్లో **G+4**తో 8 లక్షల ఇళ్లను కల్పిస్తున్నది.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ద్వారా బహిరంగ మల విసర్జన నిర్మూలన కార్యక్రమంలో కూడా మనం పూర్తిగా సాఫల్యం సాధించాము. ఇప్పటి వరకు 12,854 గ్రామ పంచాయతీలకుగాను 6311 గ్రామ పంచాయతీలను ఓడిఎఫ్‌గా ప్రకటించడమయింది. జిల్లా వారీగా చూసుకుంటే పశ్చిమ గోదావరి, నెల్లూరు, కృష్ణా, తూర్పు గోదావరి, ప్రకాశం, గుంటూరు ఈ ఆరు జిల్లాలను ఓడిఎఫ్ జిల్లాలుగా ప్రకటించడమయింది. ఈ రోజు గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటికి ఇబ్బందిగా ఉన్న పరిస్థితి ఉంది. అటువంటి త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రతి చోటా సురక్షితమైన త్రాగునీరు అందే విధంగా నారా లోకేశ్ గారు చర్యలు చేపట్టడమే కాకుండా, గతంలో గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీని లేదు. కానీ ఈనాడు సుమారుగా రెండు, మూడు వేల గ్రామాల్లో భూగర్భ డ్రైనేజీలను నిర్మించింది. అందుకని రాష్ట్రప్రభుత్వం పని తీరు మీద జాతీయ, అంతర్జాతీయ స్థాయితో చాలా అవార్డులు లభించాయి. ఈ మూడున్నర సంవత్సరాల్లో 30 కి పైగా జాతీయ అవార్డులు వచ్చాయి. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయి అంటే నారా చంద్రబాబు నాయుడు గారి పనితనం, సమర్థత, దూరదృష్టి ఏ రకంగా ఉందో మనం గుర్తు చేసుకుంటూ, అలాగే చంద్రబాబు నాయుడు గారి లాంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి దొరకడం రాష్ట్ర ప్రజల అదృష్టం అని గవర్నర్ చెప్పిన మాటలను మరొకసారి గుర్తు చేస్తూ, నా ఉపన్యాసాన్ని ముగిస్తున్నాను.

మ.12.50

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం**: అధ్యక్షా, గవర్నర్ గారు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం దాదాపు 60 శాతం ఎక్కువ పరిమాణంలో ఉండే ప్రసంగాన్ని చేశారు. ఈ సంవత్సరంలో 8,400లకు పైన పదాలు ఉంటే, గత సంవత్సరం 5,200 పదాలు ఉన్నాయి. ఎక్కువ చెప్పకోవలసి ఉన్నది కాబట్టి, చెప్పుకునేది కూడా ఉంది కాబట్టి, వారు ఎక్కువ వాల్యూమ్ మాట్లాడి ఉంటారనే దాంట్లో నాకైతే అభ్యంతరమేమీ లేదు. ఏదేమైనా గవర్నర్ ప్రసంగం మీద ఈసారి చర్చంతా ప్రత్యేక హోదా మీద చర్చలాగా మారిపోతుంది. ప్రత్యేక హోదాకి కొంచెం ప్రత్యేక వాటాను

కేటాయించి, మిగతా విషయాల్లో కూడా మాట్లాడుకునే విధంగా ఈ చర్చ జరిగితే బాగుంటుందని నాకు అనిపిస్తుంది. ఇప్పుడు హోదాకు సంబంధించినంత వరకు మేము ఏమి అభిప్రాయపడుతున్నామంటే ఇది మన చేజారి పోయి, ప్రజలలోకి వెళ్లి పోయింది. ప్రజలకు జవాబు చెప్పకోవాల్సిన స్థితిలోకి ముఖ్యమైన రాజకీయ పార్టీలు వెళ్లిపోయాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిందా లేదా? రాష్ట్ర ప్రభుత్వం తెచ్చుకోగలిందా, లేదా? ప్రతిపక్షం ఒత్తిడి చేయగలిగిందా, లేదా? ఈ అంశాలన్నింటిని మొత్తంగా గమనించినట్లయితే ఒకటి మాత్రం వాస్తవం. తెలుగు ప్రజలు దగా పడ్డారు. ఆఖరుకు దక్షిణాదిలో రూ.35,000 తలసరి ఆదాయం తక్కువగా ఉండే రాష్ట్రాల జాబితాలోకి మన రాష్ట్రం వెళ్లి పోయింది. దీనికి కారణం రాష్ట్ర విభజన, విభజనానంతర పరిణామాలు తప్ప మరొకటి కాదు. దీనిపై నేను ఏమి అభిప్రాయపడుతున్నానంటే ఇది ఒక రాజకీయ వైఫల్యం. ప్రజల వైపు నుంచి చూచినట్లయితే ఇది డెడ్ ఫెయిల్యూర్ రాజకీయ పార్టీలకు సంబంధించినంత వరకూ. అందువల్ల ఈ అంశాన్ని ప్రజలకే వదిలేసి, ప్రజల మధ్యలోకే వెళ్లి అక్కడున్న మేధావులతో మాట్లాడుతారో, లేదా సంఘాలతో మాట్లాడుతారో, లేకపోతే సాధారణ జనంతోనే మాట్లాడుతారో, ఈ ఆరేడు నెలలు మాట్లాడి వాళ్ల అభిప్రాయాలకు అనుగుణంగా మనం వ్యవహరించడమే తప్ప, వాళ్ల చేత ఏ రకమైన అక్షింతలు వేయించుకోవాలో, అవి వేయించుకోవడమే తప్ప దానికి వేరే మార్గం ఉందని నేను అభిప్రాయపడలేదు.

అధ్యక్షా, ఇందులో ఒక విషయం ఉంది. ఉదాహరణకు మా నెల్లూరు జిల్లా దుగరాజపట్నం పోర్టు ఎందుకు రాలేదంటే సాంకేతిక కారణాలు కొన్ని ఉన్నాయి. అవి నేను కాదనను. కానీ ఇందులో పార్టీలు, ప్రభుత్వాల ప్రమేయం కన్నా, ఒక ప్రైవేటు పోర్టు ప్రమేయం ఎక్కువగా ఉందని నెల్లూరు జిల్లాలో ప్రజలందరూ అనుకుంటున్న విషయం. అలాగే ఎయిమ్స్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో కార్పోరేట్ వైద్య సంస్థలు రాజధానికి ఎయిమ్స్ రావడాన్ని అంత ఇష్ట పూర్వకంగా అంగీకరిచడంలేదనే మాట వినిపిస్తోంది. మరి రాజకీయ పార్టీలు వాటికి కూడా లొంగిపోవలసిన అవసరం ఉందా అనే ప్రశ్న ఉత్పన్నం కాకపోదు. ఇంకా కొంచెం దూరం వెళ్లిపోయింది. ఎంత దూరం వెళ్లిపోయిందంటే, ఉత్తరాది దక్షిణాది మధ్య గీత గీసినట్లు తేడా వచ్చిన విధంగా మారిపోయింది. ఒక పార్లమెంటు సభ్యులు ఈ మధ్య చాలా స్పష్టంగానే తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇలాగే ఉన్నట్లయితే రాష్ట్రానికి ఉన్న అధికారాలు జీఎస్టీతో పోగొట్టారు. ఉత్తరాదిలో సంపద ఎక్కువ, జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువ, మీరు ఇచ్చేది రాష్ట్రాలకు చాలా తక్కువగా ఉంది, ఆఖరికి ఏదో ఒక రోజు ఉత్తరాది, దక్షిణాది దేశాలుగా విడిపోయినా ఎవరూ బాధపడాల్సిన అవసరం లేనట్లుగా ఆయన మాట్లాడారు. ఇక చాలా విషయాలు కూడా వచ్చాయి. మాది భార్యాభర్తల సంబంధం అన్నారు. ఎవరు భార్యో, ఎవరు భర్తో పాపం భార్య అంటే బాధపడిన వాళ్లే భార్య అనుకుంటే, 29సార్లు పోయి అడిగారు. అయ్యా దయ తలుచు, పాపం పిల్లల కోసమన్నా చూడవయ్యా అని అడిగారు. కానీ, ఏం జరగలేదని చెప్పి ఇప్పుడు జనంలోకి వెళితే ఖచ్చితంగా ప్రజల దగ్గర ఆ సానుభూతి లభిస్తుంది. దానిని ఎవరూ కాదనడానికి వీలు లేదు. మరి ఈ పరిస్థితులు వస్తున్నప్పుడు, దీని మీద లోపలికి నేను పోదలుచుకోలేదు. అందరి బుక్‌లెట్‌లు నా దగ్గర ఉన్నాయి. నేను ఈ మధ్య

రెండు, మూడు చర్చా కార్యక్రమాలకు హాజరయ్యాను. అక్కడ పాల్గొన్నవారు ఎవరి వాదన వారు తెలియచేస్తున్నారు తప్ప. ఇందులో ప్రధానమైన భాధాకరమైన విషయం ఏమిటంటే రాజకీయ ఎత్తుగడలు, ఎవరిది పైచేయి కావాలి, ఎవరి ప్రయోజనాలు ముందుకు రావాలి, రేపు అధికారంలోకి ఎలా రావాలి అనే అంశాలు ముందుకు వస్తున్నట్లుగా ఈ చర్చోపచర్చలు ఉన్నాయే తప్ప ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏం నష్టం వచ్చిందనే వైపు నుండి కూడా మాట్లాడటం చాలా తక్కువగా ఉంది. ప్రజలు దీనిని కూడా జాగ్రత్తగా గమనిస్తున్నారని చెప్పి నేను ఈ సందర్భంగా తెలియచేస్తూ, ఆ విషయాన్ని నేను ముగిస్తున్నాను.

అయితే, ఈ గవర్నర్ గారి ప్రసంగం ఒక రకంగా చెప్పాలంటే ఒక విధాన పత్రం. ఈ నాలుగు సంవత్సరాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన ఎలా జరిగింది, అభివృద్ధి ఎలా జరిగింది, ఆ అభివృద్ధి వెనుక ఉన్న ధృక్పథం ఏమిటి అనే విషయానికి సంబంధించిన పత్రం. బడ్జెటుపత్రం అనేది ప్రణాళికకు సంబంధించిన పత్రం. అప్పుడు ఆ విషయాలను గురించి మాట్లాడుకోవచ్చు. కానీ, కొంత perspective గురించి మాట్లాడుకోవాలని అనుకున్నట్ల యితే కొంచెం బాధవేస్తుంది. చూస్తూ, చూస్తూ ఉండగానే ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో మన రాజకీయ వ్యవస్థ, మన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థ బాగా బలహీనపడిందని నేను అభిప్రాయపడుతున్నాను. ఈ చర్చంతా జరిగేటప్పుడు ప్రధాన ప్రతిపక్షం లేదు. ప్రతిపక్షం లేకుండా మాట్లాడుకోవడమన్నది చూస్తే, సభ బాగా జరిగింది, ఎటువంటి గొడవలు లేకుండా అని అనుకుంటే అనుకోవచ్చు కానీ, ప్రజాస్వామ్యం మాత్రం అది అనిపించుకోదు. ప్రజాస్వామ్యానికి పాలక పక్షం ఎంత ముఖ్యమో, ప్రతిపక్షం కూడా అంతకంటే ముఖ్యం. ఆ రకమైన పరిస్థితి ఎందుకు కల్పించారో, ఆ రకంగా వెళ్లి పోవడంవల్ల ఏ రాజకీయ ప్రయోజనాలు ఆశించారో, అది ఆ పార్టీకి సంబంధించినది కాబట్టి నేను అంతగా వ్యాఖ్యానించలేను కానీ, తద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మాత్రం తీవ్ర నష్టం కలిగిందని, ఇది శుభసూచకం కాదని నేను చాలా స్పష్టంగా చెప్పదలచుకున్నాను.

అధ్యక్షా, ఇదే కాదు. మన శాసనసభ, శాసన పరిషత్ కమిటీల పనితీరులో కూడా చాలా తేడా వచ్చిందని నేను అభిప్రాయ పడుతున్నాను. గతంలో కమిటీలను చూశాను, ఇప్పుడు కూడా చూశాను. అవి ఫంక్షనింగ్ చేయడ మన్నది బాగా తగ్గిపోయింది. కమిటీల వ్యవస్థ బాగా పనిచేస్తున్నప్పుడు, అనేక విషయాలను మేము అక్కడ తేల్చేసే వాళ్లం. కమిటీలో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఏ రాజకీయ పార్టీ ఉన్నా అందరం ఐక్యంగా ఉండే వాళ్లం. మీరు (గౌరవ శాసనపరిషత్తు అధ్యక్షులు), మేమూ కలిసి శాసనమండలి ప్రివిలేజ్ కమిటీలో సభ్యులుగా జిల్లాలో సమావేశాలు జరిపినప్పుడు, చాలా అద్భుతమైన విజయాలను మనం సాధించడం జరిగింది. ఆ సిస్టం కూడా ఈ మధ్య కాలంలో ఎందుకు బలహీన పడిపోయిందో తెలియదు. ఆ విషయం నేను స్పీకర్ గారికి కూడా ఒక సందర్భంలో చెప్పడం జరిగింది. అలా ఎందుకు జరుగుతుందో మనం ఒకసారి మాట్లాడుకోవాలి. సమావేశాల పనిదినాలు కూడా తగ్గుతున్నాయి. సరే సహజంగానే రాష్ట్రం విడిపోయిన తరువాత ఇక్కడ మనం సచివాలయం, అసెంబ్లీ పెట్టుకోవడంతో మిగిలిన ఆఫీసులన్నీ ఎక్కడెక్కడో విసిరేసినట్లు ఉండటంతో ఏ పనికి రావాలన్నా కూడా చాలా కష్టంగా

ఉంది. కార్యాలయాల్లో అధికారులు దొరకడం మహా కష్టంగా ఉంది. మంత్రులు దొరకడం కూడా కష్టంగానే ఉంది. ఒకరిద్దరు మంత్రులు కూర్చునుంటే కూర్చుని ఉండొచ్చు గాని, భౌగోళికంగా ఈ ప్రదేశంలో క్రొత్తగా మనం వచ్చి కార్యాలయాలు పెట్టుకొని ఒకదానికొకటి కుదేసుకుంటున్న సందర్భంలో పరిపాలన కూడా బాగా దెబ్బతినిపోయింది. అందువల్ల అంతా ఒక తాత్కాలిక పద్ధతిలో నడుస్తోందనే ధోరణి ఉంది. ఎంతకాలం ఈ రకమైన తాత్కాలికత అనేటువంటిది, ఒక విసుగులాంటిది, ఎప్పుడిది పరిష్కారం అవుతుందనే ఆశ జనంలో చాలా ఎక్కువగా కనపడుతున్న ఒక ప్రత్యేక సందర్భంలో మనం ఉన్నామని చెబుతున్నాను.

అధ్యక్షా, ఈ ప్రసంగంలో గవర్నరు గారు కొన్ని మంచి విషయాలు చెప్పారు. అవి heart touching గా ఉన్నాయి. వాటిని నేను అప్రిషియేట్ చేస్తున్నాను. ఉదాహరణకు అనంతపురం జిల్లాలో భూగర్భ జలాలు పెరగడమ నేది చూస్తే, మేము అనంతపురం జిల్లాలో చాలా కార్యక్రమాలు చేశాము. కరవు వచ్చినప్పుడు, 42 కరవు కేంద్రాలను అక్కడ నడిపాము. బెల్లం, బియ్యం కలిపి వూరికే జావలాగా కలిపి పోస్తే, ఆనాడు వందల మంది ప్రాణాలు నిలుపుకు నేవారు. ఆ రకమైనటువంటి దయనీయ పరిస్థితిని జనవిజ్ఞాన వేదిక ద్వారా కళ్లారా మేము చూశాము. కానీ, ఇప్పుడు అనంతపురంలో కూడా భూగర్భ జలాలు కోస్తా జిల్లాలతో సమానంగా ఉన్నాయి అన్నట్లయితే, it is a miracle, no doubt in it. వర్షం కూడా దీనికి కొంత ఉపయోగపడితే పడి ఉండొచ్చు గానీ, ఒక వ్యూహం లేకుండా మాత్రం ఇది జరిగి ఉండదని నేను అభిప్రాయపడుతున్నాను. అలాగే, ఎలక్ట్రిసిటీ చాలా వరకు 15,500 మెగావాట్లకు పెరిగిందని చెప్పి ఇందులో ఉంది. అది విశేషం కాదు గాని, ముఖ్యమైన విశేషమేమంటే ఇందులో సౌర విద్యుత్తు 2533 మెగా వాట్లు ఉండటమనేది. ఐదారేళ్లకు ఇదే విధంగా 10000 మెగావాట్లు సంప్రదాయేతర ఇంధనం ద్వారా సంపాదించు కోగలిగినట్లయితే, ఇది ఇంకా కొంచెం ముందుకు పోయినట్లయితే బాగుంటుంది. మొత్తం ఎలక్ట్రిసిటీకోసం మనం బొగ్గు మీద ఆధారపడుతున్నాము. ఈ బొగ్గు మీద ఆధారపడే విధానమన్నది ఎంత త్వరగా తగ్గిపోవడం ప్రారంభమైతే దేశానికి అంత మంచిది. ఒక అంచనా ప్రకారం 2020, 2022 ఆ ప్రాంతంలో ఇక ఈ రకమైన బొగ్గు మీద ఆధార పడటమన్నది ఉండదనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి ఒక అంచనా. ఇది జరగాలని నేను కూడా కోరుకుంటు న్నాను. అయితే, ఇప్పుడు విద్యుత్ ఉత్పత్తి కొంచెం ఎక్కువగా ఉందంటే.. అర్థశాస్త్రంలో ఒక సూత్రముంది. Crisis of plenty అనే సూత్రమది. బహుశా ఆ సూత్రం విద్యుత్ రంగానికి కూడా అది వర్తిస్తుందేమో. ఇప్పుడు మనకు కావాల్సినంత విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. కానీ, ఎవరెవరు దగ్గర నుండో విద్యుత్ సప్లైకోసం మనం కుదుర్చుకున్న ఒప్పందాల ఫలితంగా, వారి దగ్గర నుండి విద్యుత్‌ని మనం తీసుకోక తప్పడం లేదు. దానివల్ల, ఆంధ్రప్రదేశ్ జెన్‌కో సంస్థ ఉత్పత్తిని తగ్గించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. బహుశా ఓ నాలుగేళ్లకు ఈ సమస్య పరిష్కారం అవుతుందని అనుకుంటున్నాను.

అధ్యక్షా, సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.40,000 కోట్లు పెట్టుబడులు పెట్టారు. అయితే, ఈ ప్రాజెక్టుల విషయానికి వచ్చేటప్పటికి ఎప్పుడూ కూడా, దీని ద్వారా ఎంత ఆయకట్టు సాగవుతుంది, ఎంత విలువతో

ప్రాజెక్టు పనులు పూర్తవుతాయనే విషయాలపై మనసు పెట్టినంతగా, ఆ ప్రాజెక్టు వల్ల ఎంతమంది బయటకు వెళ్లి నిర్వాసితులుగా మారుతున్నారు, వాళ్లు ఏమౌతున్నారు, ఎక్కడ ఉంటున్నారు అనేది చూడటం లేదు. అది మనం చూడాలి. నిజంగా వాళ్లు కదా త్యాగం చేసింది. ఆ ప్రాజెక్టు కోసం త్యాగం చేసినవాళ్లలో ఎక్కువ మంది గిరిజనులు ఉంటారు. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు గురించి చాలా గొప్పగా చెబుతున్నారు. మాక్కూడా పెద్ద ప్రాజెక్టు వస్తుందంటే ఆనందమే. దాదాపు ఒకటిన్నర లక్షల మంది గిరిజనులు ఈ పోలవరం ప్రాజెక్టు క్రింద నిర్వాసితులు కాబోతారు. వాళ్ల వైపు నుండి మీరు ఏం మాట్లాడతారు? పోలవరం ప్రాజెక్టుకు ఇంత ఖర్చుపెట్టామని మీరు, ఇంత ఖర్చు అవుతుందని ఒక లెక్క, ఇంత ఇస్తామని ఒక లెక్క ఉంది. కానీ, నిర్వాసితులకు పరిహారం క్రింద అయ్యే ఖర్చులను భరించడానికి ఎవరు ముందుకు వస్తారు? దాన్ని కూడా కలిపి మీరు పోలవరం ప్రాజెక్టు వ్యయాన్ని లెక్కిస్తున్నారా, లేదా? నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వకుండా, మీరు ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లిస్తామంటే ఏం న్యాయం జరుగుతుంది. ప్రతి ప్రాజెక్టు వెనుక గిరిజనులు, సాధారణ జనాల త్యాగాలు ఉన్నాయి. ఈ త్యాగాలను ఎంతకాలం చేయాలనే మాట కూడా వినవస్తోంది. పెట్టుబడుల గురించి కూడా ఇందాక మాట్లాడారు. చాలా సంతోషం.

మ.01.00

ఈ సందర్భంగా నేను రెండు మూడు వ్యాఖ్యలు చేయదల్చుకున్నాను. నూతన తరుణప్రాయంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడింది కనుక కష్టపడి పనిచేస్తున్నారు అనేది అందరికీ ఉన్న అభిప్రాయమే. అందులో సందేహమేమీ లేదు. దీనిని ప్రభుత్వమే చెప్పనక్కర్లేదు. సామాన్యులను అడిగినా కూడా నడపడం చాలా కష్టంగా ఉంది అయినా కూడా ఎట్లాగో నెట్టుకుని వస్తున్నారని మాట్లాడుతున్నారు. అదే సందర్భంలో కడుపులో చాలా ఉన్నాయి, చెప్పుకోలేక తంటాలు పడుతున్నారు అనేది కూడా ఉన్నది. అది కూడా వాస్తవమే. చెప్పుకోలేక చెప్పుకోలేక ఆఖరికి ఇప్పుడు మాత్రమే చెప్పుకునే పరిస్థితుల్లోకి వచ్చారు. ఇప్పుడైనా రావడమనేది మంచిది. ఆర్థికంగా బాగా వెనకబడ్డాము. ఇప్పుడు మాటిమాటికీ తెలంగాణాతో పోలిక వస్తున్నది. మేము ఏది అడిగినా పోలిక తీసుకోవలసి వస్తోంది. తెలంగాణాలో ఆశా వర్కర్లకు రూ.6,000 ఇస్తున్నారండీ, ఇక్కడ ఎందుకు ఇవ్వరు? పంచాయతీ రాజ్ వివిఓలకు ఇంత తెలంగాణాలో ఇచ్చారు, ఇక్కడెందుకు ఇవ్వరు? కాంట్రాక్ట్ టీచర్లకు మినిమమ్ పే స్కేల్ తెలంగాణాలో ఇచ్చారు ఇక్కడెందుకు ఇవ్వరు? ఇంకొకటి, మరొకటి ఈ విధంగా తెలంగాణాతో పోల్చుకుంటున్నాము. ఈ పోల్చుకునే సందర్భంలో అధికారంలో ఉన్నవారికి చాలా కోపం వస్తుంది. మీరు తెలంగాణాని తీసుకురాకండి, తెలంగాణా, ఆంధ్రా ఒక్కటి ఎలా అవుతుంది? కావాలంటే తెలంగాణాకు వెళ్లండి అని చాలా దురుసుగా కూడా మాట్లాడుతున్నారు. కానీ, నేను చెప్పేదేమంటే, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం మీద ఒక అభిప్రాయం ఏర్పడడానికి అవకాశం ఎక్కువైంది. అదేమిటంటే, చాలా కీలకంగా ఈ అభివృద్ధిలో గొప్ప పాత్ర పోషిస్తున్నటువంటి అత్యంత కింది స్థాయిలో ఉన్నటువంటి చిరుద్యోగులు.

ఈనాడు మనం ఇక్కడ అంతా శుభ్రంగా ఉన్నది అనుకుంటున్నాము. మన మరుగుదొడ్లు తళతళలాడుతున్నాయంటే కారణమెవరు? అక్కడ ఆడవాళ్లు ప్రుళ్లు పటుకుని నిలబడి ఉంటారు. వాళ్ల జీతమెంత? రూ.7,500 ఇస్తామని చెబుతారు, రూ.6,500 చేతికి వస్తాయి. వారి జీవితాల్లో ఎప్పటికైనా మెరుగుదల ఉంటుందా అని నేను అడుగుతున్నాను.

**శ్రీ పయ్యావుల కేశవ్ : (మైక్ లేదు) :** రూ.12,000 ఇస్తున్నారండీ.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** నేను చెప్పేది ఔట్‌సోర్సింగ్ వాళ్ల సంగతి. రూ.12,000 ఎంతమందికి ఇస్తున్నారండీ? ఒక్కసారి సెక్రటేరియట్‌లో పనిచేసేవాళ్లని అడగండి. నేనొక్క విషయం మీకు చెబుతాను. అధ్యక్షా, జల్లి విల్సన్ గారి పేరు విని ఉంటారనుకుంటాను. వారు రామన్ మెగసెసే అవార్డు తీసుకున్నారు. ఆయన మరుగుదొడ్లు తుడిచే వృత్తిలో ఉన్న వ్యక్తి. వాళ్ల నాన్న శానిటరీ ఉద్యోగం చేసేవారు. ఆయనొక మాట అనేవారు. మా నాన్న పాకీ పని చేసేవారు. మా నాన్నకి ఆ రోజుల్లోనే రూ.7,500, 8,000 జీతం వచ్చేది. అంటే దాదాపు 20 సంవత్సరాల క్రితం సంగతి. అందువల్ల నేను చదువుకొని రామన్ మెగసెసే అవార్డు తీసుకుని, ఈ రోజు ఏషియా నోబెల్ అవార్డు తీసుకున్న వ్యక్తి అన్నంత గౌరవాన్ని పొందగలిగాను. ఎందుకు పొందగలిగానంటే, ఆ రోజు మా నాన్న రెగ్యులర్ ఉద్యోగి కాబట్టి. కానీ, ఈరోజు నా బంధువులు పాకీ పని చేస్తున్నారు. వీళ్లు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. నేను దృఢంగా నమ్ముతున్నదేమంటే మా తరువాత తరం వాళ్లు, మా బంధువులు ఎవరైతే ఈ పనిచేస్తున్నారో వాళ్ల పిల్లలు కూడా పాకీవారు గానే ఉంటారు. వాళ్ల మనవళ్లు కూడా పాకీ వాళ్లుగానే ఉంటారు. నూతన ఆర్థిక విధానాలు ఇంత దుర్మార్గంగా దళితుల మీద ప్రభావం కలిగించాయని ఆయన చెబుతారు అధ్యక్షా. నేను కూడా అదే ప్రశ్న వేస్తున్నాను. ఎవరైతే ఈనాడు పాకీ పనిచేస్తున్నారో వాళ్ల పిల్లలు కూడా అదే పని చేయకుండా ఉండేవిధంగా మనం చేయగలుగుతున్నామా? వాళ్లకు ఉద్యోగ భద్రత లేకుండా ఉన్నట్లైతే, కనీస గౌరవం వాళ్లకు లేకపోతే అది కూడా అభివృద్ధిలో భాగమవుతుందా? వాళ్లందరికీ నమ్మకాన్ని, ఆరోగ్య భద్రతను ఇవ్వగలుగుతున్నామా? బహుశ భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనట్లుగా కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ విధానం మన దగ్గర ఉన్నది. నేను పెద్ద పెద్ద కళాశాలల్లో లెక్చరర్ల గురించి కూడా మాట్లాడడం లేదు. క్రింది స్థాయిలో ఉండేవాళ్లతో మాట్లాడేటప్పుడు చాలా బాధగా ఉంటుంది. కన్నీళ్లు వచ్చే సందర్భం అది. కానీ, మరోపక్క నుండి చూచినప్పుడు ప్రభుత్వం కూడా వీళ్లైతే బాగా పనిచేస్తారు, రెగ్యులర్ వాళ్లు పని చేయరు. వీళ్లైతే బాగా చిమ్ముతారు. మిగతావాళ్లు దొంగలు. చిమ్మరు. కాబట్టి, వీళ్లే ఉండాలి, వీళ్లు ఉండడమే నిజమైన అభివృద్ధి అనే ఒక సిద్ధాంతంలోకి వెళ్లిపోయిన తరువాత, ప్రభుత్వం అనుకున్న పని జరుగుతుంది కానీ, అదే నిజమైన అభివృద్ధి అంటే కష్టమే. ఎందుకంటే వాళ్ల ఉపాధి, వాళ్ల కొనుగోలు శక్తి, వాళ్ల భవిష్యత్తు, వాళ్ల పిల్లల భవిష్యత్తు అనేటటువంటివి అభివృద్ధిలో భాగస్వామ్యం కాకుండాపోతే ఆ అభివృద్ధికి పెద్దగా అర్థమేమీ ఉంటుందని నేనైతే అనుకోవడం లేదు. ఇది చాలా తీవ్రమైన, బాధాకరమైన విషయం.

అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో ఈమధ్యకాలంలో నేను గమనించిన విషయాలు ప్రస్తావిస్తాను. ప్రజలు వాళ్లకు కావలసినవి ప్రభుత్వాన్ని అడుగుతారు. వాళ్లకు అడగడానికి హక్కుంది. లేదా, ప్రజాస్వామ్యం ఎత్తేయండి, అడక్కుండా ఉంటాము. ప్రజాస్వామ్యం ఉన్నంతకాలం హక్కుల కోసం అడగడమనేది రాజ్యాంగపరంగా ఉన్నటువంటి హక్కు. నేనీమధ్య గురుకుల పాఠశాలల సమావేశానికి వెళ్లాను. ఆ ఉపాధ్యాయులది ఇన్‌డోర్ మీటింగ్ అది. ఆ మీటింగ్‌కు వెళ్లినప్పుడు మధ్యాహ్నం 1.00 గం.లకు భోజనం తీసుకురావడానికి ఒకచోట నుండి భోజనం తెప్పించుకునే ప్రయత్నం చేస్తే పోలీసులు ఆ భోజనం తీసుకురాకుండా ఆపేశారు. వెళ్లడానికి లేదన్నారు. మళ్లీ మేము ఫోన్ చేస్తే తప్ప భోజనం రాలేదు. అంత చిన్న విషయంలో కూడా నిర్బంధమా? ఏ చిన్న ధర్నా చేయాలన్నా, ఏ చిన్న కార్యక్రమమైనా, ఊరేగింపు చేయాలన్నా 144 సెక్షన్ ఆటోమాటిక్‌గా వచ్చేస్తున్నది. అసలు ప్రజలు వీధుల్లోకి వస్తే లేదా, గొంతెత్తి ఏదైనా మాట్లాడితే అభివృద్ధి ఆగిపోతుంది, పెట్టుబడులు ఆగిపోతాయనే భయంతో ఉంటే చాలా కష్టతరమైన విషయం. దురదృష్టవశాత్తు ఈ అభిప్రాయం కూడా వచ్చింది. ఈ మధ్య నేను తుందుర్రుకి వెళ్లాను. ఆక్వా ఫుడ్ ఫ్యాక్టరీ మంచిదా, చెడ్డదా అన్న విషయం కాదు గానీ, అక్కడున్న ప్రజలు వ్యతిరేకిస్తే దానిని ఎత్తేయడమే మంచిది. నందిగ్రామ్ గురించి మా మిత్రుడు చెప్పాడు మేము 4 ఎంఎల్‌సీలము వెళ్లేసరికి ఒక్కరంటే ఒక్కరు కూడా మగవాళ్లు ఇళ్లల్లో లేరు. అందరూ భయపడి పారిపోయారు. పోలీసులు ఉదయం వచ్చి రాత్రి ఎవరెవరితో మాట్లాడారో ఆ ఫోన్‌కాల్ రిజిస్టర్ తీసుకుని వెళుతున్నారు. బడికి వెళ్లే పిల్లలు పోలీసులను బిత్తరపోయి చూసే పరిస్థితి వచ్చేసింది. కాబట్టి ప్రజాస్వామ్యమంటే 5 సంవత్సరాలకొకసారి ఓటేస్తే అధికారంలోకి వచ్చి పరిపాలించడం కాదు. సాధారణ జీవితంలో, రోజువారీ వ్యవహారంలో ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం ఉండడం అవసరం. ప్రజలు హక్కుల గురించి మాట్లాడకోగలగడం, వాళ్లు సంఘటితంగా ఉండగలగడం, వాళ్లు అడిగిన దానికి గౌరవప్రదంగా మనం సమాధానం చెప్పడమనే ప్రజాస్వామిక దృక్పథం ఉండగలగడం ముఖ్యం. అది తగ్గితే చాలా నష్టం వస్తుందని నేను అభిప్రాయపడుతున్నాను. ఈ ధోరణి వల్ల అందరికంటే ఎక్కువ నష్టపోతున్నవారు దళితులు, గిరిజనులేనని ఈ సందర్భంగా నేను స్పష్టంగా చెప్పదల్చుకున్నాను. అట్లాగే, దేశం గురించి నేను మాట్లాడడం లేదు కేవలం మన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో సంవత్సరన్నర కాలం నుండి చూస్తే సుమారు రూ.2,500 కోట్ల అవినీతి సొమ్మును ఏసిబి వారు పట్టుకున్నారు. చివరికి దేవాదాయ ధర్మాదాయ శాఖలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పది, పదిహేను రోజుల క్రితం ఒక విఆర్‌ఓ దగ్గర రూ.100 కోట్ల అవినీతి సొమ్ము ఉందని అన్నారు. ఇంకా లెక్క తేలలేదు. ఇదెలా సాధ్యమవుతోంది? వందలాది కోట్ల, వేలాదికోట్ల అవినీతికి అధికారులందరూ ఎలా పాల్పడుతున్నారు? మనం ఏం చేస్తున్నాము? రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది, అభివృద్ధి చెందుతోంది అంటే ఈ అవినీతి కూడా అభివృద్ధి అవుతోందని అనుకోవలసిన పరిస్థితి వస్తుంది. ఈ అవినీతి అంతా కూడా రాజకీయ ప్రమేయంతో నిమిత్తం లేకుండా దానంతట అదే జరుగుతోందని అంటే మేమైతే అంగీకరించలేకపోతున్నాము. నాకు బాగా తెలుసు. మా జిల్లాలో ఒక్క డిఈఓకు మొత్తం విద్యాశాఖ అంతా సాగిలపడింది. ఆ రకమైన పరిస్థితి రావాలా? వచ్చినట్లైతే ప్రభుత్వాలమీద ఏం గౌరవం ఉంటుంది? భవిష్యత్తు ఎలా ఉంటుందనేది మీకు చెప్పదలచాను.

అధ్యక్షా, మత్స్యపరిశ్రమకు సంబంధించి 14.5 లక్షల మంది ప్రజలకు ఉపాధి కల్పించడమే కాకుండా 6.4 శాతం జిఎస్‌డిపిలో భాగంగా ఉందని చెప్పారు. చాలా సంతోషం. 70 శాతానికి పైగా చేపలు, రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నామని, వాటిని పెద్దఎత్తున ఎగుమతి చేస్తున్నామని గవర్నరు గారి ప్రసంగంలో చెప్పారు. నాకున్న భయమేమిటంటే– చేపలను ఎగుమతి చేసి మంచినీళ్లను దిగుమతి చేసుకుంటామేమో? పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు గత నెల ఒక ప్రకటన చేశారు. అదేమంటే – ఈ కోస్తా ఏర్పడడానికి, ఉభయగోదావరి జిల్లాలు ఏర్పడడానికి ఒక లక్షసంవత్సరాలు పట్టి ఉంటుంది, కానీ ఒక పది పదిహేను సంవత్సరాల్లో ఈ కోస్తా ప్రాంతం మొత్తం నశించిపోయే ప్రమాదముంది, ఒక్క గింజ కూడా ఇక్కడ పండే పరిస్థితి కనిపించడం లేదని చాలా బాధాకరంగా అన్నారు. మేము కూడా చూశాము. మంచినీళ్లు లేవు. ఏదైతే మనం రైస్ బౌల్ అని అనుకున్నామో, అది కాస్తా ఇప్పుడు ఫిష్ బౌల్ అయితే అయింది కానీ, రేపు మనం బౌల్ పట్టుకుని తిరిగే పరిస్థితి తెస్తుందేమోనని మేము భయపడుతున్నాము. మేము అభివృద్ధికి కచ్చితంగా వ్యతిరేకులం కాదు. మత్స్యపరిశ్రమ అభివృద్ధి కావాలని మేము కోరుకుంటున్నాము. కానీ, అది మోతాదుకు మించకూడదు. మొత్తం అభివృద్ధికే ఆటంకంగా, భంగకరంగా మారకూడదు. ప్రకృతిని మొత్తం చేతుల్లోకి తీసుకోవడం జరగకూడదు. ఒక బాలెన్సింగ్ సిస్టమ్ లేనందువల్ల ప్రపంచంలో కోస్తా ప్రాంతాలకు వనరులు ఎక్కువ ఉండడం వల్ల అభివృద్ధికి ఎంత ఆస్కారముందో, పెద్దఎత్తున కాలుష్యభరితమయ్యే ప్రమాదం కూడా అంతే ఉన్నది. ఇది పరిశోధకులు చెప్పే అంశం. ఆంధ్రప్రదేశ్ ఆ జాగ్రత్త తీసుకోవాలని నేను కోరుతున్నాను.

అలాగే, విద్య, సంక్షేమం గురించి చాలా చెప్పారు. గత నాలుగైదు నెలలుగా విద్యా, సంక్షేమం గురించి ఏం చర్చ జరిగిందో మనందరికీ తెలుసు. భారతదేశంలో ఎక్కడా లేనంతగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల ఆత్మహత్యల మీద చర్చ జరిగింది. ఆ విధంగా జరిగినప్పుడు అందరూ కూర్చుని మాట్లాడుకుని ఆంధ్రప్రదేశ్ ఎందుకు ఈ రకమైన స్థితిలోకి వెళుతోంది, మన పిల్లలను చదువులకు పంపిస్తే ఎందుకు కాటికి పోతున్నారు అనేది ఆలోచించాలి. ఏదో గంభీరంగా మాట్లాడారు, ముఖ్యమంత్రిగారు కూడా గట్టిగా జోక్యం చేసుకునే ప్రయత్నం చేశారు గానీ, వ్యవస్థాగతమైన మార్పులు రాకుండా సమస్యకు పరిష్కారం ఎలా దొరుకుతుంది చెప్పండి.

మ.01.10

అధ్యక్షా, ఆరోగ్యానికి సంబంధించి మీరు గమనించినట్లయితే, డెంగీవ్యాధి చికిత్సకు సంబంధించి ఆరోగ్యశ్రీలో లేదు. ఒక జిల్లాలో సంక్షేమం కోసం అన్ని డిపార్టుమెంట్లు కలిపి ఎంత ఖర్చుపెట్టాయో, అంతకంటే ఎక్కువ గత నాలుగు మాసాలకు ముందర మన రాష్ట్రంలో డెంగీవ్యాధి వచ్చినప్పుడు బాధితులు వైద్యం కోసం ఖర్చుపెట్టారు. అంతేకాకుండా ఈ వ్యాధివల్ల కొంతమంది పనిదినాలు, ప్రాణాలు పోగొట్టుకోగా, మరికొంతమంది అప్పులపాలైన విషయం మనందరికీ తెలిసిందే. వైద్యానికయ్యే ఖర్చు భరించలేకనే ప్రపంచంలో దాదాపు 60శాతం మందికి పైగా ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువకు జారి పడిపోతున్నారని యూనిసెఫ్ చెప్తోంది. ఒక్క డెంగీవ్యాధివల్ల ఆంధ్రప్రదేశ్

అంత అతలాకుతలం కావాల్సిన అవసరముందా? ఇటీవల నీతిఆయోగ్ ప్రకటించిన లెక్కల్లో కూడా మనం ఎనిమిదవ స్థానంలో ఉన్నాం. ముప్పై సూచికల్ని కానీ తీసుకున్నట్లయితే ఆరోగ్యంలో 30వ స్థానంలో ఉన్నామని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఒక మంచి అభివృద్ధి చెందిన సమాజానికి, ఒక మంచి సాంస్కృతిక పునాది కూడా ఉండాలి. ఆ సాంస్కృతిక పునాది లేకుండా ఆర్థిక, భౌతిక పునాదుల మీదనే ఒక గొప్ప సమాజాన్ని సృష్టించడమనేది సాధ్యంకాదు. దురదృష్టవశాత్తూ ఈమధ్య కాలంలో దళితుల మీద చాలా ఎక్కువ దాడులు జరుగుతున్నాయి. మా ప్రకాశం జిల్లా దేవరాయపల్లెలో 70 సంవత్సరాల నుంచి అనుభవిస్తున్నటు వంటి భూములను చెరువు కింద మారిస్తే మూడు, నాలుగు నెలలు అక్కడ ఒకటే గొడవ చేస్తే తప్ప సాధ్యంకాలేదు. ఈరోజు రాష్ట్రంలో ఏం జరుగుతోందంటే అన్ని రాజకీయపార్టీలనూ వదిలేసి దళితులు తమంతతాముగా చాలా పెద్ద ఎత్తున సమీకరింపబడడమనేది ప్రారంభమైంది. ఈరోజు వాళ్ళ వెనుకే రాజకీయ పార్టీలన్నీ పోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది అంత మంచిది కాదు. లేదూ ఇదే మంచిదనుకుంటే మంచిదే. నాకు కూడా చాలా సంతోషం. వాళ్ళే రాజకీయాలు నడిపే రోజు వస్తే అంతకంటే కావలసిందేంటి?

అలాగే, ఒక హేతుతత్వంతో కూడినటువంటి భావజాలం కూడా ఉండాలి కదా. ఉదాహరణకు ప్రకృతి వైద్యాన్ని ప్రోత్సహించాలని పారేకర్‌గారిని తీసుకువచ్చారు. ఆయనేమో శాస్త్రవేత్తలు, సైన్స్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు దండగ, ఇప్పుడు జరిగిందంతా దండగ అని ఎలా చెప్పారో చూడండి. సైన్స్ లేకుండా, వ్యవసాయ రంగంలో గొప్ప పరిశోధనలు లేకుండా, రకరకాల వంగడాలను ఉత్పత్తి చెయ్యకుండా ఈరోజు మనందరమూ భోజనం చెయ్యగలుగుతున్నామా? సైన్స్‌ను అంత వ్యతిరేకించే భావజాలం చివరికి అభివృద్ధికి వ్యతిరేకంగా మారుతుంది. తత్వశాస్త్రానికి, ఆధ్యాత్మికతకు, భగవంతుడికి, మతానికి నేనేమీ వ్యతిరేకిని కాను. వాటికి, సైన్స్‌కు మధ్య గీత ఒకటి ఉంది. వాటిని కలిపేసి సైన్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడడం ప్రారంభించాక చాలా పెద్ద ఎత్తున హితవాద, మతవాద భావజాలం పెరిగినట్లయితే మనుగడ చాలా కష్టమవుతుంది. నేను ఈ సందర్భంగా ఒక డిమాండ్ చేస్తున్నాను. కర్ణాటకలో, మహారాష్ట్రలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఒక చట్టాన్ని కూడా తీసుకుని వచ్చారు. తొందర్లోనే మన దగ్గరకూడా ఆ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరముంది.

అదేవిధంగా, సాంస్కృతికంగా అభివృద్ధి అంటే ఈ మధ్య నీతి ఆయోగ్ ఒక మంచి పరిశోధన చేసింది. అందులో బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ఎక్కువ పెట్టుబడి వచ్చే రాష్ట్రాలూ వాటిల్లో జరుగుతున్న అదనపు డెవలప్‌మెంట్స్ గురించి తెలియచేస్తూ, మొత్తం భారతదేశంలో అతి తక్కువమంది ఆడపిల్లలు పుడుతున్నటువంటి రాష్ట్రం గుజరాత్ అనీ, అక్కడ 1000 మంది మగపిల్లలకు 854 మంది ఆడపిల్లలు ఉన్నారని తెలిపింది. అంటే గత రెండు సంవత్సరాలలో గుజరాత్ 54 పాయింట్లు కోల్పోయింది. అభివృద్ధి చెందే విషయంలో ఇది న్యాయం కాదు. సహజంగానే ప్రకృతిలో మగవాళ్ళు ఎక్కువమంది పుడతారు. ప్రకృతిలో మగవాళ్ళు యుద్ధాలు చేయాలి, కష్టతరమైన ఉద్యోగాలు చేయాలి కాబట్టి ఆడవాళ్ళ కంటే మగవాళ్ళు ఎక్కువగా పుడతారు. ఆ విధంగా ప్రకృతికి ఉంది. కానీ

మగవాళ్ళు తగ్గిపోయి ఆడవాళ్ళు పెరుగుతారు. ఎందుకంటే పుట్టుకతోనే ఆడపిల్లకు నిలదొక్కుకునే శక్తి మగపిల్లవాడికంటే ఎక్కువగా ఉంటుంది. ఇది సైన్స్ చెప్తున్నటువంటి విషయం. దీనిని కొంచెం వికృతంగా మార్చేసి గుజరాత్‌లో 854 మంది ఉన్నారంటే, నెంబర్ వన్ అయ్యిందని చెప్తే, ఆంధ్రప్రదేశ్ కూడా చాలా వేగంగా అభివృద్ధిచెందే రాష్ట్రమైనాకానీ, వేగంగా ఆడపిల్లలు తగ్గిపోయే రాష్ట్రంగా ఉండకూడదని నేను కోరుకుంటున్నాను. ఇది కల్చరల్ ఇష్యూ. All the things have to be dealt with.

చివరిగా, దయచేసి అందర్నీ కలుపుకుని వెళ్ళండి. ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాల కొరకు, కొత్తగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడడంలో ఎవ్వరూ కూడా వెనకాడరని మేము అనుకుంటున్నాము. ఒకవేళ ఎవరైనా వెనకాడినట్లయితే వాళ్ళు మూర్ఖులని నేను అభిప్రాయ పడుతున్నాను.

అధ్యక్షా, లక్షలాది మందికి ఒక ఆశ ఉంది. రాష్ట్రం ఎందుకో విడిపోయింది. దానిగురించి ఇప్పుడు చర్చ అక్కర్లేదు. దీనిని ఎలాగో ఒకలాగ నిలబెట్టుకోవాలి. మిగతా రాష్ట్రాలలాగా ముందుకుపోవాలి. మన భాషను మనం నిలబెట్టుకోవాలి. తెలుగుజాతిగా నిలదొక్కుకోవడంలో ఒక గొప్ప పాత్ర పోషించాలనే ఆవేశంతోపాటు ఆర్థికంగా మిగతావారికంటే మనం ఏమాత్రం తీసిపోకూడదు. ఆరోగ్యంలో కేరళ మొదటిస్థానం, తమిళనాడు రెండవస్థానం రాగా మూడవస్థానం మనం రావాలి కదా. తెలంగాణాతో పోల్చినట్లయితే మనం రావడానికి అవకాశాలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. అది ఎలాగంటే ఈ ప్రాంతంలో విమానాశ్రయాలు, మిగతా పట్టణాలు కానీ చూస్తే తెలంగాణ కంటే ఎక్కువగా అభివృద్ధిలో ఉన్నాయి. అవన్నీ బాగా డిస్ట్రిబ్యూట్ అయిన పరిస్థితి ఉంది. వీటిపై మనసుపెట్టి సమగ్రమైన అభివృద్ధి కోసం ఏ పార్టీ ఈ రాష్ట్రాన్ని పరిపాలించినా సాధారణ ప్రజల నుంచి మేధావులవరకు, పౌర సంఘాల నుంచి పౌర సేవకులదాకా కావాల్సినంత మద్దతు లభిస్తుందని నేను అభిప్రాయపడుతున్నాను. ఆ మద్దతును స్వీకరించడం ఎలా ? షేక్‌హ్యాండ్ ఇస్తామన్నా చేతులు ముడుచుకుని ఉంటారా ? లేకుంటే కౌగలించుకోవడానికి ముందుకొస్తారా అనే విషయాన్ని పరిపాలించిన పార్టీలు ఎన్నుకోవాలి. ఆమేరకు మేము మాత్రం నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తాం. కచ్చితంగా మాకు ఇష్టం లేనిదానిని ఇష్టం లేదనే చెప్తాం. ఏ రాజకీయ పార్టీవైపు మేము పోకుండా మధ్యలో నిలబడి ఈ రాష్ట్ర అభివృద్ధికోసం నూటికి నూరుపాళ్ళు మీతోపాటు ఉంటామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ చిక్కాల రామచంద్రరావు (స్థానిక సంస్థలు – తూర్పుగోదావరి):** అధ్యక్షా, గవర్నరుగారి ప్రసంగం ప్రజలకు అనుగుణంగానే ఉంది. అందుకు గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈరోజున చాలామంది చాలా విషయాలు చెప్పారు. అయితే రాష్ట్రం ముందుకుపోవాలంటే కొత్తగా ఏర్పడిన ఈ రాష్ట్రానికి అనేక ఇబ్బందులు, కష్టాలు, నష్టాలు ఉన్నాయి. వాటిని అధిగమించి ముందుకు పోవాలనే విధానంతో ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం, చంద్రబాబునాయుడుగారు చేస్తున్న కృషిని గవర్నర్‌గారు అభినందించడాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను.

అధ్యక్షా, కేంద్ర సహకారంతో చేయాలన్న ఆలోచనతో ఉన్నటువంటి ఈ ప్రభుత్వం కేంద్రం నుంచి సహకారం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్న విధానంలో మనమున్నాము. అయినప్పటికీ చాలా చాకచక్యంగా, అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతో మన ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ఎక్కడా లోటులేకుండా, పరిపాలనలో అనేకమైన మార్పులు, చేర్పులు తీసుకువస్తూ ముందుకు వెళ్తోంది. అదేవిధంగా, ఈ రాష్ట్రంలో ఎప్పుడూ చూడని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తూ ఉన్నారు. బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీలు, ఇలా అనేకవర్గాలవారి సంక్షేమంకోసం భారీ ఎత్తున కేటాయింపులు చేయడం జరుగుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా షెడ్యూల్డు కులాల సంక్షేమానికి రూ.29,000 కోట్లు, ఎస్.టి సంక్షేమానికి రూ.10,000కోట్లు, బి.సి సంక్షేమానికి రూ.25,000కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.2300కోట్లు, కాపుల సంక్షేమానికి రూ.2100కోట్లు, అదేరకంగా బ్రాహ్మణ కార్పొరేషన్ కోసం, ఇలా అనేక వర్గాలకోసం ఖర్చు చేయడం జరుగుతోంది.

మ.01.20

అంతేకాకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారి సంక్షేమం కోసం రూ.223 కోట్లను ఖర్చుపెట్టడం జరుగుతోంది. ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. నేను గత 35 సంవత్సరాలుగా రాజకీయ రంగంలో ఉన్నాను. నేను అనేకసార్లు ఎమ్.ఎల్.ఎ.గా పనిచేశాను. ఎప్పుడూ కూడా ఈవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలుజరగలేదు. ఒకవైపు రాష్ట్రం రూ.16,000 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్నది. రాష్ట్రం విడిపోయిన తరువాత జనాభా 58శాతం ఉండి ఆదాయం కేవలం 46 శాతం ఉన్నప్పటికీ చాలా సమర్థవంతంగా ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతూ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారంటే చాలా ఆశ్చర్యంగా ఉంది.

అదేవిధంగా డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికి రూ.10,000/- ఇస్తామన్నారు. అందులో భాగంగానే రూ.6,993 కోట్లు ఇవ్వడం జరిగింది. వడ్డీ రూ.2514 కోట్లు కలిపి ఇవ్వడం జరిగింది. వడ్డీలేని రుణాలు రూ.13,500 కోట్లు ఇవ్వడం జరిగింది. మహిళల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పూర్తి స్థాయిలో పాటుపడుతున్నదని చెప్పడానికి ఇదొక నిదర్శనం. అంతేకాకుండా చంద్రన్న బీమా పథకం ద్వారా సహజ మరణం అయితే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5 లక్షలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ దాదాపు 79,963 కుటుంబాలకు రూ.590 కోట్లు ఇవ్వడం జరిగింది.

అంతేకాకుండా పండుగలకు పేదవర్గాల వారికి చంద్రన్న కానుక పేరుతో సరకులు అందజేస్తున్నారు. ఈవిధంగా చెప్పుకుంటూ పోతే చాలా కార్యక్రమాలున్నాయి. పెళ్లిళ్ల సమయంలో గిరిజన వధువులకు రూ.50,000/-, ముస్లింలకు రూ.50,000/-, ఎస్సీలకు రూ.40,000/-, బీసీలకు రూ.30,000/- ఇవ్వాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. అదేవిధంగా అందరికీ గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వాలనుకుంటున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో 12,46,000 గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా 1,57,000 గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వడం

జరుగుతోంది. ముఖ్యంగా చెప్పాలంటే పేదవర్గాలలో 49,00,000 మందికి పెన్షన్ ఇస్తున్నారు. దానికి మొత్తం 5,450 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చుపెడుతోంది. ఇంత భారీయెత్తున ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో పెన్షన్‌లు చాలా చక్కగా ఇస్తున్నారు.

హౌసింగ్ స్కీమ్‌లో కూడా ముందు కొంత వెనుకబడి ఉన్నప్పటికీ రాష్ట్రంలో భారీయెత్తున గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. పేదవర్గాల వారికి 19 లక్షల ఇళ్లు ఇస్తున్నాము. ఈ రకంగా చెప్పుకుంటూ పోతే సంక్షేమ రంగంలో ఎక్కడా లేనివిధంగా పథకాలు అమలు జరుగుతున్నాయి.

అంతేకాకుండా రైతుల సంక్షేమం కోసం అనేక రాయితీలు కల్పిస్తున్నాము. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని, లాభసాటిగా లేదని రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడడం గతంలో చూశాము. తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమ ప్రాంతంలో క్రాప్ హాలిడే ప్రకటించిన సందర్భాలు కూడా మనం చూశాము. ఎటువంటి పరిస్థితులలో రైతులు ఇబ్బంది పడకూడదు, వ్యవసాయం లాభసాటిగా ఉండాలనే ఉద్దేశంతో అనేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అందులో భాగంగానే వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ, శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందున్నాము కాబట్టి అన్ని రకాలుగా రైతులను ఆదుకోవడం కోసం సరైన విత్తనాలు ఇవ్వడం, ఉత్పత్తిని పెంచేందుకు మెళకువలు నేర్పడం, ఎరువులు, పురుగుమందులు ఉపయోగించే విధానంలో అన్ని రకాలైన సలహాలు ఇస్తున్నది. ఇందులో భాగంగానే గత సంవత్సరం 147 లక్షల టన్నుల ఆహార ధాన్యం ఉత్పత్తికాగా , ఈ సంవత్సరం 154 లక్షల టన్నుల ఆహార ధాన్యం ఉత్పత్తి వస్తుందని భావిస్తున్నాము. వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ, తక్కువ పెట్టుబడి పెట్టినప్పటికీ, గతంలో కంటే ఎరువులు 1,50,000 టన్నులు తగ్గించి వాడినప్పటికీ కూడా ఉత్పత్తి పెరిగే అవకాశాలు స్పష్టంగా కనపడుతున్నాయి. కాబట్టి ఉత్పత్తి కూడా బాగా పెరిగింది. దేశంలో హెక్టారుకు 3.62 టన్నులు వస్తుంటే మనకు హెక్టారుకు 4.5 టన్నుల వరకూ వస్తుంది. ఆ విధంగా ముందుకు వెళుతున్నాము. ఒకవైపు రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తున్నాము, మరోవైపు వారిని అన్ని రకాలుగా ఆదుకోవడానికి వ్యవసాయ యాంత్రీకరణ పనులు చేస్తున్నాము. ఈ రాష్ట్రం ముందుకు వెళ్లాలంటే ఉత్పత్తి, ఉపాధికావాలి. ఉత్పత్తి కావాలంటే పరిశ్రమలు కావాలి. అందుకోసం అనేక దేశాలలో మన ముఖ్యమంత్రిగారు పర్యటించారు. చైనా, జపాన్, సింగపూర్, యు.కె, యు.ఎ.ఇ, స్విజర్లాండ్ వంటి అనేక దేశాలలో పర్యటించి, వారిని ఆహ్వానించి, ఇండస్ట్రియల్ సమ్మిట్స్ నిర్వహించి, సుమారు 13 లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలు కుదిర్చారు. ఇంత భారీ ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. ప్రస్తుతం అగ్రిమెంట్‌లో ఉన్న పరిశ్రమలలో దేశంలో 10 శాతం వస్తుంటే మన రాష్ట్రంలో అయితే 30 శాతం నుండి 35 శాతం వరకూ అగ్రిమెంట్లు ఖరారవుతున్నాయి. ఉత్పత్తి ద్వారా ఉపాధి కూడా వస్తుంది. అనేకమందికి ఉద్యోగావకాశాలు కలుగుతాయి. తెలంగాణా, ఆంధ్ర విడిపోయిన తరవాత 85 శాతం పరిశ్రమలు తెలంగాణాకు వెళ్లిపోయాయి, కేవలం 15 శాతం పరిశ్రమలు ఆంధ్ర రాష్ట్రానికి వచ్చాయి. అటువంటప్పుడు రాష్ట్రంలో ఉత్పత్తి, ఉపాధి కావాలంటే మన రాష్ట్రంలో పరిశ్రమలను బాగా పెంచాలనే ఉద్దేశంతో ఈనాడు ముఖ్యమంత్రిగారు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రిగారు విదేశాలకు తిరుగుతున్నారని చాలా

మంది విమర్శిస్తున్నారు. ఆయన సరదా కోసం తిరగడం లేదు. ప్రజల కోసం, ప్రజల ఆకాంక్షల కోసం, ప్రజల ఉపాధి కోసం, రాష్ట్ర ఆదాయం పెంచడం కోసం తిరుగుతున్నారు. పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి కొత్తగా పరిశ్రమలు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారు. ఇటువంటి ఆలోచనలతో ముందుకు వెళుతున్నప్పటికీ కూడా కేంద్రం నుండి రావాల్సిన సహాయం రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిధంగా పారిశ్రామికంగా ఇంకా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు. మనం రూ.16,000 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్నామంటే వారు కేవలం ఐదారు వేల కోట్లు మాత్రమే లోటు అంటున్నారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్తి సహాయం చేయాలి. ఆంధ్ర రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు జీవనాడి. మన ముఖ్యమంత్రిగారు ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్ట్ ప్రగతిని సమీక్షిస్తూ పోలవరాన్ని మన రాష్ట్రానికే ఒక వరంగా తీసుకురావడానికి కృషిచేస్తున్నారు. అనేక విధాలుగా ఇబ్బందులు వచ్చినా కూడా వాటిని అధిగమించి ఈనాడు పోలవరం ప్రాజెక్టు పనులను భారీయెత్తున చేపట్టారు. కేంద్ర సహకారం ఇంకా పూర్తి స్థాయిలో అందకపోయినా దాదాపు 53 శాతం వరకూ పనులు పూర్తయ్యాయి. 2,500 కోట్ల రూపాయలు పోలవరంకు సంబంధించిన నిధులు కేంద్రం నుండి రావాల్సి ఉంది. హెడ్ వర్క్స్ 39 శాతం పూర్తయ్యాయి.

మ.01.30

అధ్యక్షా, మేము మొన్న ఎస్టిమేట్స్ కమిటీ ద్వారా వెళ్లి పోలవరం ప్రాజెక్టు చూసి వచ్చాము. అక్కడ పనులు బాగా జరుగుతున్నాయి. అది పూర్తయితే మనకు చాలా మంచి జరుగుతుంది. మనకు కేంద్రం నుంచి రైల్వేజోను రావాలి. అనేక పెట్రో కెమికల్ కాంప్లెక్సులు రావాలి. అమరావతిలో రాజధాని నిర్మాణానికి కూడా పూర్తి స్థాయిలో నిధులు రాలేదు. రూ.2500కోట్ల మేర నిధులు కేంద్రం నుండి వచ్చాయి. ఇంకా రావాల్సి ఉంది. రూ.1000 కోట్లే ఇస్తామన్నారు. కానీ మనం రూ.45,000కోట్లకు టెండర్లు పిలవడం జరిగింది. దానిలో సుమారు 74శాతం టెండర్లు వస్తే, మన అమరావతికి నిధులు ఇస్తారని ఆశిస్తుంటే, రావడం లేదు. ఏది ఏమైనప్పటికీ కడప స్టీలు ప్లాంటుకి కానీ, విశాఖ–చెన్నై పెట్రో కారిడార్ కానీ ఇలా 19 రకాలు ఉన్నాయి. వీటన్నింటిని పూర్తిస్థాయిలో చెయ్యాలి. అలాగే ప్రధానమంత్రిగారు ఏవైతే హామీలు ఇచ్చారో అవన్నీ కూడా చెయ్యాలని,ఈ రాష్ట్రం ముందుకు పోవాలంటే కేంద్రం పూర్తిగా సహకరించాల్సిన అవసరం ఉందని తమ ద్వారా తెలియజేసుకుంటూ, మరొకసారి గవర్నరు గారి ప్రసంగానికి నేను ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, గవర్నరు గారి ప్రసంగం మీద మాట్లాడేందుకు అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రధానంగా ఇందులో గత మూడున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రం చేసినటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రత్యేకించి రాష్ట్ర విభజన వల్ల నష్టపోయిన అంశాలన్నీ కూడా పొందుపరచడం జరిగింది. అలాగే రాష్ట్రాన్ని విభజన చేయకూడదని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన తరువాత కూడా కేంద్రప్రభుత్వమే రాష్ట్ర విభజన చేసింది. పార్లమెంట్ సాక్షిగా నాటి ప్రధానమంత్రి గారు ఇచ్చిన స్పెషల్ కేటగిరీ స్టేటస్ అయితేనేమి, అలాగే రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నటువంటి అంశాలు గానీ, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత

కూడా కేంద్ర ప్రభుత్వం పైన ఉన్నదని నేను స్పష్టంగా మనవి చేస్తున్నాను. అందులో స్పెషల్ కేటగిరి స్టేటస్‌కు, అలాగే ఫిబ్రవరి 20వ తారీఖున పార్లమెంటులో ఆనాటి ప్రధానమంత్రి గారు ఇచ్చిన హామీలను, అలాగే మార్చి 1వ తేదీన కేంద్ర కేబినెట్ అప్రూవ్ చేసిన అంశాలన్నింటిని కూడా మీ ముందు పెడుతున్నాను.

విభజన చట్టంలో ఉన్న అంశాలు, హామీల వల్ల అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందుతుందని మనం ఆశించడం జరిగింది. రాష్ట్ర విభజన జరిగినప్పుడు దాదాపు రూ.16,400కోట్లు లోటు బడ్జెటు ఉంది. అలాగే పోలవరం ప్రాజెక్టుకు రూ.58,450 కోట్లు అవసరం ఉంది. ఇప్పటివరకు ఈ నాలుగేళ్ల కాలంలో కేంద్రం నుంచి రూ.5,000కోట్లకు మించి రాలేదు. పునరావాస బాధితులకు దాదాపు రూ.33,000కోట్లు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉంది. 2019నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలి. అయితే దానిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తరువాత కూడా కేంద్రప్రభుత్వం నుండి నిధులు రావడం లేదు. ఈరోజు వరకు పునరావాస బాధితులకు రూ.33,000కోట్లు ఇస్తుందా, ఇవ్వదా అనేది ఇప్పటి వరకు తేల్చని పరిస్థితి నెలకొనిఉంది. అలాగే ప్రత్యేకంగా, వెనుకబడినటువంటి రాయలసీమ, ఉత్తరాంధ్ర ఏడు జిల్లాలకు కూడా రూ.24,000కోట్లు అవసరం అయితే రూ.1050కోట్లు మాత్రమే ఇచ్చారు. అయితే, మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌కు రూ.7,500 కోట్లు ఇచ్చిన అంశాన్ని ప్రస్తావిస్తున్నాను. పార్లమెంటు సాక్షిగా మరియు తిరుపతిలో ఎన్నికల ప్రచారంలో ఇప్పుడున్నటువంటి దేశ ప్రధానమంత్రి గారే దిల్లీకి సరిసమానమైనటువంటి రాజధానిని మీకు అందిస్తామని వాగ్దానం చేయడం జరిగింది. రాష్ట్ర ప్రజానీకం కూడా ఎంతో ఆశతో ఓహో, అమరావతి రాజధాని కూడా ఆ స్థాయిలో ఉంటుందని భావించారు. ఇప్పటికి రూ.2500కోట్లు మేర నిధులు కేంద్రం నుండి వస్తే, అందులో కేవలం రూ.1500కోట్లు మాత్రమే అమరావతి రాజధానికి ఇవ్వడం జరిగింది. మొత్తం పనులు మనకు పూర్తి కావాలంటే కనీసం మనకు రూ.45,000కోట్లు రావాల్సిన ఆవశ్యకత ఉంది. ఆ నిధులు ఇచ్చి కేంద్రం ఆదుకోకపోతే ఆ స్థాయి రాజధాని కాకపోయినా, హైదరాబాదులాంటి రాజధాని రావాలన్నా నిధులు రావాలి. కాబట్టి ఆ నిధులు రాకపోతే ఆశించిన లక్ష్యం నెరవేరని పరిస్థితి ఉంది. అలాగే కడపలో ఉక్కు పరిశ్రమ కూడా రావాల్సి ఉంది. ఇది విభజన చట్టంలో ఉంది. ఒక ఏడాదిలోపు దీనిపైన అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం కూడా కడపలో బ్రాహ్మణి ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రయత్నం చేయడం జరిగింది. ఇప్పుడు అడ్డం వచ్చినదేమి? దాదాపు ఐదారు నెలలుగా కడప జిల్లాలో ఉన్నటువంటి ప్రజానీకం అందరూ ఆందోళన చేస్తున్నారు. అలాగే జడ్‌పి జనరల్‌బాడీ మీటింగులోకూడా ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. మన ప్రభుత్వం కూడా కేంద్రానికి అనేక సార్లు విన్నవించడం జరిగింది. పారిశ్రామికంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేటటువంటి ఉక్కు కర్మాగారానికి ఇంతవరకు నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రం తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అలాగే రైల్వేజోన్ అంశంపై గానీ, ప్రత్యేకించి 9,10 షెడ్యూల్‌లో ఉన్నటువంటి ఆస్తుల పంపకం జరగాల్సి ఉంది. నాలుగేళ్లు అయినా ఆస్తుల పంపకం జరుగకుండా ఉంటే, మన రాష్ట్రానికి రావాల్సిన వాటా నిధులు రాకుండా పోతే, అభివృద్ధి పథంలోకి వెళ్లేందుకు ఆటంకంగా ఉంటుంది. దీనిపైన కూడా నాలుగేళ్లయినా

ఇంకా నిర్ణయం తీసుకోని పరిస్థితి ఉంది. అలాగే మనకు 19 షెడ్యూల్‌లో కానీ, 13వ షెడ్యూల్‌లోకానీ పేర్కొన్నటువంటి అంశాలు ఉన్నాయి. వెనుకబడినటువంటి అనంతపురంలో కేంద్రీయ విద్యాలయానికి పునాదిరాయి కూడా వేయలేదు. మన రాష్ట్ర ప్రభుత్వమే ఆస్తుల రూపంలో కాంపౌండ్‌వాల్‌కి గానూ స్థలం కేటాయించడం జరిగింది. కేంద్రం ప్రకటించిన విద్యాసంస్థలకు ఇస్తామన్న రూ.11,000కోట్లలో కేంద్రప్రభుత్వం నుంచి మనకు వచ్చింది కేవలం రూ.759కోట్లు మాత్రమే. మౌలికవసతులు రావాలి. విద్యాసంస్థలు పూర్తిగా నిర్వహణ జరగాలంటే దాదాపు రూ.11,000కోట్ల రూపాయలు అవసరం ఉంది. ఈ నాలుగేళ్లలో మనకు కేవలం రూ.1000కోట్లు కూడా రానప్పుడు ఇంకా రూ.11,000కోట్లు ఎప్పుడు వస్తాయి? ఈ విద్యాసంస్థలు ఎప్పుడు అన్ని మౌలిక వసతులతో రాష్ట్ర ప్రజానీకానికి అందుబాటులోకి వస్తాయి? ఇలాంటివి చాలా ఉన్నాయి. నిజానికి చెప్పాలంటే రాష్ట్రప్రజలందరూ ఒక ఆవేదనతో ఉన్నారు. బిహార్ ఎన్నికలు జరిగినప్పుడు అలాగే లక్షన్నర కోట్ల రూపాయలు వాళ్లకు ఇస్తామన్నారు. కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్నాయంటే, రూ.17,000కోట్లు మెట్రో ప్రాజెక్టుకు అనౌన్స్ చేయడం జరిగింది. అలాగే మహారాష్ట్రకు అనౌన్స్ చేయడం జరిగింది. ఈ మధ్యనే మధ్యప్రదేశ్‌లో బుందేల్‌ఖండ్‌కు అనౌన్స్ చేయడం జరిగింది. ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికలు ఉన్నాయనే ఉద్దేశంతో కావచ్చు, అలాగే స్పెషల్ కేటగిరీ **enhance renewal** చేయమని చెప్పి, పన్నుల రాయితీ రూపంలో రూ.24,413కోట్లు ఈశాన్య రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం ఇవ్వడం జరిగింది. మరి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇవ్వడానికి ఏమి అడ్డం వస్తుంది? ఈ విషయాలపై ఇస్తామని పార్లమెంటు సాక్షిగా గత ప్రధానమంత్రిగారే అనౌన్స్ చేశారు. విభజన చట్టంలో ఉంది. అలాగే రాష్ట్రముఖ్యమంత్రిగారు కూడా 29 సార్లు దిల్లీ వెళ్ళి కేంద్రప్రభుత్వానికి అప్పీలు చేసి, అభ్యర్థన చేసి రావడం జరిగింది. రాష్ట్రాలలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజానీకం కూడా ప్రధానమంత్రిగారు ఇస్తానని చెప్పినవే ఇమ్మంటున్నారు. కొత్తవి మాకు అక్కర్లేదు. ఏవైతే హామీలు ఇచ్చారో, విభజన చట్టంలో పేర్కొన్నారో వాటికే దిక్కు లేకపోతే, భవిష్యత్తులో చట్టసభలలో చేసే హామీలను, చట్టాలను అమలు చేయకుండా పోతే చట్టసభలకు గౌరవం తగ్గే ప్రమాదం ఉంది. ప్రజల నమ్మకాల్ని వమ్ముచేసే పరిస్థితులు ఆ రాజకీయ పార్టీలే కల్పించినట్లు అవుతుంది. అందుకోసం విభజన గాయాల నుంచి నష్టపోయిన మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పార్లమెంటు సాక్షిగా ఏ హామీలు ఇచ్చారో అవన్నీ కూడా తూ.చ తప్పకుండా అమలు చేయించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది. ఇది కేవలం బిక్ష కాదు. ఇది 5కోట్ల ఆంధ్రుల హక్కుగా నేను భావిస్తున్నాను.

మ.01.40

అధ్యక్షా, గవర్నరు గారి ప్రసంగంలో చాలా అంశాల పైన ఇందులో ప్రస్తావించడం జరిగింది. వ్యవసాయ రంగంలో దాదాపు 25.6 శాతం వరకు అభివృద్ధి చెందడం జరిగింది. దీనిలో క్రొత్త టెక్నాలజీని కూడా వినియోగించుకోవడమనేది చాలా మంచి పురోగతిలో ఉన్నది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే, గిట్టుబాటు ధరలకు సంబంధించి చూస్తే దాదాపుగా రైతులందరూ తీవ్రంగా నష్టపోతున్నారు. చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారికి కనీసం రూ.5,000కోట్లతో అయినా గిట్టుబాటు ధరలను

కల్పించడానికి ధరల స్థిరీకరణకు కూడా తగిన ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ అంశాన్ని కూడా గవర్నరుగారి ప్రసంగంలో పొందుపరిస్తే బావుంటుందని నేను అభిప్రాయపడుతున్నాను.

అధ్యక్షా, మానవాభివృద్ధి సూచికలో మన రాష్ట్రం 15వ స్థానంలో ఉన్నది. 2029 నాటికి జాతీయ స్థాయిలో అగ్రస్థానంలోకి వెళ్ళాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక టార్గెట్‌ను నిర్దేశించుకోవడం జరిగింది. ఇందులో భాగంగానే మానవాభివృద్ధి సూచికలో విద్య అనేది చాలా ముఖ్యమైనది. మన రాష్ట్రంలో 1,31,000 మంది అసలు బడి ముఖం చూడనటువంటి పిల్లలు ఉన్నారు. పాఠశాలల్లో చేరే పిల్లల్లో 20 శాతం మంది కూడా 10వ తరగతి వరకు చదువు కొనసాగించడం లేదు. మధ్యలోనే డ్రాపవుట్స్ అవుతున్నారు. అలాగే, ఇంటర్‌మీడియట్‌కి వచ్చేసరికి దాదాపు 50 శాతం వరకు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. కాబట్టి, బడి బయట ఉన్నటువంటి పిల్లలందరినీ కూడా బడి లోకి చేర్పించే దానికి సంబంధించి వాటిని రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేసే యంత్రాంగం కూడా ఉండాలని తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలలో చేరే వాళ్ళు, ప్రీ ప్రైమరీ స్కూల్లో చేరిన పిల్లలు కానీ, ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పిల్లలకు లెక్కలలో తేలనటువంటి పిల్లలు దాదాపుగా రెండు లక్షల వరకు మన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారు. వారి పేర్లు ఎక్కడా కూడా నమోదు కానటువంటి పరిస్థితి ఉన్నది కాబట్టి, వాటిపైన కూడా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అలాగే, ప్రత్యేకించి విద్యా రంగంలో మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి పెట్టింది. అయితే, నాలుగు గురుకులాలు, డిగ్రీ కళాశాలలు ఎక్కడికి వెళ్ళినా దాదాపు ఐదు రకాల ఉపాధ్యాయులు కనపడుతున్నారు. వారందరూ చేసే పని ఒకటే. కానీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్, పార్ట్ టైం, ఫుల్ టైం, గెస్ట్ లెక్చరర్లు, టీచర్లు అనే రకరకాల పేర్లతో ఉన్నారు. వీరికి సంబంధించి ప్రభుత్వంలో ఒక స్పష్టమైన విధానం అనేది ఉండాలి. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు వారిని కూడా రెగ్యులర్ చేస్తారా, చేయకపోతే వారికి రెగ్యులర్ వాళ్ళకి ఎన్‌హాన్స్‌మెంట్ చేసినప్పుడు జీతాలు వీరికి కూడా క్రమంగా పెంచేలాగా, వారికి ఉద్యోగ భద్రతను కల్పించేలాగా ప్రభుత్వం ఇటువంటి చర్యలను తీసుకోవాలని కోరుతున్నాను.

అదేవిధంగా జన్మభూమి కార్యక్రమంలో ఈసారి ప్రజల వద్దకే పాలన అన్నట్లుగా ప్రజల వద్దకే అధికారులు అంతా రావడం మంచి కార్యక్రమం. దాదాపు ఇందులో కోటి మంది ప్రజలు భాగస్వామ్యం కావడమనేది చాలా మంచిది. ఇందులో ఎన్ని అర్జీలు వచ్చాయి? ఎన్ని పరిష్కారమైనాయి? ఇంకా ఎన్ని పెండింగులో ఉన్నాయి అనే విషయాలు గవర్నరు గారి ప్రసంగంలో పొందుపరచి ఉంటే కనుక ఇంకా బాగుండేదని నేను అభిప్రాయ పడుతున్నాను.

అగ్రిగోల్డ్ బాధితులలో చనిపోయిన కుటుంబాలలోని ఒక్కొక్క బాధితునికి కనీసం రూ.5 లక్షల చొప్పున రూ.5కోట్లు గౌరవ ముఖ్యమంత్రిగారి ద్వారా ఆయా కుటుంబాలకు ఇవ్వడమనేది నిజంగా చాలా అభినందించదగ్గ విషయం. వాటిల్లో కూడా కోర్టు కేసులు, వారికున్నటువంటి ఆస్తులకు కూడా అటాచ్‌మెంట్ చేసి మిగిలిన రూ.4,000

కోట్లను కూడా వారికి ఇచ్చేలా చేయాలని నేను అభిప్రాయ పడుతున్నాను. ప్రత్యేకించి ఇందులో ప్రస్తావన చేయని వివిధ అంశాల పైన కూడా ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టాలని కోరుతున్నాను. అదేవిధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ప్రభుత్వం ఇచ్చిన హామీల పైన గానీ, ఈ ప్రభుత్వం ఎంత కాలం లోపల పరిష్కరిస్తుందో గవర్నరుగారి ప్రసంగంలో ఉంటే బావుంటుందని అభిప్రాయ పడుతున్నాను.

చివరగా ఒక మాట అధ్యక్షా. స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు కేంద్రరాష్ట్ర సంబంధాల పైన ఒక వ్యాఖ్యానం చేశారు. కేంద్రం స్థిరంగా ఉండాలంటే కనుక రాష్ట్రాలు కూడా బలంగా ఉండాలి. అలాగే, కాళ్ళుచేతుల వంటి రాష్ట్రాలు ఊడిపోయి, బలహీనంగా ఉంటే కేంద్రం కూడా స్థిరంగా ఉండదు. అందుకోసం రాష్ట్రాలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తప్పనిసరిగా కేంద్రం సహాయం చేయాలని ఆయన ఒకానొక సందర్భంగా మాట్లాడడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు ఆర్థికంగా విభజన గాయాల వలన నష్టపోయినటువంటి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చినటువంటి హామీలను అమలుచేసుకునే దానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజల పక్షాన కేంద్రం పైన మరింత ఒత్తిడి పెంచి, వాటిని సాధించుకోవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం పైనే ఉన్నది. అందులో నా వంతు ప్రయత్నంగా నేను దీనికి ఖచ్చితంగా నిలబడతానని చెప్పి తమ ద్వారా మనవిచేస్తూ, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, ధన్యవాదాలు. నేను సభలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా గవర్నరుగారి ప్రసంగాన్ని వినడం జరిగింది. చాలా సమగ్రంగా మన రాష్ట్రానికి సంబంధించిన అనేక విషయాలు ఆయన ప్రసంగంలో పొందుపరచడం జరిగింది. అందులో ఈ విషయం స్పృశించలేదు అని కాకుండా, అన్ని విషయాలను ఆయన స్పృశించడం జరిగింది. అయితే, రాష్ట్ర వ్యాప్తంగాను, దేశ వ్యాప్తంగా జరుగుతున్న చర్చలలో భాగంగా రేపు ఉపన్యాసం ఉండడం, అందులో ముఖ్యంగా ఈ గౌరవ సభలో 2017, మార్చి 17వ తారీఖున ధన్యవాదాలు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం మనకు ఇచ్చిన స్పెషల్ ప్యాకేజి కొరకు చట్టబద్ధత కల్పిస్తూ, ప్రధానమంత్రి గారు తీర్మానం చేసి పంపించడం జరిగింది. ఆ సందర్భంలో ఒక్క సంవత్సరంలోనే గవర్నరుగారి ప్రసంగంలో ప్రత్యేక కేటగిరీ హోదా కోసం మాట్లాడడంతో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ చట్టంలో అనేక అంశాలు ఏవైతే పూర్తికాలేదో వాటిని కూడా అనేక చోట్ల ప్రస్తావించడం జరిగింది. అయితే, ఆ ప్రస్తావన మొదటి రెండు, మూడు పేజీలకే పరిమితమైంది. ఆ తరువాత అంతా కూడా ఈ రాష్ట్రం ఏ రకంగా అభివృద్ధి చెందుతుంది. అనేక మౌలిక వసతులలోను, ఇతరత్రా విషయాలలోను ఈ రాష్ట్రం ఏ రకంగా ముందుకు వెళుతుందనే విషయాలను వ్రాశారు. అన్ని చోట్లా చాలా అద్భుతంగా ఈ రాష్ట్రం ప్రగతి సాధించింది అనే దానికి సంబంధించి అనేక రకాల తార్కాణాలు ఉన్నాయి.

మన దేశ అభివృద్ధి 6.5 శాతం ఉంటే, మన రాష్ట్ర అభివృద్ధి 11.6 శాతం వరకు అభివృద్ధి చెందిందని స్పష్టంగా ఈ రాష్ట్ర అభివృద్ధిని కొనియాడడం జరిగింది. అలాగే, వ్యవసాయ రంగానికి సంబంధించి హార్టీకల్చర్, ఆక్వా కల్చర్ అన్ని రంగాలు కలిపి సుమారు 25.8 శాతం అభివృద్ధిని సాధించడం జరిగింది. అదేవిధంగా పవర్ సెక్టార్‌లో వినూత్నంగా తీసుకువచ్చిన మార్పుల కారణంగా లోటును భర్తీ చేసుకుంటూ, దేశంలోనే ఒక అగ్రగామి

పవర్ సర్ప్లస్ రాష్ట్రంగా మన రాష్ట్రం ఏ రకంగా అభివృద్ధి చెందిందో అర్థమవుతోంది. అలాగే, అన్ని రకాల శాఖలకు కలిపి ఈ రాష్ట్రానికి దాదాపుగా 38 అవార్డులు కూడా వచ్చాయి. వాటిల్లో జాతీయంగాను, అంతర్జాతీయంగా కూడా అవార్డులు రావడం జరిగింది. ఇంతకు ముందు సభలో అందరు మంత్రులు ఉన్నారు. ఇప్పుడు కూడా ఉంటే బాగుండేది. అయినా అందరు మంత్రులు వారి వారి శాఖలలో అద్భుతమైన విజయాలను సాధించారు. ముఖ్యంగా మన పంచాయతీ రాజ్, ఐటి శాఖా మంత్రి శ్రీ నారా లోకేశ్ బాబు గారికి, మునిసిపల్ శాఖా మాత్యులు డా. పి.నారాయణ గారికి కూడా అవార్డులు రావడం జరిగింది. ముఖ్యంగా అర్బన్ శాఖ మరియు హౌసింగ్‌కు సంబంధించిన అంశాలలో కూడా మన రాష్ట్రానికి అనేక అవార్డులు రావడం జరిగింది. అలాగే, అనేక రకాల వసతులను తీసుకురావడంలో ఏ రాష్ట్రానికి రానన్ని ఇళ్ళను తెచ్చుకోవడంలోను, వాటి నిర్మాణంలో కూడా ఒక వినూత్న పద్ధతిని అవలంబించి ఈ రాష్ట్రం మరింతగా ముందుకు వెళ్ళడం జరిగింది.

అదేవిధంగా పవర్ సెక్టారులో కూడా శ్రీ కళా వెంకట్రావుగారి శాఖకు కూడా అవార్డులు వచ్చాయి. వారి రంగంలో అభివృద్ధిని చూసినా చాలా ఆనందం కలుగుతుంది. ప్రస్తుతం వారు సభలో లేరు, ఉంటే బాగుండేది. అలాగే, నీటిపారుదల రంగానికి సంబంధించిన విషయాలలో కూడా 33 ప్రాజెక్టులను ఏ విధంగా ముందుకు తీసుకువెళ్ళాలనే దానిపై అతి ముఖ్యంగా, అతి కీలకంగా దేశంలోనే ఎవరికీ లేని విధంగా జాతీయ ప్రాజెక్టుగా మనం తెచ్చుకుని భాక్రానంగల్ ప్రాజెక్టు కన్నా 100 శాతం నిధులు కేంద్రం నుంచి తెచ్చుకుని శరవేగంగా పోలవరం పనులు సాగుతున్న నేపథ్యంలో మొదటగా ఈనాడు గవర్నరుగారి ప్రసంగంపైన మాట్లాడిన గౌరవ సభ్యులు శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ గారు దాదాపు 36 నిముషముల సేపు మాట్లాడారు. అయితే, వారు దాదాపు 16 సార్లు రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ఏమిటి ఈ కక్ష, ఈ వివక్ష అని మాట్లాడారు. ఆయనే మాట్లాడడం కాకుండా, విజయవాడలో కూడా వచ్చే రహదారి వెంట అనేక పోస్టర్లలో ఇవే మాటలు ఉన్నాయి. అందులో మోదీజీ ఏమిటి, అన్యాయం చేశారు అనే పోస్టర్లే ఎక్కువగా ఉన్నాయి.

అధ్యక్షా, ఒకసారి త్రిపురలో ఎన్నికలు జరిగాయి. అక్కడ మా నినాదం ఏమిటంటే – 'ఛలో కరేంగే పల్టే' అని చెప్పి 25 సంవత్సరాల మాణిక్ సర్కార్ యొక్క వ్యవస్థ ఏదైతే ఉందో వామ పక్షాల నుంచి ఒకసారి కాషాయీకరణ జరిగిన విధంగా భారతీయ జనతాపార్టీ ద్వారా మా అందరికీ కూడా ఇది గొప్ప విజయం. చరిత్రలోనే ఇది ఘన విజయం. ఆ విజయానికి సంబంధించిన ఏదైతే నినాదం ఉందో ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించింది. అయితే, మన రాష్ట్రంలో ఈ విధంగా అంధంగా కనిపించే పరిస్థితులన్నీ ఒక్కసారి అంధకారంగా కనిపించిన పరిస్థితులు ఏర్పడుతున్నాయా అని చాలా బాధతో చెపుతున్నాను. ఇక్కడ అనేక రకాల విషయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి కాదు, రెండు కాదు, సుమారుగా విభజన చట్టానికి సంబంధించిన అన్ని అంశాలు కూడా ఇక్కడ కూలంకషంగా చర్చించే అంశాలన్నీ కూడా రాబోయే కాలంలో వస్తున్నాయి. ఆ విధంగా మనం వాటిని పొందుపరచాం.

గవర్నరుగారి ప్రసంగంలో కూడా అనేక సానుకూల విషయాలన్నీ వ్రాస్తూ, ఈ విధంగా ఏదైతే చర్చల్లో రాని అంశాలు, ఇతర చర్చించే అంశాలు వ్రాయడం జరిగిందో చాలా బాధకలిగిస్తున్నది. కేంద్రరాష్ట్ర సహకారంతో ఎప్పుడూ లేని విధంగా కో–ఆపరేటివ్ ఫెడరలిజం అనే క్రొత్త స్ఫూర్తితో అనేక వినూత్న కార్యక్రమాలను తీసుకువచ్చి నేరుగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి అనేక వినూత్న కార్యక్రమాలను తీసుకురావడం జరిగింది. అలాగే, వీటి ద్వారా అన్ని రాష్ట్రాలు కూడా ముందుకు వెళుతున్నాయి. ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రాన్ని కూడా గుర్తించిన కారణంగా కేంద్రప్రభుత్వం అనేక రకాలైన ప్రత్యేక సదుపాయాలను ఈ రాష్ట్రానికి కలిగించింది. ఇది వాస్తవాన్ని ఒప్పుకునే పరిస్థితే కానీ అందరూ కాదనేది కాదు. ఒకటి, రెండు విషయాలలో నిజంగానే తర్జనభర్జనలు జరుగుతున్నాయి. దానిపైన వ్యవస్థీకృతంగా ఒక ఆలోచన చేసి, పరిష్కారం చూసే దిశగా ప్రయత్నం జరుగుతుంది. ఈ విధంగా ఈ దశలో ఏదో మన రాష్ట్రానికి జరిగిపోయింది అనే దానిపై జరిగిన నష్టం అంతా ఇంతా కాదనే మాట్లాడడం జరిగింది. కేవలం ఒక్క విషయమే కాదు, అన్ని విషయాలను ప్రస్తావన చేశారు. అన్ని విషయాలపైన సమగ్రమైన సమాచారం, సమగ్రమైన సమాధానం కూడా తమ దగ్గర ఉంది.

అదేవిధంగా రెవెన్యూ డెఫిసిట్‌కి సంబంధించిన విషయం కానీ, ప్యాకేజీలకు సంబంధించిన విషయం కానీ, కూలంకషంగా మాట్లాడే సందర్భమే కానీ విభజన చట్టంలో లేని అనేక అంశాలను ఈ రాష్ట్రానికి తీసుకువచ్చి, ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో తీసుకురావడానికి ముఖ్యమైన భూమిక పోషించిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుంది. ఆయనకు కేంద్రప్రభుత్వం పూర్తి సహకారం అందించింది. 24/7 అన్నట్లుగా విద్యుత్తుకు ప్రత్యేకంగా మూడు రాష్ట్రాలలో ముఖ్యంగా మన ఆంధ్రరాష్ట్రానికి ఇవ్వడం ద్వారా మనం ఒక అడుగు ముందుకు వేశాము. అది మొదటి అడుగు.

పోలవరానికి సంబంధించిన ముంపు మండలాలను కలపడం ద్వారా మొదటి కేబినెట్‌లో ఆమోదించడం వలన పోలవరం ప్రాజెక్టు సాకారమయ్యే దిశగా వెళ్ళడం జరిగింది. ఈ పోలవరం ప్రాజెక్టు సాకారమవడంలో అతి ముఖ్యంగా ఉండే పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఏర్పాటు చేయడం మరియు వంద శాతం నిధులు కూడా కేంద్రమే మంజూరు చేసింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును నిర్మాణం చేయడం ద్వారా ఇంకా ఆ ప్రయత్నం త్వరితగతిన ముందుకు వెళ్ళే ప్రయత్నం ఏదైతే ఉందో ఇది చాలా అద్భుతమైనది. దేశంలో ఏ ప్రాజెక్టుకు, ఏ రాష్ట్రానికి ఏ కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విధంగా చొరవ చూపలేదు. మన రాష్ట్ర ప్రభుత్వమే మొదటిసారిగా చేసింది. దీనిని చాలా అభినందించాలి. ఈరోజున పోలవరానికి సంబంధించిన నిధులు ఇవ్వడం లేదని అనేక రకాలైన వార్తలు వస్తున్నాయి.

అధ్యక్షా, నేను చాలా బాధతో చెప్పేదేమిటంటే – పోలవరానికి సంబంధించి ఒక్కటంటే ఒక్క రూపాయి మా కేంద్ర ప్రభుత్వం దగ్గర ముఖ్యంగా సిడబ్ల్యుసి దగ్గర ఒక్క రూపాయి కూడా బాకీ లేదు. ఏ బిల్లు వస్తే, ఆ బిల్లు గడపలోకి వచ్చిన వెంటనే దానిని పంపిద్దామనే ఆడిట్‌కి సంబంధించి తరువాత చూసుకుందామనే ఆలోచనతో ఒక **pro-active** గా కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ గారు పనిచేస్తున్నారు. నేనే చెపుతున్నాను సుధీర్ దేవె అనే ఒక ఓఎస్‌డిని కూడా ఏర్పాటు చేశారు. పోలవరానికి సంబంధించిన విషయాలు ఎక్కడా కూడా ఆటంకం కలగకూడదని,

మధ్య మధ్యలో టెండర్లకు సంబంధించిన లెటర్లు వచ్చినా కూడా అవన్నీ టెక్నికల్ ఇష్యూలు. మిగిలిన అంశాలన్నీ అడ్డంకులయ్యాయి కానీ, ఎక్కడైనా నిధులను దానికి అలొకేట్ చేయడంలో ఎక్కడా ఇబ్బంది కలగలేదు.

ఈనాడు శరవేగంగా జరుగుతున్న పనులలో కాంట్రాక్టర్లు మారడం, కాఫర్‌డ్యాం కట్టడానికి తప్పకుండా అడ్డంకులు వస్తాయి కానీ ఇందులో ఎక్కడా అడ్డంకులు లేకుండా త్వరితగతిన ముందుకు వెళుతున్నారు. అలాగే, ఈ రాష్ట్రానికి కృష్ణ పై బ్యారేజి రావాలని చెప్పి ఒక సంవత్సరంలోనే కట్టాలని అనుకున్నాము. కానీ, ఒక సంవత్సరంలో కట్టకుండా ఉండడానికి అనేక రకాలైన సమస్యలు వచ్చాయి. అటువంటిది అనేక రకాలైన సమస్యలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు చిన్న విషయం కాదు. ఇందులో కూడా అనేక రకాల అడ్డంకులు వస్తాయి కాబట్టి త్వరిత గతిన పూర్తిచేసుకుని ముందుకు వెళ్ళవలసిన అవసరం ఉంది. ఇది కేవలం తెలుగుదేశం పార్టీకి సంబంధించిన అంశం కాదు, స్వతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న కలే. తప్పకుండా దీనికి అందరూ కలిసి సహకరించుకోవాలి. ఇది ప్రతి రైతుకు, ప్రతి కార్మికుడికి ఆసరాగా ఉండే ప్రాజెక్టు. కనుక ఇందులో ఎవరి చిత్తశుద్ధిని కూడా శంకించవలసిన అవసరం లేదు. ఆ విధంగానే మేము పూర్తి చిత్తశుద్ధితో పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తవడానికి ప్రయత్నం చేస్తున్నాము.

మ.01.50

అధ్యక్షా, రూ.33,000 కోట్లకు, పోలవరం నిర్వాసితులకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన విషయాన్ని ఇంతకు ముందే చెప్పడం జరిగింది. దాని గురించి ఈరోజు వరకూ అంచనాలకు వెళ్లలేదు. మంజూరు కాలేదు. 8 గ్రామాలకు సంబంధించిన నిర్వాసితులకు రోడ్లు, మౌలిక సదుపాయాలు కూడా సరిగా లేవు. శ్మశాన వాటికలు లేవు. పశువులను కట్టుకోవడానికి స్థలం కూడా లేదు. వారి స్థితిగతులు ఏమిటి? ఈ గ్రామాలు ఇలావుంటే సుమారు 102 గ్రామాలను డిసెంబరు 2017వ సంవత్సరానికి మూడవ దశలో తరలించవలసిన అవసరం ఉంది. కానీ పోలవరం నిర్వాసితులకు సంబంధించిన సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఈ పరిస్థితికి నేను కూడా బాధపడుతున్నాను. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం కారణంగానే జరగలేదేమోనని మేము అడిగాము. దానికి సంబంధించిన అంచనాలను అప్రూవ్ చేసుకోవాలి. ఇది చాలా పెద్ద పని. దీని కోసం 24/7 అనేక మంది అధికారులు పని చేయాలి. కానీ, దాని మీద ఇంత వరకు దృష్టి పెట్టలేదు. కేవలం స్పిల్‌వే కట్టి చూపించి 2019నాటికి మేము ప్రాజెక్టు కడతామని చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది తప్ప అది కాదని చెప్పడం జరిగింది. నిజంగా ఈరోజు అక్కడ డ్యాం కట్టి అందరికీ నీళ్లు ఇవ్వడం కావాలి. అతి ముఖ్యంగా ఎవరైతే అక్కడ భూములు కోల్పోతున్నారో వారిలో అనేక మంది గిరిజనులు, దళితులకు సంబంధించిన నివాసాల గురించి మనమంతా సమగ్రంగా ఆలోచించాలి. తప్పకుండా మేము కూడా మీతో కలిసి వచ్చి వారికి సంబంధించిన అంశం పట్ల మీరు చూపించే చొరవకు మేము చేదోడు వాదోడుగా ఉంటామని చెబుతున్నాను. ప్రాజెక్టు ఎంత పూర్తి చేశారో అంత మేరకు సుమారు రూ.4,679కోట్లు నిధులు రావడం జరిగింది. ఏ బిల్లు పెట్టినా నిధులు ఇవ్వడం జరుగుతుందని కూడా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇవే కాకుండా నేషనల్ హైవేస్‌కు సంబంధించి అన్ని రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రానికి కూడా నిధులు ఇవ్వడం జరిగింది. కానీ, మన రాష్ట్రానికి ఏమి ఇచ్చారని కొందరు గౌరవ సభ్యులు మాట్లాడుతున్నారు. లక్ష కోట్లు ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతుంటే మాకు చూపించండని ఛాలెంజ్ చేయడం జరిగింది. దీని గురించి సమాచారాన్ని సేకరించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర కూడా సమాచారం ఉంటుంది. సుమారు 18 సెక్టార్లలో దాదాపుగా రూ.1,15,000కోట్లు నేషనల్ హైవేస్‌కు ఇవ్వడం జరిగింది. ఏ రాష్ట్రంలో లేని విధంగా కేపిటల్ సిటీకి సంబంధించి ఇంటర్నల్ రోడ్లు, అవుటర్ రింగ్ రోడ్డు గురించి చెప్పారు. వీటికి సంబంధించిన నిధులు కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగింది. వీటికి సంబంధించిన విషయాల గురించి నోటును మీకు సమర్పిస్తాను. జాతీయ రహదారులకు సంబంధించిన విషయం దాచుకోవాల్సినది కాదు. అబద్ధాలు, అవాస్తవాలు చెప్పవలసిన అవసరం లేదు. ఇవన్నీ మన అథారిటీస్ దగ్గర ఉన్నాయి. అనేక రోడ్లు మంజూరు అయ్యాయి. జాతీయ రహదారులకు కేవలం రూ.6,000కోట్లు, రూ.7,000కోట్లు ఇచ్చారని మాట్లాడారు. ఒక నేషనల్ హైవే కట్టాలంటే భూమి సేకరణ దగ్గర నుండి చివరికి అది పూర్తియ్యేంత వరకూ కేంద్రమే భరిస్తుంది. దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా ఈ ప్రాజెక్టు మన రాష్ట్రానికి రావడం జరిగింది. అనేక రకాలుగా కేపిటల్ సిటీ నుండి అందరినీ అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేసే విధంగా నేషనల్ హైవే ప్రాజెక్టును మంజూరు చేయడం జరిగింది. మన రాష్ట్ర ముఖ్యమంత్రిగారు, మిగతా మంత్రివర్యులు ఏవైతే అడుగుతున్నారో అవన్నీ కూడా మంజూరు చేయడం జరిగింది. ఏ రాష్ట్రంలో కేపిటల్ సిటీకి ఇంటర్నల్ రోడ్లకు కేంద్రం నిధులు ఇచ్చిన దాఖలాలు లేవు. కానీ మన రాష్ట్రానికి మొదటిసారి ఇవ్వడం జరిగింది. దానికి కూడా తప్పు పడుతున్నారు. కేపిటల్ సిటీకి సంబంధించి రూ.2,500కోట్లు నిధులు ఇచ్చారు. కానీ, అది సరిపోదు. రూ.5,000కోట్లతో నిర్మాణం చేయాలి. మనకు ఉద్దేశం అయితే ఎంతైనా ఉండవచ్చు. పైన ఉన్న స్వర్గంలో ఇంద్రుని యొక్క ఇంద్రభవనంలాగా అమరావతిని కట్టాలని సంకల్పం ఉండడంలో తప్పు లేదు. ఆ విధంగా కట్టే ధైర్యం, నైపుణ్యం మన ఆంధ్రులకు ఉంది. తప్పకుండా ఆ అమరపురిని మించే విధంగా అమరావతిని కడదాము. దానిలో ఏ మాత్రం ధోకా లేదు. మీరే కట్టాలని కాదు. తప్పకుండా మనందరం కలిసి అమరావతిని నిర్మిద్దాము. ఆ విధంగా నిర్మాణం చేసే దిశలో ప్రారంభంగా డిపిఆర్ లేదని చెప్పారు. డిపిఆర్‌ని చూపిస్తే మేము కూడా చూసి తెలుసుకునేవాళ్లము. దానిలో ఏయే అంశాలు ఉన్నాయో, అంచనాలు, ప్రణాళికలు ఏవిధంగా ఉన్నాయో చెప్పాలి. సుమారు రూ.1,000కోట్లు అమరావతి గురించి ఆలోచించి గుంటూరు, విజయవాడకు సంబంధించి అండర్ గ్రౌండ్‌కు నిధులు ఇచ్చారు. తాత్కాలికంగా విభజన చట్టంలో కేపిటల్ సిటీకు కేవలం 4 అంశాలకు నిధులు ఇవ్వాలని చెప్పింది. దీనికి అదనంగా నిధులు ఏవిధంగా ఇవ్వాలనే ఆలోచనను కూడా కేంద్రం సానుకూలంగా చేస్తుందనే విషయాన్ని తెలియజేస్తున్నాను. తప్పకుండా రాజధాని నిర్మాణంలో ఎప్పటికప్పుడు ఏమేమి కావాలో అవన్నీ కూడా ఇవ్వడం జరుగుతుంది. మేము అమరావతి అసెంబ్లీకు వెళ్లి చూసినప్పుడు చుట్టూ అంతా ఎడారిలాగా ఉంది. చాలా మంది దీని అభివృద్ధికి నిధులు ఎప్పుడు వస్తాయా అని అనుకున్నారు. Rome is not built in a day. రాజధాని నిర్మాణం ఒక రోజులో అయ్యేది కాదు. దీని కోసం అనేక రకాలుగా మనం నిర్మాణాన్ని చేపడతాం. దురదృష్టం ఏమిటంటే 2019వ సంవత్సరం ఎన్నికల నేపథ్యంలో

రాజకీయ పరంగా మన ఆలోచన ఆ దిశగా ఉండగా మనకు ఈ అభివృద్ధి కనిపించదు. 2019వ సంవత్సరం దగ్గర పడుతుంది. అన్ని పనులు అరకొరగానే ఉన్నాయి. ఈ ఆతృతను నేను అర్థం చేసుకుంటాను. కేవలం దాని నేపథ్యంలో అనేక రకాల అభివృద్ధి పనులు జరుగుతున్న సందర్భాలలో ఆటంకాలు కల్పించకుండా ఉండాలని నేను రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నాను. మా గౌరవ అధ్యక్షులు పార్లమెంటు సభ్యులు హరిబాబు గారు గత మూడు రోజుల నుండి అనేక విషయాల గురించి మాకు తెలియజేస్తున్నారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వారు మాకు 60శాతం మార్కులు వేశారు. మా అధ్యక్షులు 85శాతం మార్కులు వేశారు. మేమైతే 100శాతం మార్కులు వేస్తాం. విభజన చట్టానికి సంబంధించిన అన్ని అంశాలు అమలు చేశాం. 13వ షెడ్యూల్‌కు సంబంధించిన అంశం పైన ఎక్కువగా చర్చ జరుగుతుంది. దానికి సంబంధించి 5 అంశాలున్నాయి. దానిలో హార్టికల్చర్‌ను తప్పిస్తే మిగతా అంశాలలో ఏ ఒక్క అంశం అయినా స్పృ శించకుండా ఉన్నామా? ప్రారంభం కాకుండా ఉన్నాయా అని ఈరోజు నేను అడుగుతున్నాను. విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీలలో దానిలో ఉన్న విద్యాసంస్థలకు సంబంధించినవన్నీ కూడా వచ్చి గ్రౌండ్ అయ్యాయి. విద్యాసంస్థలు అంటే అర్థం ఏమిటంటే క్లాసులు ప్రారంభం కావాలి. విద్యార్థులు చేరాలి. అన్ని విద్యాసంస్థలలో కూడా క్లాసులు ప్రారంభం కావడం, అక్కడ సరియైన విధంగా సిబ్బంది ఉండాలి. తాడేపల్లిగూడెంలో ఉన్న యన్.ఐ.టి. గురించి మనం ఉదాహరణగా తీసుకుందాము. ఎక్కడా లేని విధంగా ఆ యన్.ఐ.టిలో ప్రతి సంవత్సరం 480 మంది చేరుతున్నారు. దేశం మొత్తం మీద 23 యన్.ఐ.టిలు ఉన్నాయి. ఏ రాష్ట్రంలో ఏ యన్.ఐ.టి లో అయినా 50 నుండి 100 మంది విద్యార్థులు మాత్రమే చేరతారు. ఎక్కడా లేని విధంగా ఇంజనీరింగ్ విద్యార్థులు ఎక్కువ మంది ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈరోజు మన వారే అమెరికాలో కూడా అగ్రగామిగా ఉన్నారు. ఎందుకంటే ఇంజనీరింగ్ విద్య అంటే మన ప్రాంతం వారికి మక్కువ. వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ అని పెట్టారు. అయితే అక్కడ జరిగిన విషయం సభకు తెలియాలి. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి కాంపౌండ్‌వాల్ కట్టి గేట్ ఇచ్చిన తరువాత అక్కడ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అయితే దానికి రూ.50కోట్లు మొదట నిధులు ఇవ్వడం జరిగింది. దానికి సంబంధించిన మొదటి టెండర్‌ను కూడా పిలిచి ఎవరికైతే కాంట్రాక్టు ఇచ్చారో వారికి సుమారు రూ.187కోట్లు మొదటి దశలో మంజూరు చేయడం జరిగింది. అయితే దానిలో జరిగిన పొరపాటు ఏమిటంటే కాంపౌండ్‌వాల్ కట్టడం మధ్యలో ఆగిపోయింది. ఎందుకు ఆగిపోయింది? ఆ కాంట్రాక్టర్ మీద చర్య తీసుకోవడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సర కాలం పట్టింది. మా గౌరవ మంత్రివర్యులు మాణిక్యాలరావుగారు **persistent** గా కేంద్రానికి వెళ్లి మా నియోజకవర్గంలో యన్ఐటి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేద్దామనుకున్నాం కానీ, పనులు జరగకపోతే మా మీద నింద పడుతుందని కేంద్రానికి వెళ్లడం వలన ఈ కాంపౌండ్ వాల్ పూర్తి చేయడానికి సంవత్సరం పట్టింది. ఫస్ట్ టెండర్ వచ్చింది. భవనాన్ని 6నెలల్లో పూర్తి చేయాలని మొదటి దశ టెండర్ డాక్యుమెంట్‌లో వ్రాశారు. దానిలో ప్రీకాస్ట్ పద్ధతిలో 6నెలల్లో క్యాంపస్ కట్టి అక్కడ హాస్టల్స్ మరియు క్లాసులు కూడా ప్రారంభించాలని చెప్పారు. శరవేగంగా పనులు ప్రారంభమవుతాయి. కేవలం అదే కాకుండా మన అమరావతి దగ్గర ఉన్న ఎయిమ్స్ గురించి నేను మన 'Official facebook of Telugu Desam' లో Official pageలో చాలా దారుణంగా రూపాయి కూడా ఇవ్వలేదని

వ్రాశారు. అది చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఎయిమ్స్‌కు సంబంధించిన పని ఒకపక్క శరవేగంగా జరుగుతుంది. మొత్తం కాంట్రాక్టు టెండరింగ్ అయిపోయింది. భవన నిర్మాణం అయిపోతుంది. మన దగ్గరలోనే ఉంది. అందరూ వెళ్లి చూడవచ్చు. అందులో 30 సీట్లను కూడా కేటాయించడం జరిగింది. తప్పకుండా రాబోయే విద్యా సంవత్సరంలోనే క్లాసులు ప్రారంభం కాబోతున్నాయి. అక్కడ అనాటమీ డిపార్టుమెంటు వస్తుంది. తెలుగుదేశం నాలెడ్జ్ సెంటర్‌లో దానికి రూపాయి కూడా కేటాయించలేదని వ్రాయడం, అనేక మంది సభ్యులు బాధపడడం చాలా దురదృష్టకరం. ఐదు సంబంధిత అంశాల్లో 100శాతం అన్ని పనులు ప్రారంభమయ్యాయి. సెంట్రల్ యూనివర్సిటీ అలాగే ట్రైబల్ యూనివర్సిటీకి రూ.10కోట్లు కేటాయించడం ద్వారా అది కూడా ప్రారంభమయ్యింది. ఆ విధంగా సంపూర్ణంగా అన్ని విద్యాసంస్థలు రావడం జరిగింది. రూ.10కోట్లతో ఏమి వస్తాయని చాలా మంది మాట్లాడుతున్నారు. ఇంకా స్థల సేకరణ జరగలేదు. స్థల సేకరణ జరిగి, భూమి పూజ చేసి, అక్కడ కాంపౌండ్‌వాల్ కట్టిన తరువాత మిగతా పనులు ప్రారంభమవుతాయి. ఇన్స్టిట్యూషన్స్‌కు సంబంధించిన 100 శాతం నిధుల్ని కేంద్రమే భరిస్తుందని మీరంతా గమనించాలి. కేంద్రమే దాని టెండర్‌కు సంబంధించి కాంట్రాక్టర్‌ను నియమిస్తుంది. నిర్మాణం కూడా అంతే శరవేగంగా చేస్తారని తెలియజేస్తున్నాను. దాని తరువాత మౌలిక వసతులకు సంబంధించి అనేక అంశాలు ఉన్నాయి. అన్ని అంశాలను కూడా పరిశీలించాల్సిందిగా వ్రాయడం జరిగింది. పరిశీలించాల్సిన అంశాలను ప్రాధాన్యత అంశాలుగా ఈ ప్రభుత్వం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసికట్టుగా అనేక విషయాలలో పరిశీలించవలసిన విషయాలకు ప్రాధాన్యత తీసుకుని ముందుకు వెళదామని చెప్పడం జరిగింది. అన్ని అంశాలను 6 నెలల్లో పరిశీలించడానికి కమిటీలు వేయమన్నారు. దీనికి కమిటీలు వెయ్యలేదని ఒక్క అంశాన్ని అయినా చెప్పమనండి.

**మిస్టర్ డిప్యూటి చైర్మన్:** మీరు కంప్లీట్ చెయ్యండి. మీరు కంప్లీట్ చేస్తే వీర్రాజు గారు మాట్లాడతారు. మిగిలిన విషయాలు మీరు సోమవారం మాట్లాడుదురు గాని.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, అయిపోతుంది. ఆ విధంగా 13వ షెడ్యూల్‌లో ఉండే అంశాలలో 100శాతం ఇది స్పృశించలేదనే అంశం లేదు. మనం అతి ముఖ్యంగా సెక్షన్ 93ను గుర్తించుకోవాలి. 10సంవత్సరాలలో పూర్తిచేయాలని అన్నారు. మూడున్నర సంవత్సరాలలోనే ఎన్నో పూర్తి చేశారు. దీనిని అభినందించాలని నేను కోరుతున్నాను. ఇంత మేరకు పూర్తిచేయడం చారిత్రాత్మకం. మన గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీగారు 2022లోపు రెండు ప్లాంట్స్‌ను కంప్లీట్ చేయమన్నారు. పది సంవత్సరాలు సమయం ఇచ్చారు. ఇది చారిత్రాత్మకమైన విజయం. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అభినందించాలి. తప్పకుండా సభ్యులంతా ఇది గుర్తుంచుకోవాలని కోరుతున్నాను.

మ.02.00

నిజంగానే అనేక సాంకేతిక సమస్యలు ఉండవచ్చు. దుగరాజపట్నం పోర్టుకు సంబంధించిన సమస్య గానీ, కడప స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా ఇక్కడ మాట్లాడాలి. పయ్యావుల కేశవ్ గారు కూడా మొన్న దిల్లీ వెళ్ళి బీరేంద్ర

సింగ్ గారి సమక్షంలో మాట్లాడారు. ఇద్దరి మంత్రులతో కలిసి హైదరాబాదులో కూడా మాట్లాడటం జరిగింది. విశాఖపట్టణం రైల్వే జోన్ తప్పకుండా రావాలి, తప్పకుండా వస్తుందని చెపుతున్నాము. మాకు పూర్తి నమ్మకం కూడా ఉంది. అది ప్రధాన మంత్రి గారి దగ్గర పెట్టడం జరిగింది. ఒక రాజకీయ నిర్ణయం కారణంగా రైల్వే జోన్ రావడానికి చిక్కుముళ్లు ఉన్నాయి. వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలి. తప్పకుండా అనేక సవాళ్లున్నాయి. మొదటి సంవత్సరం ఆర్థిక లోటు ఉంది. దాని విషయంలో మనం తప్పకుండా సమగ్రంగా ఆలోచించాలి. రెవెన్యూ లోటు ఎందుకు ఉంది, అందులో ఏ అంశాలు ఉన్నాయి, ఎందుకు రాలేదనే విషయంలో మాక్కూడా బాధ కలుగుతుంది. ఎప్పటిదో కదా, మరి ఇప్పటికీ ఎందుకు రాలేదనేది చూస్తే, దానిలో అనేక నిజాలున్నాయి. అంటే, తెరవెనుక కొన్ని విషయాలు ఏవైతే ఉన్నాయో, ఆ విషయాలన్ని బయటకు వచ్చి మనం మాట్లాడాలి.

అధ్యక్షా, చివరిగా నేను చెప్పేదేమిటంటే – ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొనబడని అనేక విషయాలు ఇంతకు ముందు చెప్పినటువంటి 24/7 కరెంటు, నేషనల్ హైవేస్‌తోబాటు, National Academy of Customs, Excise and Narcotics (NACEN) అనంతపూర్‌లో, National Institute of Ocean Technology (NIOT) రాష్ట్రానికి రావడం, వీటికి సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం, ఆ ప్రాజెక్టు అక్కడ మంజూరు కావడం జరిగింది. Regional Institute of Education (RIE) నెల్లూరులో, Short Message Service Center (SMSC) టెక్నాలజీ సెంటర్ రావడం, కామధేను ప్రాజెక్టు, ప్లాస్టిక్స్‌కు సంబంధించి నైపర్ (NIPER) అనే సంస్థ రావడం కూడా జరిగింది. విజయవాడలో School of Planning and Architecture సంస రావడం, National Water Way No.4 ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేయడం జరిగింది. గతంలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణకు నిధులివ్వడంతో టెండరింగ్ ప్రాసెస్‌లో ఉంది. ఇది నిజంగా ఒక అద్భుతం. ఈ రాష్ట్రానికి ఒకప్రక్క నేషనల్ హైవేస్, ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి freight corridor, National Highway, Water way, Ports రావడం ద్వారా అద్భుతం జరగబోతోంది. ఇంటర్నేషనల్‌ఎయిర్‌పోర్టులు, దీనితోబాటు Indian Institute of Package (IIP), Indian Institute of Foreign Trade (IIFT), నెల్లూరులో మెగా లెదర్ ఫ్యాక్టరీ రావడం జరిగింది. అలాగే, విద్యుత్తుకు సంబంధించి మన సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు అనేక విషయాలు చెప్పారు. విద్యుత్ సంస్కరణలతోబాటు, మెగా సోలార్ పార్క్ ఈ రాష్ట్రానికి వచ్చింది. ఇవన్నీ కూడా ఎలా సాధ్యమయ్యాయి? ఈ జిల్లాలో ప్రాజెక్టు రాలేదు అనడానికి లేదు. ప్రతి జిల్లాలో ప్రాజెక్టులు రావడం జరిగింది. ఈసారి ఎక్కువగా ప్రాజెక్టు వచ్చిన జిల్లాలను చూస్తే, రాయలసీమ ప్రాంతంలోని అన్ని జిల్లాలకు రెండు, మూడు ప్రాజెక్టులు రావడం జరిగింది. ఉత్తరాంధ్రకు సంబంధించి ప్రాజెక్టులు పెద్దగా రానిప్రాంతం శ్రీకాకుళం.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మీకు 20 నిమిషాలు సమయమిచ్చాను.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, మాకు గంట సమయం ఇవ్వాలి.

**మిస్టర్ డిప్యూటి ఛైర్మన్:** మీ సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు సోమవారం దీనిపైనే మాట్లాడతారు కదా!

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, ఎందుకంటే ఒక్క విషయం. ఇక్కడ ఉన్న మా సభ్యులందరిపైనా దాడి చేస్తున్నట్లుగా అస్త్రాలు, శస్త్రాలు సంధిస్తున్న సందర్భంలో తప్పకుండా మాట్లాడాలి, అనేక విషయాలు చెప్పాలి. ఎందుకంటే, మాకు చెప్పాల్సిన అవసరముంది. మాకు ఒక్కొక్కరికీ గంటపాటు సమయమివ్వాలి. సభలోని సభ్యులందరికీ ఎంత సమయమిచ్చారో, అంత సమయమే మాక్కూడా ఇస్తే, తప్పకుండా ప్రతి విషయం గుర్తించి మేము మాట్లాడతాము. సభ్యులు శ్రీ కత్తి నర్సింహారెడ్డి గారు కూడా చెప్పారు.

**మిస్టర్ డెప్యూటి ఛైర్మన్:** 22 నిమిషాలయ్యిందండి. సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు సోమవారం మాట్లాడతారు.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, 22 నిమిషాలు సరిపోదు. (మైకు కట్ చేయబడింది)

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:** 23 నిమిషాలయ్యిందండీ.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, ఈ అసెంబ్లీ, కౌన్సిల్ ద్వారా వాస్తవాలు చెప్పాలి. అనేక అవాస్తవాలు, అబద్ధాలు ప్రచారమైపోతున్నాయి. ప్రజలందరూ ఏమిటిది మోదీ గారు ఇలా చేస్తున్నారు అని అడుగుతున్నారు. (మైకు తిరిగి కట్ చేయబడింది)

(ఆ సందర్భంలో తమ, తమ స్థానాల వద్ద నిలబడి ఉన్న సభ్యులు శ్రీ సోము వీర్రాజు మరియు డా.ఎ.ఎస్.రామకృష్ణ గార్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది)

**మిస్టర్ డెప్యూటి ఛైర్మన్:** వీర్రాజు గారూ, రామకృష్ణ గారూ, దయచేసి కూర్చోండి. మాధవ్ గారూ, మీరు వన్ మినిట్‌లో కంప్లీట్ చేయండి.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** విజయవాడలో కేంద్ర ప్రభుత్వం మీద ఉన్న కక్ష, వివక్ష నేపథ్యంలో ఆ పోస్టర్లు ఈ రోజుకి కూడా తొలగించకపోవడం వల్ల చాలా బాధ కలుగుతోంది. బాధతో వస్తున్న విషయాలే తప్ప, మరొకటి కాదు.

**డా.ఎ.ఎస్.రామకృష్ణ:** మీ కేంద్ర ప్రభుత్వమేనా? మాకు కేంద్ర ప్రభుత్వం కాదా?

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** మన కేంద్ర ప్రభుత్వమే. మీక్కూడా చెప్పాను కదా. ముఖ్యమంత్రి అంటే తెలుగు దేశం ముఖ్యమంత్రి కాదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మేము కొలుస్తున్నాము. అందరూ కూడా మాటి మాటికీ ఒకే మాట మాట్లాడతారు. 29 సార్లు ముఖ్యమంత్రి గారు దిల్లీకి వెళితే లెక్కచేశారా అనంటున్నారు. నేను నిజంగా అడుగుతున్నాను. ముఖ్యమంత్రి గారి నోటి ద్వారా అది చెప్పాలని అనుకుంటున్నాను. ఎప్పుడైనా ప్రధానమంత్రి గారు ముఖ్యమంత్రిగారికి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదా? ఇవ్వలేదంటే అది ముఖ్యమంత్రి గారికి, తెలుగుదేశం పార్టీకి అవమానం కాదు. మాకు అవమానం. ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అవమానం. తప్పకుండా ముఖ్యమంత్రి గారిని మేము కోరుతున్నాము. అనేకమంది ఇతరులు మాట్లాడుతున్నారు. మొట్టమొదట ఏ సందర్భంగా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదో చెబితే నేను కూడా వెళ్లి వెరిఫై చేస్తాను.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** క్లోజ్ చేయండి.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, ఒకే ఒక్క సందర్భం చెప్పారు. ఆ సందర్భం కూడా ఇంకొక పని మీద వెళితే ఆవిధంగా జరిగిందని చెప్పడమే తప్ప ఒక్కసారి కూడా జరగలేదు. ఎప్పుడు అడిగినా కూడా ప్రోయాక్టివ్‌గా మాట్లాడి, ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సహకారంతో ముందుకువెళ్లాలని అనుకుంటాము. అధ్యక్షా, సుమారు 30 జటిలమైన అంశాలు ఈ రాష్ట్రానికి ఇవ్వడం జరిగింది.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మాధవ్ గారూ, క్లోజ్ చేయండి. 25 నిమిషాలు మీకు ఇచ్చాను. కోపరేట్ చేయండి. ప్లీజ్.. మళ్లీ సోమవారం వీర్రాజు గారు మాట్లాడతారు కదా?

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, ఇప్పుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ గారు చేసిన దాడికి, మిగతా సభ్యులు చేసిన దాడికి సమాధానం 20 నిమిషాల్లో చెప్పడం సాధ్యంకాదు. గవర్నర్ గారు ఏవైతే విషయాలు ప్రస్తావించారో, ఆ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని తప్పకుండా ఈ రాష్ట్రం సంతోషకరమైన, సమర్థవంతంగా ముందుకు వెళ్లడానికే మేము ప్రయత్నం చేస్తాము అధ్యక్షా. (మైక్ కట్ చేయబడింది)

(ఆ సందర్భంలో తమ, తమ స్థానాల వద్ద నిలబడి ఉన్న సభ్యులు శ్రీ సోము వీర్రాజు, డా.ఎ.ఎస్.రామకృష్ణ, శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అంతరాయం)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** దయచేసి మీరు కూర్చోండి. సభ తిరిగి రేపు ఉదయం 10.00 గంటలకు సమావేశమగుటకు వాయిదా వేయడమైనది.

(The House then adjourned at 02.06 p.m. to meet again at 10.00 a.m. on Thursday, the 8th March 2018)

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**